ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 134 పేజీలు: 10+4 వెల: 8.00

కొత్త ఆర్మీచీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ 5

ట్రంప్ 80వ బర్త్‌డేకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

CBC 17101/13/0010/2627

ఆరోగ్య భారత్, శక్తి భారత్



ఆయుష్మాన్ భారత్ కింద 70 ఏళ్లు పైబడిన 60 కోట్ల మంది వయోవృద్ధులకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

దేశ వ్యాప్తంగా 19,000కు పైగా జన ఔషధి కేంద్రాల ద్వారా 90 శాతం వరకు తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు

12 ఏళ్ల విశ్వాసం, వికాసం, జన సంక్షేమం

Government of Bharat

# వార్‌కు ఫుల్‌స్టాప్!

**జెనీవాలో ఇరాన్, అమెరికా శాంతి ఒప్పందానికి అంతా సిద్ధం**

**ఉభయ పక్షాల మధ్య తుది చర్చలు**

**ఒప్పందం ఖాయమన్న పాక్ ప్రధాని**



**ఇస్లామాబాద్,జూన్ 13:** దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు ముగింపు కార్డు పడుతోంది. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా వేదికగా ఒప్పందంపై అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతినిధులు సంతకాలు చేస్తారన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. దీనికి తోడు ట్రంప్ కూడా తన ట్రూత్‌పోస్టులో ఐరోపా దేశాల్లోనే >>2



## శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ

యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఓ

పెరిగిన స్వదేశీ రక్షణ సామర్థ్యం 5

# అంతా హై అలర్ట్

## అనూహ్యంగా మారుతున్న వాతావరణం



**పోలీసులు, మునిసిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్‌బోర్డు అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**భారీ వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు సమీక్షించి సత్వర చర్యలు: సిఎం రేవంత్**

**శంషాబాద్‌కు రావాల్సిన పలు విమానాలు దారి మళ్లింపు**

**హైదరాబాద్ సహా పది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్13:** గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో వాతావరణం అనూహ్యంగా మారిపోతోంది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాల కారణంగా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించడంతో శంషాబాద్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ల్యాండింగ్‌కు అనుకూలించకపోవడంతో ఢిల్లీ నుంచి వచ్చే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమానానికి ఏటీసీ అనుమతి నిరాకరించింది. దీంతో ఆయన విమానం బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చింది. అలాగే, ఢిల్లీ, ముంబయి సహాపలు ప్రాంతాల నుంచి వచ్చిన మరికొన్ని విమానాలను కూడా దారిమళ్లించారు. ఇక, శనివారం కూడా ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు వెల్లడించారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. ప్రతికూల వాతావరణం, తక్కువ విజిబిలిటీ కారణంగా శంషాబాద్‌కు రావాల్సి న పలు విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించినట్టు ప్రకటించారు. ముఖ్యంగా ముంబయి, బెంగళూరు, పుణే, నాందేడ్, వారణాసి, ఢిల్లీ, సింగపూర్ తదితర నగరాల నుంచి వచ్చే విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. వీటిలో ఎయిరిండియా, స్పైస్‌జెట్, ఇండిగో విమాన సర్వీసులు ఉన్నాయి.

దారి మళ్లించినవాటిలో ఎయిరిండియా సర్వీసు నెంబరు ఏఐ 2875 ముంబయి హైదరాబాద్, స్పైస్‌జెట్ ఎస్ 5 174 పుణే హైదరాబాద్, ఎస్5 197 నాందేడ్ హైదరాబాద్, ఇండిగో 6ఇ 6683 వారణాసి హైదరాబాద్, 6ఇ 1028 సింగపూర్ హైదరాబాద్, 6ఇ638 బెంగళూరు హైదరాబాద్, 6ఇ 5236 ముంబయి హైదరాబాద్, 6ఇ 717 ఢిల్లీ హైదరాబాద్, 6ఇ 2083 నియామే హైదరాబాద్ సర్వీసులు ఉన్నాయి. మొత్తం 9 సర్వీసుల్లో ముంబయి- హైదరాబాద్, పుణే- హైదరాబాద్, నాందేడ్- హైదరాబాద్, సింగ్‌పూర్ -హైదరాబాద్, ఢిల్లీ-హైదరాబాద్ విమానాలను బెంగళూరుకు, >>2

**వర్షాలపై క్షేత్రస్థాయిలో డిజిపి ఆనంద్ పరిశీలన** 2



శనివారం సిరిసిల్లలో ప్రభుత్వ పాఠశాలను పరిశుభ్రం చేస్తున్న కేంద్రమంత్రి బండిసంజయ్-3లో

## రేపటి నుంచి బడులు మొదలు

**ప్రభుత్వ స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్ అమలు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 13:** తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలలు రేపు(సోమవారం) పునః ప్రారంభం కానున్నాయి. 52 రోజుల వేసవి సెలవుల అనంతరం తిరిగి సోమవారం నుంచి బడిగంట మోగనుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతుండగా.. ఈఏడాది నుంచి ఉదయం విద్యార్థులకు అల్పాహారం (బ్రేక్ ఫాస్ట్)తో పాటు పాలను కూడా >>2

## సింగరేణిపై ప్రత్యేక శ్రద్ధ చూపించండి

**రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందన్న అంశంపై దృష్టి సారించండి**

**సిఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ**

2

## రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం

**కారు ఢీ కొని ముగ్గురు మృతి**

# మన ఎయిర్‌ఫోర్స్ సుపర్బ్

**యుద్ధతంత్రాన్ని మార్చివేసిన ఉపగ్రహాలు, డ్రోన్‌లు, రోబెటిక్స్**

**వైమానిక దళంలో నారీశక్తికి పెద్దపీట: రక్షణ మంత్రి రాజ్‌నాథ్**



శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమిలో క్యాడెట్లకు వింగ్స్ ప్రదానం చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**హైదరాబాద్ (అల్వాల్), జూన్ 13 ప్రభాతవార్త:** సాంకేతికత యుద్ధ తంత్రాలను పూర్తిగా మార్చివేశాయని ఉపగ్రహాలు,డ్రోన్లు, సెన్సర్లు, రోబోటిక్స్ వ్యవస్థలపై పట్టు ఉన్న సైనిక శక్తులు నేడు అత్యవసరమని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైబర్ దాడులు, ట్రాఫిక్ వ్యవస్థలు, సీసీటీవీ నెట్‌వర్క్‌లను నియంత్రించే పరిస్థితిలు ఉన్నాయని హెచ్చరించారు. భవిష్యత్తు యుద్ధ విధానాలను అర్థం చేసుకుని వ్యూహాత్మకంగగా అడుగులు వేయాలని యువ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం నగర శివారు దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమిలో 231వ గ్రాడ్యుయేషన్ పరడ్ అట్టహాసంగా జరగగా ముఖ్య అతిథిగా రక్షణ శాఖ మంత్రి విచ్చేశారు. 194మంది పురుషులు, 37మంది మహిళలు వైమానిక దళం అధికారులుగా నియమితులయ్యారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీకి చెందిన తొలి మహిళా బ్యాచ్‌లో ఇందులో ఉండడం విశేషం. పరడ్‌ను సమీక్షించిన రాజ్‌నాథ్ సింగ్ శిక్షణ పూర్తి చేసిన క్యాడెట్లుకు వింగ్స్ ప్రధానం చేశారు. భారతీయ నౌకాదళం, కోస్ట్‌గార్డ్, వియాత్నంకు చెందిన 14 మంది శిక్షణ పూర్తి చేసిన వారిలో ఉన్నారు. దేశానికి వైమానిక దళం రక్షణ కవచంగా నిలుస్తోందని రక్షణ శాఖ మంత్రి కొనియాడారు. పాకిస్తాన్, చైనా యుద్ధాలుతో పాటుగా కార్గిల్ ఇటీవలి ఆపరేషన్ సింధూర్‌లు ఇందుకు నిదర్శనమని తెలిపారు. స్వదేశీ సాంకేతికతకు తోడు సుశిక్షితులైన సిబ్బందితోనే ఇది సాధ్యమైందన్నారు. చిన్న దేశాలు సైతం ఆధునిక సాంకేతికత కొత్త వ్యూహాలుతో పెద్ద >>2

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మంత్రి తుమ్మల వాంగ్మూలం



**ఎంపి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపి అంజన్ కుమార్‌ల వాంగ్మూలం నమోదు చేసిన సిట్**

**ఎన్నికల సమయంలోని ఫోన్ నంబర్ల వివరాలు తీసుకొన్న అధికారులు**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనంరేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో బాధితులుగా వున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌ల వాంగ్మూలాన్ని సిట్ అధికారులు శనివారం నమోదు చేశారు. ఇందులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంటికి సిట్ అధికారులు వెళ్లి గంటకు పైగా ఆయన నుంచి నాటి ఘటనలపై విచారించి వాంగ్మూలం తీసుకోగా కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ సాయంత్రం వేళ కమాండ్ కంట్రోల్‌లోని సిట్ కార్యాలయానికి వచ్చి వాంగ్మూలం ఇచ్చారు. బిఆర్ఎస్ హయాంలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసులో బాధితుల వాంగ్మూలం నమోదు, విచారణ కొనసాగుతూనే వుంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వెంట వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ సిట్ అధికారుల బృందం వేరు వేరుగా విచారించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు మంత్రి తమ్మల అప్పట్లో ఆరోపించడం తెలిసిందే. ఈ విషయం నిజమేనని ఫోన్ ట్యాపింగ్‌పై విచారిస్తున్న సిట్ అధికారులు నిర్ధారించడం విదితమే. దీనిపై బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసంలో తుమ్మల నాగేశ్వరరావు ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు నాటి ఘటనలపై ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఎన్నికల సమయంలో వాడిన ఫోన్ నంబర్ల వివరాలను సిట్ అధికారులు మంత్రి తుమ్మల నుంచి తీసుకున్నారు. తుమ్మలను ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ప్రశ్నలు సంధించి వాటికి సమాధానాలు తీసుకున్నారు. కాగా ఇదే కేసులో రాజ్యసభ >>2

**గౌహతి, జూన్13:** అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఎఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు >>2

## అసోంలో కూలిన విమానం.. ఐదుగురు మృతి



# కాంగ్రెస్ ఫస్ట్ హాఫ్ ఫెయిల్యూర్

**రైతుబంధును రాహుల్ బంధు చేశారు..**

**పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు ముమ్మరం: కెటిఆర్**



సిరిసిల్లలో కెటిఆర్

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఫస్ట్‌హాఫ్ పాలన పూర్తిగా విఫలమైందని, సినిమా ఫస్ట్ హాఫ్ డిజాస్టర్ అయితే సెకండ్ హాఫ్ పట్ల ఆశలు ఉండవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన నియోజకవర్గ సమావేశంలో కేటీర్ పాల్గొని డిజిటల్ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వైఫల్యాలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు, ఎరువుల తిప్పలు, పంట కొనుగోలు సంక్షోభాలతో కాంగ్రెస్ మళ్లీ పాత రోజులను తెచ్చిందన్నారు. తరుగు పేరుతో రైతులను నిలువునా ముంచుతున్నారని ఇక్కడ ధాన్యం కొనుగోలుకు సంచులు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే, ఢిల్లీలో >>2



# అధికారుల 'పల్లీ'మేత!

**రైతులకు ఇవ్వాల్సిన వేరుశెనగ విత్తనాలు బ్లాక్‌లోకి**

**ఎఓ సస్పెన్షన్, ఇద్దరు ఎఇఒల తొలగింపు**

**మరో అధికారిపై బదలీ వేటు**

**కొడంగల్ అధికారులపై సిఎం సీరియస్**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** రైతులకు ఇవ్వాల్సి న ఉచిత, సబ్సిడీ వేరుశనగ విత్తనాలను బ్లాక్ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకున్న వ్యవసాయశాఖ అధికారులపై క్రమశిక్షణ వేటు పడింది. మండల వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేయడమే కాకుండా ఇద్దరు సహాయ అధికారులను విధుల నుంచి తొలగించారు. సహాయ సంచాలకుడిపై బదిలీ వేటు వేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజవర్గం కొడంగల్‌లో చోటు చేసుకున్న సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే.. కొడంగల్ నియోజకవర్గం దుద్యా ల మండలంలో వాల్యూ చైన్ క్లస్టర్ (వీసీసీ) ద్వారా వంద శాతం ఉచితం, బ్లాక్ లెవల్ డెమోన్‌స్ట్రేషన్ ద్వారా 50%సబ్సిడీ వేరుశనగర విత్తనాలను మొన్నటి యాసంగి సీజన్‌లో సరఫరా చేయాలి. కానీ అధికారులు కొంతమంది రైతులకు మాత్రమే విత్తనాలను సరఫరా చేశారు. మిగిలిన విత్తనాలనునల్లబజారులో విక్రయించినట్లు దుద్యాల, పోలేపల్లి,గౌరారం, ఈర్లపల్లి, కుదురుమల్ల, లగచర్ల, హస్నాబాద్, హంసంపల్లి తదితర గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా రైతులకు >>2



హైదరాబాద్ దుండిగల్‌లో శనివారం జరిగిన ఎయిర్‌షోలో సారంగ్ హెలికాప్టర్ల విన్యాసం దృశ్యం

# మన ఎయిర్‌ఫోర్స్ సూపర్బ్

>> శక్తులకు సైతం సవాలు విసురుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు నిత్య శిక్షకుడిగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. శిక్షణలో పొందిన అనుభవాలను పాఠాలను భుజాలుపై వేసుకుని దేశ రక్షణలో పాలు పంచుకోవాలని సూచించారు. ప్రతి భారతీయుడి విశ్వాసానికి ప్రతీకలని తెలిపారు. అపరేషన్ సింధూర్‌లో నారీ శక్తిని చూశామని చెప్పారు. మహిళల బాగస్వామ్యం పెరగడం ద్వారా వైమానిక దళాన్ని మరింత బలంగా, సమతుల్యంగా మారుస్తోందన్నారు. ఆకాశమే మన హద్దు ఇల్లు అనే నినాదంతో ముందుకు సాగాలని తెలిపారు.

2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో నారీ శక్తి తోడ్పడుతుందని తెలిపారు. ఫైలట్ కోర్సులో ఉత్తముడిగా నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ ఆశిష్ కుమార్ యాదవ్ ప్రెసిడెంట్ ఫ్లాగ్, స్వోర్డ్ ఆఫ్ హానర్‌ను అందుకున్నారు. నావిగేషన్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ ఏక్తా గుప్తా, గ్రౌండ్ డ్యూటీ నందు ఫ్లైయింగ్ ఆఫీసర్ దివ్యాంశి సింగ్‌లు ప్రెసిడెంట్ ఫ్లాగ్‌కు అందుకున్న వారిలో ఉన్నారు.

**అలరించిన ఆకాశ విన్యాసాలు**

పరడ్ సందర్భంగా నిర్వహించిన ఆకాశ విన్యాసాలు ప్రత్యేక ఆరక్షణగా నిలిచాయి. ఎయిర్ చీఫ్, ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ నేతృత్వంలో ఫ్లైపాస్ట్ నిర్వహించారు. పిలాటస్, ఎంకె 11, హాక్, కిరణ్, చేతక్ శిక్షణా విమానాలు పాల్గొన్నాయి.

అకాశ గంగ స్కై డైవింగ్ బృందం రెండు వేలు అడుగులు ఆకాశం నుంచి నిర్దేశిత పరడ్ గ్రౌండ్ వద్ద కచ్చితత్వంతో దిగడం వారి కఠోర శిక్షణకు మచ్చుతునకగా చెప్పవచ్చు. మహిళా ఎయిర్ వారియర్ డ్రిల్, సారంగ్ హెలికాప్టర్, సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ ప్రదర్శన హైలెట్‌గా నిలిచాయి. ఆఖరిగా భారతీయ వైమానిక దళం ప్రధాన యుద్ధ విమానం అయిన సుఖోయ్ 30 ఎంకేఐ పడర్‌కు విచ్చేసిన ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మంత్రి తుమ్మల వాంగ్మూలం

>> సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఆయన తండ్రి మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్‌లకు సిట్ అధికారులు శనివారం ఉదయం నోటీసులు ఇచ్చి సాయంత్రం విచారణకు రావాలని కోరారు. ఈ నోటీసులకు స్పందించిన అనిల్ కుమార్ సాయంత్రం కమాండ్ కంట్రోల్‌లో వున్న సిట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తండ్రి, కొడుకలను సిట్ అధికారులు గంటపాటు విచారించి, పలు అంశాలపై వాంగ్మూలం తీసుకున్నారు. విచారణ అనంతరం అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయం లో తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు తెలిపారని, దీనిపై తాను నాటి ఘటనలకు సంబంధించి వివరాలు చెప్పానని వెల్లడించారు.

అప్పట్లో పిసిసి అధ్యక్షుడుగా వున్న రేవంత్ రెడ్డి ఆదేశాలను తాను పాటించే వాడినని, ఆయన చెప్పిన కార్యక్రమాలను నిర్వహించే వాడినని, అయితే తాను ఏ కార్యక్రమం చేసినా అక్కడ పోలీసులు ముందుగానే వుండడం తనను ఆశ్చర్య పరిచేదని అనిల్ కుమార్ తెలిపారు. ఇదంతా ఫోన్ ట్యాపింగ్ వల్ల జరిగిందని ఆ తరువాత తమకు తెలిసిందని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో అనేక మంది ప్రముఖుల ఫోన్‌లను చట్ట విరుద్ధంగా నాటి సర్కారు ఇష్టానుసారంగా ట్యాప్ చేసి భారీగా లబ్ది పొందిందని ఆయన ఆరోపించారు. తన తండ్రి అంజన్ కుమార్ యా దవ్ ఫోన్‌ను కూడా ట్యాపింగ్‌కు గురైందని ఆయన ఆరోపించారు. ఈ కేసులో దోషులకు కఠిన శిక్షలు పడాలని ఆయన తెలిపారు. తమ ఇంటికి మరోసారి వచ్చి వాంగ్మూలం తీసుకుంటామని సిట్ అధికారులు తెలిపారని ఆయన అన్నారు. కాగా కేసులో మరికొందరు రాజకీయ ప్రముఖులను కూడా విచారించేందుకు సిట్ సిద్ధమవుతోంది.

## 'పల్లీ'మేత!

>> విత్తనాలు ఇవ్వకుండానే రికార్డుల్లో మాత్రం ఇచ్చినట్లు నమోదు చేసుకున్నారు. ఈ విషయమై క్లష్టర్ల ఏఈవోలను రైతులు సంప్రదించగా తమకేమీ సంబంధం లేదని, ఉన్నతాధికారులకే తెలుసునని నిర్లక్ష్యపూరిత సమాధానాలు ఇచ్చారు. సీఎం జిల్లాలో అధికారుల తీరుపై అనుమానం వచ్చిన రైతు సంఘం నేతలు, పలువురు నాయకులు ఆరా తీశారు. అధికారులు రూపొందించిన లిస్ట్‌ను సేకరించి ఆయా గ్రామాల రైతుల ద్వారా సమాచారం సేకరించారు. తమకు ఎలాంటి విత్తనాలు అందలేదని చాలామంది రైతులు సమాధానం ఇచ్చారు. ఉచిత, సబ్సిడీ విత్తనాలను రైతు వేదికలో కాకుండా అగ్రోస్ రైతు సేవా కేంద్రం, ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచడాన్ని తప్పుపట్టారు. భారీగా విత్తనాలు నల్లబజారులో విక్రయించారని గ్రహించిన రైతు నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, స్థానిక అధికారులు మాత్రం బుకాయించినా ఒక్క దుద్యాల మండలంలోనే 399 మంది రైతులకు చెందిన విత్తనాల్లో చాలా వరకు అక్రమంగా తరలించినట్లు తెలుసుకున్నారు. దాంతో పాటు 617 మందికి చెందిన కంది విత్తనాలు కూడా గోల్‌మాల్ చేసినట్లు గుర్తించారు. ఈ స్కామ్ వెలుగులోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించారు. ప్రాథమికంగా లభించిన ఆధారాల మేరకు విత్తన సరఫరా లోపభూయిష్టంగా జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమానికి బాధ్యులుగా పేర్కొంటూ దుద్యాల వ్యవసాయశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఈనెల 10న వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు నివేదించారు. ఈ మేరకు ఏవో నాగరాజుపై శాఖపరమైన వేటు వేశారు. బొంరాస్‌పేట మండలం మెట్లకుంట క్లస్టర్ ఏఈవో, దౌల్తాబాద్ మండలం గోకఫస్లవాద్ ఏఈవోను సర్వీసు నుంచి తొలగిస్తూ ఆదేశించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనారు. జవాబుదారీతనాన్ని కాపాడలన్న ఉద్దేశ్యంతో కొడంగల్ ఏడీ శంకర్ రాథోడ్‌ను హెడ్‌ఆఫీసుకు అటాచ్ చేశారు.

## బడులు మొదలు

>> అందించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, యుఆర్ఎస్‌లతోపాటు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు కూడా వేసవి సెలవులు కొనసాగాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన వేసవి సెలవులు ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమై జూన్ 11 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నట్టు 2025-26 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించారు. 49 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభవుతాయని ప్రకటించారు. 2026-27 విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభం కావల్సి ఉన్నప్పటికీ .. ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తుల మేరకు పాఠశాలలను ఈ నెల 12 నుంచి కాకుండా ఈ నెల 15 నుంచి పునః ప్రారంభించాలని నిర్ణయించినట్టు పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 13 రెండోవ శనివారం, 14 ఆదివారం వస్తున్నందున, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఈ నెల12కు బదులుగా ఈ నెల 15న తిరిగి తెరవాలని నిర్ణయించనట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. కోల్పోయిన విద్యా సమయాన్ని భర్తీ చేయడానికి 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన బోధనా దినాలను ఖచ్చితంగా పాటించేలా చూసేందుకు, పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు జుల నెలో రెండవ శనివారం అయిన ( తేది 11.07.2026)ను సాధారణ పనిదినంగా పరిగణించాలని నిర్ణయించినట్టు డైరెక్టర్ ప్రకటించారు.

## ఐదుగురు మృతి

>> తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. మృతులను స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్‌కు చెందిన ఖేమ రామ్ కుమావత్, డానిష్, ఆలమ్‌గా గుర్తించారు. విమాన ప్రమాదంలో వాయుసేనకు చెందిన అయిదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వాయుసేన యోధుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. దేశానికి వారు అందించిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## వారం - వర్జ్యం

14-06-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
చతుర్దశి మ.2.19
రోహిణి రా.10.13
వర్జ్యం : మ.3.14-సా.4.37
2) రా.3.06 -తె.4.30
దు.సా.4.51-సా.5.43
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృషభం:** ఇంటా బయటా అనుకూల స్థితి. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మిథునం:** ఆప్తుల నుండి సహాయం అందుతుంది. పోటీ పరీక్షలలో ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కర్కాటకం:** దూరప్రాంతాలలో ఉన్న మీ వారి క్షేమ సమాచారం ఆనందానికి కారణం అవుతుంది. వాహనసౌలభ్యం కలదు.

**సింహం:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వ్యాపారాలకు తగిన లాభాలు పొందుతారు ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**కన్య:** ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. కీలక సమాచారం అందుకుంటారు. బాకీలు వసూలవుతాయి.

**వృశ్చికం:** పెట్టుబడులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం.

**ధనుస్సు:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. మొండి బాకీలు వసూలవుతాయి. ధనలాభం పొందుతారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**మకరం:** ఉద్యోగంలో అనుకోని చిక్కులు ఎదురవుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** ప్రతి చిన్న విషయానికి జీవిత భాగస్వామితో సంప్రదింపులు సాగిస్తారు. సహోద్యోగుల అండదండగా నిలుస్తారు.

**మీనం:** ముఖ్యమైన దరఖాస్తు ఫారాలకు జత చేయవలసిన పత్రాలను పరిశీలించుకోవడం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వార్‌కు ఫుల్‌స్టాప్!

>> ఒప్పందం జరుగుతుందని కూడా ధృవీకరించారు. ఇపుడు తాజాగా పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రకటన చేసారు. అమెరికా ఇరాన్ మధ్య చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ చేశారు. శాంతి ఒప్పందానికి మేం ఎప్పుడూ ఇంత దగ్గరగా రాలేదు. మరో 24 గంటల్లోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. తర్వాత ఎలక్ట్రానిక్ సంతకాలు, వచ్చే వారమే సాంకేతిక స్థాయి చర్చలు జరుగుతాయని పాకిస్థాన్ పీఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చర్చల సమయంలో ఎంతో సహకరించిన అమెరికా ఇరాన్ ప్రభుత్వాలకు షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ఇచ్చిన పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు కూడా ధన్యవాదాలు చెప్పారు. దీర్ఘకాలిక శాంతి దిశగా ఈ చారిత్రక ఒప్పందం బలమైన పునాది వేస్తుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించారు. షరీఫ్ ప్రకటనకు ఒకరోజు ముందుగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఈ ఒప్పందం గురించి వ్యాఖ్యలు చేశారు. ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం ఇంతకుముందెన్నడూ లేనంత దగ్గరలో ఉంది. తుది ఒప్పందం పూర్తయ్యే వరకు మీడియా ఊహాగానాలన్నింటికీ దూరంగా ఉండాలని చెప్పారు. అరాగ్చీ పోస్ట్‌ను యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడం విశేషం. అయితే ఇక్కడ ఒప్పందం తుది దశకు చేరుకుంటుందన్న తరుణంలోనే ఇరాన్‌పై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఇరాన్ మీడియా కథనాల్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇరాన్ మీడియా ప్రకటనలకు, చర్చల్లో అంగీకరించిన అంశాలకు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందం విషయంలో ఇరాన్ ఏ మాత్రం నిజాయతీగా వ్యవహరించడం లేదన్నారు. వారితో వ్యవహరించడం చాలా కష్టం అని, వెంటనే తమ వైఖరి మార్చుకోవాల్సి న అవసరం ఉందని ట్రంప్ హెచ్చరించారు. ఒప్పందంలోని విషయాల్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ వెల్లడించారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తి వేయడం సహా హార్ముజ్ జలసంధి నిర్వహణలో పలు కీలక మార్పులు వంటివి ప్రతిపాదిత ఒప్పందంలో ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ వద్ద ఉన్నటువంటి యురేనియం అంశాన్ని కూడా చర్చల్లో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక అవగాహనా ఒప్పందంలో కొన్ని నిబంధనలపై వారాలుగా నిలిచిపోయిన చర్చల అనంతరం ఇటీవల ఇరాన్, అమెరికా తాము ఒప్పందానికి చేరువవుతున్నట్లు సంకేతాలు ఇచ్చాయి. కానీ అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో ఇరు వర్గాల అంగీకారం కుదిరే వరకు ఒప్పందం ఖరారైందని చెప్పలేమని ఇరాన్ స్పష్టం చేసింది. ఇటు ఒప్పందానికి చేరువైనట్లు ప్రకటనలు వస్తుండగా మరోవైపు హార్ముజ్ జలసంధిలో శనివారం వాణిజ్య నౌకల్ని లక్ష్యంగా చేసుకున్న పలు ఇరాన్ డ్రోన్లను అమెరికా కూల్చివేసినట్లుగా ప్రకటించడం ఆందోళనలు రేకెత్తిస్తోంది.

ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వయంగా పాల్గొని ఒప్పందంపై సంతకం చేసే వీలుందని సమాచారం. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఘాలిబాఫ్ కూడా ఈ పత్రాలపై సంతకాలు చేయనున్నట్లు దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ సమావేశ వేదికను అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది. ఇరాన్ డిమాండ్లు ఒప్పందంలోని ముసాయిదా అంశాలు ప్రస్తుతం శనివారం నాటికి ఈ కీలక దౌత్య ఒప్పంద ముసాయిదా చర్చలను పూర్తిగా పూర్తి చేసి ఒక తుది నిర్ణయానికి రావాలని ఇరుపక్షాలు ఒక బలమైన గడువుగా పెట్టుకున్నాయి.

ప్రాథమిక ముసాయిదా ప్రకారం, ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా గ్రూపుతో ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక పోరాటాన్ని కూడా నిలిపివేయాలని ఇరాన్ గట్టిగా కోరుతోంది. దశాబ్దాలుగా ఉన్న వివాదాస్పద అణు కార్యక్రమాలు బహుళ నిబంధనలపై ముందస్తు చర్చలను మాత్రం ఈ ఒప్పందంలో కాకుండా, తదుపరి చర్చల్లో మాత్రమే సమీక్షించాలని భావిస్తున్నారు. ముందు 60 రోజుల కాల్పుల విరమణ అమలుచేయాలనినిర్ణయించారు.

# అంతా హై అలర్ట్

>> వారణాసి -హైదరాబాద్ చెన్నైకు, బెంగళూరు- హైదరాబాద్ విమానం నాగ్‌పూర్‌కు మళ్లించినట్టు తెలిపాయి. కాగా, సిఎం రేవంత్‌రెడ్డి బెంగుళూరు నుంచి ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇక, శనివారం కూడా హైదరాబాద్ సహా తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడటంతో సంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్.. నల్లగొండ, మహబూబాబాద్, ఖమ్మం, హైదరాబాద్, మేడ్చల్, మెదక్ జిల్లాలకు ఐఎండి అరెంజ్ అలర్ట్ జారీచేసింది.

నగరంలో అనేక ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. శంషాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.రాందేవ్ గూడా, మణికొండ, నార్సింగి, లంగర్ హౌస్, హైదర్‌గూడ, అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది.

మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కోండాపూర్, రాయదుర్గం ప్రాంతాల్లో వాన కురిసింది. మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీ షరీఫ్, జూబ్లీహిల్స్,బంజారాహిల్స్, అమీర్పేట్, యూసుఫ్ గూడా, సనత్‌నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ బాచుపల్లి, హైదర్‌నగర్, ప్రగతినగర్ మూసాపేట్ పరిసరాల ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ఈ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం కారణంగా స్థానికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పలు చోట్ల రోడ్డంతా నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నీరు ఉండంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు నీటిలోనే ప్రయాణించాయి. షాద్‌నగర్‌లో భారీ వర్షానికి జాతీయ రహదారిపై భారీగా నీరు నిలిచింది.

బెంగళూరు హైదరాబాద్ హైవేపై నీరు నిలవడంతో వాహనదారుల ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని హై అలర్ట్ ఉండాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు.

పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్ సహా సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షి ంచి చర్యలు చేపట్టాలని చెప్పారు. నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. రెయిన్ ఫోర్ కాస్టింగ్ ఆధారంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని సూచించారు.



శనివారం హైదరాబాద్‌లోని మల్కం చెరువు వద్ద వర్షాలపై అధికారులతో సమీక్షిస్తున్న డిజిపి ఆనంద్. చిత్రంలో సైబరాబాద్ కొత్వాల్ రమేష్ తదితరులు

## వర్షాలపై క్షేత్రస్థాయిలో డిజిపి ఆనంద్ పరిశీలన

**శేరిలింగంపల్లిలో సైబరాబాద్ బల్దియా కమిషనర్ సృజన, కొత్వాల్ రమేష్‌లతో సమీక్ష**

**హైదరాబాద్ జూన్ 13, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివార్లలో కురుస్తున్న భారీ వర్షాలపై డిజిపి ఆనంద్ శనివారం నాడు క్షేత్రస్థాయిలో ప రిశీలించారు. సైబరాబాద్‌లోని పలు ప్రాంతాలను ఆయన స్థానిక మున్సిపల్ కమిషనర్ సృజన, కొత్వాల్ రమేష్ సహా ఇతర అధికారులతో క లిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిపి ఆనంద్ అధికారులకు కీలక సూచనలు చేశారు. వర్షాల సమ యంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సైబరాబాద్‌లోని మల్కం చెరువును డిజిపి పరిశీలించారు. వర్షా ల సమయంలో ఈ చెరువుకు వచ్చే నీరు ఏ మేరకు వుంటుందని, పూర్తిగా నిండితే వరదనీరు వెళ్లే మార్గం సవ్యంగా వుండేలా చూడాలని, ఈ సందర్భంగా దిగువ ప్రాంతంలో వుండే ప్రజలకు వరదముప్పు లేకుండా జాగ్రత్త పడాలని, దీనిపై అక్కడి పోలీసులను, పౌర అధికారులను అ ప్రమత్తం చేయాలని డిజిపి ఆదేశించారు. ఈ చెరువుకు సంబంధించిన వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయ ంలో వర్షాలు పడిన సమయంలో ట్రాఫిక్ నిర్వహణ సవ్యంగా వుండాలని, ట్రాఫిక్ పోలీసులు వర్షం కురిసినపుడు కచ్చితంగా రోడ్లపైనే వుండా లని, ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని డిజిపి ఆదేశించారు. వర్షాలు కురిసే సమయంలో పోలీసులు ప్రజలకు అందుబాటులో వుండాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ ఫస్ట్ హాఫ్ ఫెయిల్యూర్

>> రాహుల్ గాంధీకి మాత్రం సంచుల సంచుల తెలంగాణ డబ్బులు వెళ్తున్నాయని ఆరోపించారు. రైతుబంధును బలహీనపరిచి రాహుల్ బంధు మొదలుపెట్టారని ధ్వజమెత్తారు .వేములవాడ ఎమ్మెల్యే ఎన్నికల ముందు బాండ్ పేపర్ రాసిచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హిట్లర్ స్ఫూర్తి అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి డైలాగులు ఎక్కువ.. పని తక్కువని ప్రజలు పాలు ఇచ్చే బర్రెను వదిలి, తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్లుగా కాంగ్రెస్‌ను ఎన్నుకొని ఇప్పుడు బాధపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆరేనని మళ్లీ కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష. కేసీఆర్ హయాంలో జరిగిన కల్యాణలక్ష్మి, మెడికల్ కాలేజీలు, గురుకులాలు, కాళేశ్వరం లాంటి అభివృద్ధి పనుల ముందు రేవంత్ రెడ్డి చేసిందేమిటో చెప్పాలి? అని కేటీఆర్ సవాల్ విసిరారు.

నాకు జన్మనిచ్చింది శోభమ్మ అయితే, రాజకీయంగా పునర్జన్మనిచ్చింది సిరిసిల్ల ప్రజలేనని ఒక్క రూపాయి, ఒక్క చుక్క మద్యం పంచకుండా నన్ను గెలిపించిన సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉండటం నా గర్వకారణమన్నారు. నా ప్రాణం ఉన్నంతవరకు సిరిసిల్ల అభివృద్ధే నా లక్ష్యమని అధికారం పోయినా లక్షలాది మంది కార్యకర్తలు పార్టీ వెంటే ఉన్నారు, వారే మా అసలైన బలమని అధికారం కోల్పోయినప్పటికీ ఇటీవల సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటడమే ఇందుకు నిదర్శనమని కేటీర్ అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, తుల ఉమా, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించండి

**రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందన్న అంశంపై దృష్టి సారించండి**

**సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ**

**హైదరాబాద్, జూన్ 13 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం, భారత ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంలో ఉన్న సింగరేణి సంస్థ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాసారు. ఈ సందర్భంగా పలు అంశాలను లేఖలో ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సింగరేణి పాత్ర కీలకమని, ఈ సంస్థ ద్వారా 40,000 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారన్నారు. అంతేకాకుండా, దేశంలోని బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి గణనీయమైన పాత్ర పోషిస్తూ, దేశ ఇంధన భద్రతకూ విశేషంగా దోహదపడుతుందని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి సింగరేణి సంస్థ.. నిరంతర అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం అనేవి కీలకం అన్నారు. అత్యంత ప్రాధాన్యమైన అంశాలపై ఇటీవల కాలంలో కొన్ని కథనాలు కలవర పెడుతున్నాయన్నారు. సింగరేణిలో అవకతవకలు, అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వస్తున్న వాటిలో నిజానిజాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోకపోతే సింగరేణి ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందన్న ప్రచారంపై స్పందించాలన్నారు. దీనివల్ల సంస్థకు గణనీయమైన ఆర్థిక నష్టం సంభవించినటు ప్రచారం జరిగిందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సి న రూ.51,500 కోట్లకు పైగా బకాయిల కారణంగా సింగరేణి ఆర్థికంగా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో, ఇటువంటి కథనాల వల్ల సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని మరింతగా దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు వీటిని తక్షణమే పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టకపోతే సింగరేణి ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడటమే కాకుండా, సంస్థ భవిష్యత్ అభివృద్ధి, స్థిరత్వానికి కూడా ఆటంకం కలగవచ్చునని లేఖలో పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించిన వాస్తవాలను పరిశీలించి, ఆరోపణల్లోని నిజానిజాలపై సమగ్ర విచారణ జరపాలని లేఖలో పేర్కొన్నారు. సింగరేణి సమర్థవంతమైన నిర్వహణ కోసం తగిన సేఫ్ గార్డ్స్, మెకానిజం, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ సరిగ్గా అమలవుతోందా అనే అంశాన్ని సమీకించాల్సి న అవసరం ఉందన్నారు. ఈ సమీక్షలో టెక్నాలజీ బేస్డ్ మానిటరింగ్ టూల్స్ వినియోగించడం అవసరమని భావిస్తున్నాను. అలాగే సమయానుగుణంగా సమీక్షలను నిర్వహించడం ద్వారా లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. ఇటువంటి ప్రయత్నం ద్వారా.. వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను తొలగించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా నిరోధించడంతోపాటుగా.. సంస్థ సామర్థం, పారదర్శకత, విశ్వసనీయతను మరింత బలోపేతం అవుతుందన్నారు. సంస్థ సజావుగా పనిచేయడంలో సంస్థకోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం విషయంలోనూ, మీరు ప్రత్యేక చొరవతీసుకోవాలని లేఖలో కోరారు.

## రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**కారు ఢీ కొని ముగ్గురు మృతి**

**కొండపాక, జూన్ 13, ప్రభాతవార్త:** ఒక్కరిని తప్పించబోయి ముగ్గురు ప్రాణాలను బలితీసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం. ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు మహిళాలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాజీవ్ రహదారిపై దుద్దెడ గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న టిఎస్ 02. ఈఎక్స్ 9005 నెంబర్ గల కారు హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో దుద్దెడ గ్రామంలోకి రాగానే అదే సమయంలో రోడ్డు దాటుతున్న అరే రాధవ్వ(60)ను తప్పించబోయి కారును రోడ్డు ఎడమ వైపుకు తిప్పడంతో అదే సమయంలో తన ఇంటి ముందు కూర్చున్న ఎరుకల లచ్చవ్వ(65)ను, కారు ఢీ కొట్టడంతో రాధవ్వతోపాలు లచ్చవ్వ అక్కడికక్కడే మృతి చెందారు. లచ్చవ్వ పక్కనే ఉన్న మరో 12 సంవత్సరాల బాలికను కారు బలంగా ఢీ కొట్టడంతో బాలిక ఎగిరి గోడకు పడడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. అజాగ్రత్తగా, అతి వేగంగా వచ్చిన కారు ముగ్గరి ప్రాణాలను బలి తీసుకొని పక్కనే ఉన్న విద్యుత్ స్తంబాన్ని బలంగా ఢీ కొట్టడంతో స్తంబాం విరిగిపోయి కారు అక్కడే నిలిచిపోయిందని తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలుకాగా చికిత్స కోసం సిద్దిపేట జనరల్ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. త్రి టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో 15 వినూత్న కార్యక్రమాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళి99 రోజుల ప్రభుత్వ కార్యాచరణలో 15 వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్డు భద్రతలో టెక్నాలజీ వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా చంద్రాయణపల్లి వద్ద జాతీయ రహదారి 44పై వీడియో ఇన్సిడెంట్ డిటెక్షన్ సిస్టమ్ ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తర్ణికల్ గ్రామంలో 32 సీసీ కెమెరాలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా పంచవటి విద్యాలయంలో చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ప్రారంభించారు. చిన్న వయసు నుంచే పిల్లలకు ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించేలా ఈ పార్క్‌ను ఏర్పాటు చేశారు. పిల్లలు తమ సమస్యలు చెప్పుకునే వేదికగా పలు జిల్లాల్లో బాల్ పంచాయతీలు ఏర్పాటు చేశారు. స్థానిక సమస్యలపై పిల్లలు మాట్లాడే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమంలోని ప్రత్యేక అంశం. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడే గోల్డెన్ అవర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. సీపీఆర్ శిక్షణలో 48,227 మంది పాల్గొన్నారు. అత్యవసర సమయంలో స్పందించేందుకు 5,863 మంది వాలంటీర్లను ఫస్ట్ రెస్పాండర్లుగా నమోదు చేశారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్లారు. డ్రోన్ డెమోన్స్ట్రేషన్లు, పీఎం-కుసుమ్ పథకంలో అమర్చే వ్యవసాయ సోలార్ పంప్‌సెట్ల ప్రదర్శనలు నిర్వహించారు. రైతు వారంలో టీజీ ఆర్గానిక్స్ యాప్ ప్రారంభించారు. సహజ వ్యవసాయం, ఆర్గానిక్ ఉత్పత్తులు, రైతు మార్కెట్ అనుసంధానం కోణంలో ఇది కీలక డిజిటల్ అగ్రి కార్యక్రమంగా నిలిచింది. మహిళా సాధికారతను గ్రీన్ ఎనర్జీతో అనుసంధానించేలా సోలార్ పవర్ ప్లాంట్లు ప్రారంభించారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్లు ప్రారంభమయ్యాయి. జనగాంలో 2, నిజామాబాద్‌లో 8, వనపర్తిలో 1 సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభించారు. మహిళలు, పిల్లల పోషణలో తండ్రుల భాగస్వామ్యాన్ని పెంచేలా ప్రత్యేక ప్రచారం నిర్వహించారు. 38,144 మంది తండ్రుల భాగస్వామ్యం తో ఫాదర్ పార్టిసిపేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 19,367 మంది గర్భిణులకు అనీమియా స్క్రీనింగ్ నిర్వహించారు. న్యూట్రిషన్ ఎగ్జిబిషన్ , వంటల పోటీలు, డైటరీ డైవర్సిటీ కార్యక్రమాలు చేపట్టారు. ఉన్నత విద్యలో ఇన్నోవేషన్ సదుపాయాలు బలోపేతం చేశారు. జేఎన్‌టీయూహెచ్‌లో మేకర్ స్పేస్, ఈవెంట్ హాల్, కో-వర్కింగ్ జోన్లు, జియో-ఇన్ఫర్మాటిక్స్ ల్యాబొరేటరీ వంటి సదుపాయాలు ప్రారంభించారు. పర్యావరణ థీమ్ కింద 200 మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు దివ్యాంగులకు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపెయిన్‌లో భాగంగా జూట్ బ్యాగులు కమ్యూనిటీ సభ్యులకు పంపిణీ చేశారు. గ్రామ, కమ్యూనిటీ స్థాయిలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించే అవగాహన కల్పించారు. 'యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ' డ్రైవ్, 2కే వాక్‌థాన్, రన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఉద్యోగాలు, క్రీడలతో పాటు స్వచ్ఛత కార్యక్రమాల్లోనూ యువత పాలుపంచుకున్నారు.

## అర్ధరాత్రి అభిషేక్ బెనర్జీ ఇంట్లో పోలీసుల తనిఖీలు




**కోల్‌కతా, జూన్ 13:** టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నివాసంలో శుక్రవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో దర్యాప్తు నిమిత్తం కాళీఘాట్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు పార్టీ వర్గాలు ఆరోపించాయి. ఈ తనిఖీల గురించి తెలుసుకున్న పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ హుటాహుటిన అభిషేక్ నివాసానికి చేరుకున్నారు. సల్ట్‌లేని ప్రాంతంలోని ఓ భూమికి సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న అభిషేక్ బెనర్జీ అనుచరుడి కోసం తాము గాలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. అభిషేక్ నివాసంలో నాలుగు గంటలకు పైగా సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అయితే పోలీసులతోపాటు కేంద్ర భద్రతా బలగాలు కూడా తనిఖీల్లో పాల్గొనడంతో టీఎంసీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఈ ఆపరేషన్ చేపట్టారని విమర్శించారు. మరో ఘటనలో మున్సిపాలిటీ నియామకాల కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు టీఎంసీ ఎమ్మెల్యే మదన్‌మిత్ర నివాసంపై దాడులు చేశారు. కామర్‌హాతి మున్సిపాలిటీతో సహా వివిధ మున్సిపాలిటీల్లోని పోస్టులలో మదన్ మిత్ర అనర్హులైన అభ్యర్థులను నియమించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను వారి నుంచి భారీ మొత్తంలో నగదు, బంగారం తీసుకున్నట్లు తెలిపారు. సోదాలు నిర్వహిస్తుండగా అతడి మంచం కింద నగదు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## కాంగ్రెస్‌లో కలకలం.. షబ్బీర్‌అలీకి ఏఐసిసి షోకాజ్ నోటీసులు

### పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.వైరల్ అయిన ఆడియోలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై కూడా షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగు తోంది. ఈ ఆడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిం చేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అంతర్గత వ్యవహారాలను బహిరంగ చర్చకు తీసుకురావడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# మోడీ 12 యేళ్ల పాలనా స్ఫూర్తితో చీపురు పట్టి ఊడ్చి, పైపుతో నీళ్లు చల్లి..

### క్లాస్‌రూంను శుభ్రపరిచిన కేంద్రమంత్రి బండి సంజయ్
### ఈసారి టెన్త్ విద్యార్థులకు మళ్లీ పరీక్ష ఫీజు చెల్లిస్తానని హామీ
### టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందిస్తానని వెల్లడి

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ 'స్వచ్ఛ పాఠశాల' కార్యకర్తగా మారారు. ప్రధాని నరేంద్రమోడీ 12 యేళ్ల పాలనను పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను 'స్వచ్ఛ పాఠశాల' పేరుతో శుభ్రంచేసే పనికి శ్రీకారం చుట్టారు. తన పార్లమెంట్‌పరిధిలోని ప్రతి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచా లంటూ బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలంతా కలిసి తమ తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రం చేశారు. సొంతంగా చీపురు తెచ్చుకుని, క్లాత్, మగ్గు, బకెట్ తెచ్చుకుని తరగతి గదులను క్లీన్ చేశారు. అందులో భాగంగా కేంద్రమంత్రి బండి సంజయ్ సైతం శనివారం ఉదయం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు వచ్చారు. స్వయంగా చీపురుపట్టి ఊడ్చారు. పైపు నీళ్లతో తరగతి గదిని క్లీన్ చేశారు. ఆ తరువాత శుభ్రంగా తుడిచారు. విద్యార్థులు కూర్చునే టేబుల్ కింద దుమ్ము ధూళి లేకుండా క్లీన్ చేశారు. తరగతి గదిలోని మూలమూలకు వెళ్లి చీపురుపట్టి ఊడ్చారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మోడీ 12 యేళ్ల పాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వివిధ వర్గాలను కలుస్తు న్నా మని అనేక సభలు, సమ్మేళనాలు నిర్వహిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా 'స్వచ్ఛ పాఠశాల' పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని పాఠశాలలను పరిశుభ్రం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రాజకీయా లకు అతీతంగా మన పాఠశాలను మనం శుభ్రం చేసుకుందామని కోరారు. స్ఫూర్తిదాయకమైన సేవా కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారని టీచర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొని తమ వంతు బాధ్యతను నెరవేరుస్తున్నారని తెలిపారు. ఏ స్కూల్‌ను ఎవరెవరు శుభ్రం చేయాలనే విషయంపై నిన్ననే 'టిఫిన్ బైఠక్' నిర్వహించామని అందులో భాగంగా ఈ రోజు పాఠశాలలను శుభ్రం చేస్తున్నామని దీంతోపాటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఎల్లుండి గ్రామాలు, మండలాల వారీగా ర్యాలీలు కూడా నిర్వహించబోతున్నామని తెలిపారు.




ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయా లన్నది తన సంకల్పమని, అందులో భాగంగానే ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఈసారి కూడా సైకిళ్లు అందించ బోతున్నట్లు మంత్రి ప్రకటించారు. టెన్త్ విద్యార్థులందరికీ తన వేతనం నుండి పరీక్ష ఫీజు చెల్లిస్తానని పాఠశాల అభ్యున్నతి కోసం మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడతా. పాఠశా లలో నెలకొన్న సమస్యలపైనా త్వరలోనే సమీక్ష చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, నాయకులు లక్ష్మినవీన్‌యాదవ్, అన్నలు దాసు వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం నాలుగో యూనిట్ పనులు పూర్తి చేయండి

### జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన జెన్కో డైరెక్టర్లు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రం మరమ్మతు పనులను రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో చేపట్టింది. ప్రధానంగా ఈ జల విద్యుత్ కేంద్రంలోని నాలుగో యూనిట్ మరమ్మతు పనులకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మరమ్మతు పనులను జూలై మొదటి వారంలోగా పూర్తి చేయాలని జెన్కో హైడల్ డైరెక్టర్ పిల్లి బాలరాజు, సివిల్ డైరెక్టర్ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఆరేళ్ల క్రితం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన నాలుగవ యూనిట్ మరమ్మతు పనులను, పెన్‌స్టాక్ గేట్లను పరిశీలించారు. అనంతరం విద్యుత్ కేంద్రం కాన్ఫరెన్స్ హాల్లో ఇంజనీర్లతో జల విద్యుత్ కేంద్రం పరిస్థితి, విద్యుత్ ఉత్పాదకత, ఎదురవుతున్న అవాంతరాలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా నాలుగవ యూనిట్లో సాంకేతిక లోపాలపై చర్చించారు. వాయిత్ కంపెనీ 2023 నుంచి 2025 వరకు మూడుసార్లు నాలుగవ యూనిట్‌కు మరమ్మతు చేపట్టినా ప్రయోజనం లేకపో యిందన్నారు. ఇప్పటికే రూ.25 కోట్ల వరకు ఖర్చుచేసినట్లు తెలిపారు. దీంతో జెన్కోకు నష్టం వాటిల్లుతోందని వివరించారు. ఈ సారి మరమ్మతు పూర్తి చేసే విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈ శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంలో ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొత్తం 6 యూనిట్లు ఉన్నాయి. దీని మొత్తం ఉత్పత్తి సామర్థం 900 మెగావాట్లుగా ఉంది. ఈ కేంద్రంలో పంప్డ్‌స్టోరేజ్ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి అయిన తర్వాత, దిగువన ఉన్న టెయిల్ పాండ్‌లోని నీటిని తిరిగి శ్రీశైలం జలాశయానికి పంపింగ్ చేసే అవకాశం ఈ టర్బైన్లకు ఉంది. ఈ జలవిద్యుత్ కేంద్రం 24 ఏళ్ల చరిత్రలో కేవలం 5 యూనిట్లతో ఏటా అత్యధికంగా 2544 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రికార్డులను సృష్టించింది. ఈ పరిశీలనలో జెన్కో డైరెక్టర్లతోపాటు, వారి వెంట ఈగలపెంట జెన్కో సీఈ కేవీవీ సత్య నారాయణ, ఎస్ఈలు రవీంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల దారిమళ్లింపు

**రంగారెడ్డి అర్బన్, జూన్ 13, ప్రభాతవార్త :** నగరంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి, శనివారం కురిసిన భారీవర్షానికి పలు విమానాలను దారిమళ్లించారు. ఢిల్లీ, ముంబయి, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలతో మొత్తం 9 విమానాల దాకా దారిమళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో దారి మళ్లించడం జరిగిందన్నారు. దీంతో పలువురు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

## మహిళా వారోత్సవాలు విజయవంతం

### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** మహిళలను సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి చోదకశక్తులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహించిన మహిళా వారోత్స వాలు విజయవంతంగా ముగిశాయి. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ వారోత్సవాలు మహిళల ఆర్థిక, సామాజిక, విద్యా, ఆరోగ్య, రాజకీయ సాధికారతకు కొత్త ఊపునిచ్చాయి.గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, బాలికల్లో నాయకత్వ లక్షణాల పెంపు, మహిళల భద్రత, పారిశ్రామిక ప్రోత్సాహం, అక్షరాస్యత, బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారుల సంక్షేమం వంటి విభిన్న అంశాలపై వారంరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు మంత్రి సీతక్క ప్రకటన విడుదల చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సెర్ప్, మెప్మా, అంగన్ వాడీ వ్యవస్థ, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు మహిళా సాధికార తను ప్రజా ఉద్యమంగా మార్చాయి. వారోత్సవాల ప్రారంభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఖమ్మం జిల్లా మధిరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి సౌర విద్యుత్ కేంద్రం ప్రారంభం మహిళల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. 'బాల్య వివాహం - బతుకు ఆగం' నినాదంతో గ్రామ సభలు, ర్యాలీలు, కళాజాతాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత చైతన్యం కల్పించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణకు ప్రాధాన్యతనిస్తూ 'బలమైన బాల్యానికి 1000 మెట్లు' కార్యక్రమం నిర్వహించగా, అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి 50 కొత్త అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించి, మరో 27 భవనాలకు శంకుస్థాపనలు చేపట్టారు.



పోలీసులు అదుపులో నిందితులు

## నకిలీ పత్రాలతో ప్రభుత్వానికి టోకరా

### ఆరుగురు నిందితులు అరెస్ట్
### రూ. 21 లక్షల చెక్కులు, ల్యాప్‌టాప్, కంప్యూటర్ నకిలీ పత్రాలు స్వాధీనం

**హైదరాబాద్ (అత్తాపూర్) జూన్ 13, ప్రభాతవార్త :** షాదీ ముబారక్ పథకం పేరు తో నకిలీపత్రాలు సృష్టించి ప్రభుత్వాన్ని రూ.21 లక్షల మేర మోసం చేసిన ముఠాను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రత్యేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సహా మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సిఐ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. హసన్‌నగర్‌లోని ఓ నివాసంలో మహ మ్మద్ ఎతిమాద్ అతని సహచరులతో కలిసి ఆధార్‌కార్డులు, వివాహ ధ్రువ పత్రాలు, ఫోటోలు తదితర పత్రాలను కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ల సహాయంతో నకిలీగా రూపొందించి షాదీ ముబారక్ పథకం కింద ఈ దరఖాస్తులను బండ్ల గూడ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి ప్రత్యేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కిరణ్ సహకారంతో తదుపరి ప్రక్రియకు పంపించి ప్రభుత్వం నిధులను అక్రమంగా బ్యాంక్ అకౌంట్‌లోకి మళ్లించుకుని అక్రమా లకు పాల్పడితున్నట్లు విచారణలో తెలింది.పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన పోలీసులు హసన్‌నగర్‌లోని ఓ నివాసంలో శోధనలు చేపట్టి, ఒక ల్యాప్‌టాప్, కంప్యూ టర్ వ్యవస్థ, ఆరు మొబైల్ ఫోన్లు, నకిలీ దరఖా స్తులు, ఐడీప్రూఫ్‌లు, రూ.21 లక్షల విలువైన 21 చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ముషరఫ్, సర్ఫరాజ్, జాఫర్ నకిలీ లబ్ధిదారులను గుర్తించడం, వారి పేరిట బ్యాంకు ఖాతాలు, విద్యుత్ బిల్లులు, వివాహ ఫోటోలు తదితర పత్రాలను సేకరించడం లేదా నకిలీగా తయారుచేయడంలో కీలకపాత్ర పోషించినట్లు వెల్ల డైంది. అక్రమంగా పొందిన మొత్తాన్ని నిందితులు పరస్పరం పంచు కున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి నిందితులు ఎ-1 మహమ్మద్ ఎతిమాద్ (25)(ఆధార్ ఆపరేటర్) ఎ-2 మహ్మద్ అక్బర్ (20) (స్టూడెంట్) ఎ-3, సయ్యద్ ముషారఫ్ ఉద్దీన్(23) (ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్) ఎ-4 మహమ్మద్ సర్ఫరాజ్ (26) (షాప్ వర్కర్)ఎ-5 మహ్మద్ జాఫర్ (23) (ప్రైవేట్ ఉద్యోగి) ఎ-5 అశోక్‌కిరణ్ (32) (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్)లను అరెస్ట్‌చేసి న్యాయస్థానంలో హాజరుపరిచగా రిమాండ్ విధించింది.

## పోక్సో కేసులో నిందితుడికి 20 యేళ్ల కఠిన జైలుశిక్ష

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి లైంగిక దాడికి పాల్పడి, గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు 16 వేల రూపాయల జరిమానా విధిస్తూ నాంపల్లి 12వ అదనపు సెషన్‌కోర్టు శనివారం సంచలన తీర్పు వెలువరించింది. వివరాలు ఇలావున్నాయి. బషీర్‌బాగ్‌లో నివసించే 16 యేళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన గమ్మల నాగరాజు 2018లో ప్రేమ పేరుతో వంచించాడు. నాగరాజు మాటలు నమ్మిన బాలిక అతని మాయలో పడింది. దీంతో నాగరాజు ఆ బాలికకు అశ్లీల వీడియోలు చూపి,. పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేశాడు. దీని తరువాత 2019 ఫిబ్రవరిలో బాలిక గర్భవతి అని తెలియగానే నాగరాజు ఆమెను అబార్షన్ చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. దీనికి బాలిక నిరాకరించడంతో దాడిచేశాడు. దీంతో బాలిక నాగరాజు చేతిలో మోసపోయిన విషయాన్ని తండ్రికి చెప్పడంతో ఆయన 2019 మార్చి తొమ్మిదవ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై స్పందించిన గాంధీనగర్ పోలీసులు నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టుచేసి జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితుడు ప్రస్తుతం బెయిలుపై వున్నాడు. ఈ కేసు విచారణ నాంపల్లి 12వ అదనపు సెషన్ కోర్టులో ఏడేళ్ల పాటు విచారణ సాగింది. దీనిపై న్యాయమూర్తి శనివారం తీర్పు వెలువరిస్తూ నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు 16 వేల రూపాయల జరిమానా విధించారు. తీర్పు వెలువడగానే నిందితుడు నాగరాజును పోలీసులు అరెస్టుచేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా ఈ కేసులో విచా రణాధికారిగా గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి వ్యవహరించగా అదనపు పిపిగా రామకృష్ణ కోర్టులో వాదనలు వినిపించారు. పోక్సో కేసులో నిందితుడికి కఠినశిక్ష పడేలా చేసిన గాంధీనగర్ పోలీసులను సిటీ కొత్వాల్ సజ్జనార్ అభినందించారు.



పోక్సో కేసులో 20 యేళ్ల కఠిన జైలుశిక్ష పడిన గమ్మల నాగరాజు.

## పోక్సో కేసులో నిందితుడి ఆత్మహత్య

**హైదరాబాద్ జూన్ 13, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో పోక్సో కేసులో నిందితుడుగా వున్న ఓ వ్యక్తి శనివారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలావున్నాయి. జిల్లాలోని పిట్లం మండలం టిక్యా తండాకు చెందిన శ్రీకాంత్ (20) ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినందుకు హైదరాబాద్‌లోని నారాయణగూడ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోద య్యింది. ఈ కేసులో అరెస్టయి మూడు నె లల పాటు జైల్లో వున్న ఇతను ఇటీవలే బెయిలుపై విడుదలయ్యాడు. ఈ నెల 10వ తేదీన తానుండే గ్రామానికి రాగా పలువురు సూటిపోటి మాటలు అనడంతో ఉదయం పది గంటల సమయంలో చిన్నకొడపగల్ వద్ద చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిపై పిట్లం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్థిక సాయంలో రాష్ట్రాలకు నిబంధనలు

### బలహీనవర్గాల రైతాంగానికి మేలు
### వ్యవసాయ మౌలిక సదుపాయ నిధిలో మార్పులు
### కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రతిపాదన

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రైతులకు ప్రయోజనాన్ని కలిగించే మౌలిక సదుపాయాల నిధి పథకంలో కేంద్రం మార్పులు తీసుకువస్తోంది. ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ప్రయోజనాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టింది. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం విషయంలో మార్పులు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి పథకం కింద గల అర్హతను రాష్ట్ర ఏజెన్సీలు, ఏపీఎంసీలకు, జాతీయ, రాష్ట్ర సహకార సమాఖ్యలు, రైతు ఉత్పత్తి సంస్థల సమాఖ్యలు, స్వయం సహాయక బృందాల సమాఖ్యలకు విస్తరించడం జరిగింది. ఇప్పటి వరకూ 2 కోట్ల రూపాయల మేర రుణానికి సంబంధించిన నిబంధనల ప్రకారం ఈ పథకం కింద ఇచ్చే వడ్డీ సహాయాన్ని ఒక ప్రాంతంలో పని చేసే సంస్థకే ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం తీసుకొస్తున్న మార్పుల ప్రకారం ఈ వడ్డీ సహాయాన్ని వివిధ ప్రాంతాల్లో పని చేసే అటువంటి అన్ని ప్రాజెక్టులకు కూడా ఇవ్వడం జరుగుతుంది. అయితే ప్రైవేటు రంగ సంస్థ విషయంలో మాత్రం ఇటు వంటి ప్రాజెక్టులు 25కు మించి ఉండ కూడదు. కానీ 25 ప్రాజెక్టు నిబంధన అనేది రాష్ట్ర సంస్థలు, జాతీయ సంస్థలు, రాష్ట్ర సహకార సమాఖ్యలు, ఎఫ్‌పివో సమాఖ్యలకు ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు వర్తించదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకానికి సంబంధించి ఏపీఎంసీల విషయంలో 2 కోట్ల రూపాయల వరకూ ఉండే రుణాలకు సంబంధించిన వడ్డీ సహాయాన్ని వివిధ మౌలిక సదుపాయల ప్రాజెక్టులకు ఇవ్వడం జరుగుతుంది. ఒకటే మార్కెట్ యార్డులోని కోల్డ్ స్టోరేజ్, సార్టింగ్, గ్రేడింగ్, అస్సేయింగ్ యూనిట్లు, సిలోస్ తదితర మౌలిక సదుపాయల ప్రాజెక్టుల కిందకు వస్తాయని తెలిపారు. కాగా లబ్దిదారులను తొలగించడం, చేర్చడానికి సంబంధించి స్ఫూర్తికి దెబ్బ తగలకుండా ఆయా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తగిన మార్పులు చేసే వీలును కల్పిస్తోంది. అదేవిధంగా ఆర్థిక సదుపాయం అందించే సమయాన్ని 4 నుండి 6 సంవత్సరాలకు అంటే 2025-26 వరకూ పెంచడం జరిగింది. మొత్తం మీద చూసినప్పుడు పథకానికి సంబంధించిన సమయాన్ని 10 నుండి 13 సంవత్సరాలకు అంటే 2032-33 వరకూ పెంచడం జరిగింది. ముఖ్యంగా పథకానికి సంబంధించిన ప్రయోజనాలు సన్న, చిన్నకారు రైతులకు చేరడానికి దోహదం చేస్తాయి. మార్కెట్ లింకేజీలను అందించడానికి, కోతల అనంతరం అవసరమయ్యే ప్రజా మౌలిక సదుపాయల వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవడానికిగాను ఎంపిఎంసీ మార్కెట్లను స్థాపించడం జరిగిందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా), (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV-A (నియమం 8 (6) నిబంధన చూడండి)**
**స్థిర ఆస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన**

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 (6) నిబంధనతో చదవబడిన, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 కింద స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం అమ్మకపు నోటీసు. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టిన క్రింద వివరించిన స్థిరాస్తులస్సెంటినీ ఇక్కడ AUSFBగా సూచిస్తామని ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారు/తనఖాదారు(లు)కి ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూర్డ్ ఆస్తులను "ఎక్కడ ఉందో అలాగే", "ఏదో అలాగే" మరియు "అక్కడ ఏదో అలాగే" ప్రాతిపదికన E-వేలం ద్వారా దిగువ పట్టికలో పేర్కొన్న మొత్తాన్ని రికవరీ చేయడానికి, AUSFB కారణంగా వచ్చే వడ్డీ, ధర, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు విక్రయించబడతాయి.సెక్యూర్డ్ క్రెడిటర్ https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్ ద్వారా మేము పబ్లిక్ ఇ-వేలం నిర్వహించబోతున్నామని మీకు ఇందుమూలంగా తెలియజేయబడుతోంది.

| ఖాతా నం. & రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తనఖాదారులు, హామీదారుడి పేరు | డిమాండ్ నోటీసు U/s 13(2) ప్రకారం తేదీ & మొత్తం & సింబాలిక్‌గా స్వాధీనం తేదీ మరియు (తేదీ) నాటికి మొత్తం | రిజర్వ్ ధర, బయానా & బిడ్ పెంపు మొత్తం (రూ.లక్షలలో) | ఇ-వేలం తేదీ మరియు సమయం, బయానా సమర్పణ చివరి తేదీ, బిడ్‌లు & డాక్యుమెంట్ల సమర్పణ స్థలం, తనిఖీ తేదీ |
|---|---|---|---|
| (రుణ ఖాతా నెం.) 2406261261150696, M/S. హరి శ్రీ కంప్యూటర్స్ వారి భాగస్వాములైన శ్రీ PVSS బ్రహ్మం మరియు శ్రీ కాకాని గోపాల కృష్ణ ద్వారా (రుణగ్రహీత) శ్రీ PVSS బ్రహ్మం S/o శ్రీ V B పమిడిమూర్తుల (హామీదారు) శ్రీ కాకాని గోపాల కృష్ణ S/o శ్రీ జయరామయ్య గోపాల (హామీదారు/తనఖాదారు) | 13(2) నోటీసు జారీ తేదీ 30/01/2026 లోన్ ఖాతా నెం. 2406261261150696 లో రూ. 3,07,72,292/- (మూడు కోట్ల ఏడు లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంభై రెండు రూపాయలు మాత్రమే) 29-01-2026 తేదీ నాటికి. 21-04-2026న సింబాలిక్‌గా స్వాధీనం రుణ ఖాతా నెం. 2406261261150696, రూ. 3,25,70,746/- (మూడు కోట్ల ఇరవై ఐదు లక్షల డెబ్బై వేల ఏడు వందల నలభై ఆరు రూపాయలు మాత్రమే) 04-06-2026 తేదీ నాటికి, దీనికి అదనంగా భవిష్యత్ వడ్డీ మరియు ఛార్జీలు ఉంటాయి. | రిజర్వ్ ధర రూ. 1,74,00,000/- (కోటి డెబ్బై నాలుగు లక్షల రూపాయలు మాత్రమే) బయానా రూ. 17,40,000/- (పదిహేడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే) బిడ్ పెంపు మొత్తం రూ. 10,000/- (పది వేల రూపాయలు మాత్రమే) | 23 జూలై 2026 ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు అపరిమితంతో ఐదు నిమిషాల పొడిగింపు బిడ్ సమర్పణకు చివరి తేదీ 22 జూలై 2026 సా.05:00 గం.ల వరకు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ బ్రాంచ్ (గ్రౌండ్ ఫ్లోర్, హౌస్ నంబర్ - 25/A, వెంగళరావు నగర్ కాలనీ, హైదరాబాద్, తెలంగాణ-500038 ఇమెయిల్ ఐడీ: bhanu.singh3@aubank.in తనిఖీ తేదీ: 29 & 30 జూన్ 2026 |

**తనఖా ఆస్తి వివరణ**
1. సర్వే ప్రకారం 1183 చదరపు గజాలు లేదా 898.13 చదరపు మీటర్ల విస్తీర్ణం గల వ్యవసాయేతర ఆస్తిలోని ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణాలతో సహా మొత్తం అదంతా ఖాళీ స్థలం. నం. 210/A, (పాత సర్వే నం. 130/00), తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ముదుచింతల్‌పల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో ఉంది. యజమాని శ్రీ కాకాని గోపాల కృష్ణ. సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: - తూర్పు: సర్వే నం. 210/A లోని కొంత భాగం, పడమర: రోడ్డు, ఉత్తరం: మెదక్ జిల్లా సరిహద్దు కరకపట్ల గ్రామం, దక్షిణం: డిజైర్ ఎస్టేట్ ప్లాట్లు
2. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ముదుచింతల్‌పల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో ఉన్న, సర్వే నెం. 210/A (పాత సర్వే నెం. 130/00) లోని, వ్యవసాయేతర ఆస్తికి చెందిన ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణాలతో సహా, 750 చదరపు గజాలు లేదా 627.09 చదరపు మీటర్ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం. దీని యజమాని శ్రీ కాకాని గోపాల కృష్ణ. సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: - తూర్పు: రోడ్డు, పడమర: శ్రీ బింగి రాజయ్య గారి భూమి & సర్వే నెం. 203, ఉత్తరం: మెదక్ జిల్లా సరిహద్దు కరకపట్ల గ్రామం, దక్షిణం: డిజైర్ ఎస్టేట్ ప్లాట్లు. **గమనిక-పైన పేర్కొన్న ఆస్తులు అన్నీ కలిపి అమ్మబడతాయి.**

ఇ-వేలం అమ్మకం ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తిగల పాల్గొనేవారు / బిడ్డర్లు అందరూ నిబంధనలు మరియు షరతులతో సహా మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌లను సందర్శించవలసిందిగా అభ్యర్థించడమైనది. అలాగే, శ్రీ భాను ప్రతాప్ సింగ్‌ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది. సంప్రదింపు నంబర్ 9358002663 మరియు ఇ-మెయిల్ bhanu.singh3@aubank.in.

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) ప్రకారం ఇది కూడా రుణగ్రహీత/తాకట్టుదారులకు చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు నోటీసు.**

**ఇ-వేలం అమ్మకం యొక్క నియమ మరియు నిబంధనలు:-**
1. సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం, సెక్యూర్డ్ రుణదాత అయిన AUSFB తరఫున మరియు వారి కోసం "ఉన్నది ఉన్నట్లుగా", "ఏది ఉంటే అది", "ఏది ఉంటే అది" మరియు "ఎటువంటి పరిహారం కోరే హక్కు లేదు" అనే ప్రాతిపదికన జరుగుతుంది మరియు సదరు ఆస్తిపై తెలిసిన ఎటువంటి భారం లేదు. 2. ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంలో పాల్గొనడానికి, బిడ్ పత్రం, పాన్ కార్డ్ కాపీలు, కంపెనీ విషయంలో బోర్డ్ తీర్మానం మరియు ఫోటో గుర్తింపు కార్డు, చిరునామా రుజువుతో పాటు బయానాని సమర్పించవలసి ఉంటుంది. ఈ బయానాని AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ వారి MSME ఆక్షన్ పూల్ అకౌంట్ పేరు మీద RTGS/NEFT ద్వారా చెల్లించాలి. కరెంట్ అకౌంట్ నెం. 1921201121711599, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, ఐదవ మరియు ఆరవ అంతస్తు, సన్నీ బిగ్ జంక్షన్ STC, ఖస్రా నెం. 64 నుండి 67, గ్రామ్ సుఖైపురా, న్యూ ఆతిష్ మార్కెట్, జైపూర్ 302020, IFSC కోడ్: AUBL0002011. ఒకసారి ఆన్‌లైన్ బిడ్ సమర్పించిన తర్వాత, దానిని ఉపసంహరించుకోలేరు. ఇంకా, బిడ్డర్ సమర్పించిన ఏదైనా EMD కోసం, RTGS/NEFT యొక్క UTR/రిఫరెన్స్ నంబర్‌ను రద్దు చేయబడిన చెక్కు కాపీతో పాటు ఈ క్రింది ఇ-మెయిల్ ఐడీకి పంపవలసి ఉంటుంది. అనగా: rakesh.jain1@aubank.in
3. ఇ-వేలం అమ్మకం ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తిగల పాల్గొనేవారు / బిడ్డర్లు అందరూ నిబంధనలు మరియు షరతులతో సహా మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌లను సందర్శించవలసిందిగా కోరడమైనది. అలాగే, శ్రీ భాను ప్రతాప్ సింగ్‌ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది, సంప్రదింపు నంబర్ 9358002663 మరియు ఇ-మెయిల్ bhanu.singh3@aubank.in.


తేది : 13-జూన్-2026 ప్రదేశం : మేడ్చల్ - మల్కాజ్‌గిరి, తెలంగాణ అధీకృత అధికారి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

# ముదురుతున్న 'తెలుగు' జలవివాదాలు

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల విస్తరణ మందకొడిగా కొనసాగుతోంది. దేశంలో వర్షాభావంతో సాగునీటికి, తాగునీటికి కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని దేశ,అంతర్జాతీయ పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆలమట్టి నుంచి కృష్ణాడెల్టావరకు గైక్వార్డు ప్రాజెక్టు నుంచి గోదావరి డెల్టాల సిస్టమ్ వరకు 18 ప్రధాన రిజర్వాయర్లలలో గరిష్ఠంగా 793.94 టిఎంసి నీరు నిల్వ ఉండాల్సి ఉండగా అందులో ప్రస్తుతం 280.39 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉంది. గత ఏడాది జూన్ మొదటి వారం వరకు 292.55 టిఎంసిలు ఈ రిజర్వాయర్లలో నీరు నిలిచి ఉంది. కృష్ణ బేసిన్‌లో గత ఏడాది నైరుతి రుతుపవనాలు మంచి వర్షాన్ని ఇచ్చాయి. పోయిన ఏడాది జూన్ 10 జూరాల గేట్లు ఎత్తి కిందికి లక్ష కూసెక్కుల నీటిని కిందికి వదిలారు. శ్రీశైలంలో జూన్ మూడోవారం వరకు జూరాల నుంచి సుమారు 8టిఎంసిల నీరు చేరుకొన్నది. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఆలస్యంగా ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరింది. తెలుగు రాష్ట్రాలకు జీవనాడులుగా ఉన్న కృష్ణా గోదావరి నదుల్లో పుష్కలంగా నీరు ప్రవహించిన రోజుల్లోనే నీటి పంపకాల విషయంలో గిల్లికజ్జాలు పెట్టుకొంటున్నాయి. నాగార్జున సాగర్‌పై ఇరు రాష్ట్ర పోలీసులు బాహాబాహీకి దిగిన రోజులున్నాయి. తెలంగాణ ఆధీనంలోని ఎన్ఎస్‌పి ఆనకట్టను సగం వరకు ఆంధ్రాపోలీసులు ఆక్రమించుకొన్నారు. కెఆర్ఎంబి సూచనలు పక్కనబెట్టి ఆంధ్రప్రదేశ్ నీటిని ఎక్కువ తరలించుకొని పోతుందని తెలంగాణ ఆరోపణలు చేయడం లేదు మా వాటాను మేం తీసుకొని పోతున్నామని ఆంధ్రప్రదేశ్ పాలకులు విమర్శలు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఈ యేడు పుష్కల వర్షం ఉన్నా కూడా కృష్ణ జలాలలో కేవలం25శాతం మాత్రమే నీటిని ఉపయోగించుకొన్నామని తెలంగాణ అంటోంది. గోదావరి జలాలు కృష్ణాబేసిన్‌కు తరలించడంతో ఎగువ రాష్ట్రాలకు ఇవ్వాల్సి న నీటివాటాను కర్ణాటక 16 టిఎంసిలు పైనే కృష్ణా జలాల నుంచి వాడుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకపక్షంగా అనుమతి ఇవ్వడంతో వివాదంగా మారింది. సూపర్ ఎల్‌నినో ప్రభావం

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

వర్షాభావ పరిస్థితులు ఎదురవుతే ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరకపోతే రాబోయే రోజుల్లో మరింత ముదిరిపోయే అవకాశం ఉంది. కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు తీర్పు త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణకు ఆంధ్రప్రదేశ్‌కు నీటి వాటాలు కొత్తగా పంపిణీ చేయనున్నారు. ఇలాంటి సమయంలో పోలవరం కావేరి లింక్ చేయడం కూడా వివాదానికి



దారితీస్తోన్నది. తెలంగాణ సమాజం మొత్తం గోదావరి జలాలలో 968 టిఎంసిలకు అనుమతులు ఇచ్చాకే ఇంటర్ లింక్ చేయాలని కోరుతోన్నది. ఇచ్చంపల్లి కావేరి అనుసంధానం చేయాలని ఇంటర్ లింక్ చేసిన నీళ్లలో సగం తెలంగాణకు ఇవ్వాలని పేచి పెడుతోంది. పోలవరం కావేరి లింక్ చేయడం తెలంగాణ నుంచి వ్యతిరేకత వస్తోంది. ఆంధ్రకు ఇప్పటికే ఒక జాతీయ ప్రాజెక్టు ఉందని ఇచ్చంపల్లి కడితే ఇక్కడ కూడా ఒక జాతీయ ప్రాజెక్టు వస్తోందని భావిస్తోంది.అంతేకాదు ఇచ్చంపల్లి నాగార్జున సాగర్ అనుసంధానం వల్ల తెలంగాణలో అనేక కరవుపీడిత ప్రాంతాలకు నీటివసతి ఏర్పడే అవకాశం ఏర్పడుతోంది. గోదావరిపై ఇప్పటికే తెలంగాణ సుమారు 139 టిఎంసిల వినియోగంకు కేంద్ర జలసంఘం చేసిన విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ పాలక పార్టీలు భాగస్వాములు కావడంతో జలశక్తి కార్యాలయంలో తన పట్టును చంద్రబాబు పెంచుకొన్నారు. జలశక్తి మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంతారావుకు పోస్టింగ్ ఇచ్చుకొని ఆ రాష్ట్రం నీటి ప్రయోజనాలు పరిక్షణకు అనువైన వాతావర్ణం ఏర్పాటు చేసుకొన్నారు. దీనితో తెలంగాణకు చెందిన గోదావరిపై నీటి వినియోగం కోసం సిడబ్ల్యుసిలోఉన్న ప్రతిపాదనల పెండింగ్‌లో పడ్డాయి. 139 టిఎంసిలకు అనుమతులు వస్తాయా రావా అనే సంశయం ఇప్పుడు తెలంగాణ సమాజంలో నెలకొంది. రాబోయే రోజుల్లో గోదావరి మీద తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తారా అనే శంక కూడా మొదలైంది. ఇది ఇలా ఉంటే పోల వరం కావేరి అనుసంధానం చేస్తే గోదావరిలో 213 టిఎంసిల నీరు తెలంగాణ కోల్పో యే అవకాశం ఉందని తెలంగాణ ప్రాంత నీటినిపుణులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇస్తే గోదావరిలో తెలంగాణకుఅన్యాయం జరుగుతుందని భయాందోళనలు మొదలైనాయి.గోదావరి జలాలను కృష్ణా పరివాహకానికి తరలిస్తే జిడబ్ల్యుడిటి అవార్డు ప్రకారం.. 14: 21: 45 నిష్పత్తి ప్రకారం హక్కులు ఎగువ రాష్ట్రాలకు సంక్రమిస్తాయి. 14 కర్ణాటకకు, 21 మహారాష్ట్రకు, 45 తెలంగాణకు నీటివాటాలు ఆంధ్రప్రదేశ్ ఇవ్వాల్సి ఉంటుంది. పోలవరం విషయంలో అవార్డు పాసైందని ప్రచారం జరుగుతోంది. 80 టిఎంసిల కంటే ఎక్కువ నీళ్లు తీసుకెళ్తే ఇవే హక్కులు సంక్రమిస్తాయి. బనకచర్ల, నల్లమల సాగర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు విరమించుకొన్నాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయనీ అంటే బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు మిగులు జలాలు లేవని, మిగులు జలాలపై ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పేచిపెడుతున్నారు. గోదావరి మిగులు జలాల విషయం కేంద్రమే స్పష్టం చేయడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు గోదావరికావేరి ఇంటర్ లింకింగ్‌ను ముందుకు తీసుకొచ్చారు. 2014 నుంచి గోదావరి కావేరి అనుసంధానం తెరపైకి వచ్చింది. తెలంగాణ భూభాగం టచ్ కాకుండా గోదావరి నీటిని తీసుకెళ్లే ప్రయత్నం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయంజరుగుతోందని తెలంగాణ వారు ఆందోళన చెందుతున్నారు రూపాయి ఖర్చు లేకుండా ఇచ్చంపల్లి వద్ద జాతీయ ప్రాజెక్టు కింద నిర్మించుకునే అవకాశం కోల్పోవడంతోపాటు. సమ్మక్క సాగర్ 47 టిఎంసిలనీటిని కూడా వదులు కోవాల్సి వస్తోందని భావిస్తున్నారు. తుమ్మడి హట్టి ప్రాణహితపై 152 అడుగుల ఎత్తుతో ప్రాజెక్టు కట్టడానికి మహారాష్ట్రా ముఖ్య మంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి లేఖ రాసినా ఉలుకూపలుకు లేకపోవడంతో తెలంగాణలో రాజకీయంగా వేడెక్కింది. కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం నడిచింది. ఆంధ్రప్రదేశ్ దాదాపు రూ. 14100 కోట్ల కేంద్ర నిధులతోభారీ సాగు ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకొంది. గోదావరి డెల్టా జీవనాడిఅయిన ధవళేశ్వరం బ్యారేజీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం రూ. 150 కోట్లు కేటాయించింది. పాత గేట్లను తొలగించి కొత్తవి అమర్చే పనులను ప్రభుత్వం ప్రారంభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజులు మహబూబ్‌నగర్ జిల్లాలో మకాం వేసి అక్కడి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. ప్రతి ప్రాజెక్టును కాలపరిమితో పూర్తిచేయడానికి లక్ష్యం కూడా విధించారు. మరోవైపు తెలం గాణలో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహు ళార్థ సాధక ప్రాజెక్టు లోని సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతులను సాధించడానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దేవాదులప్రాజెక్టును ప్రారంభించి పాతిక సంవత్సరాలు గడిచి పోయినా.. ఇప్పటివరకు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పూర్తికాలేదు. ఇది ఒక ఆందోళనకర పరిస్థితిగా మారింది. ●

తుమ్మహట్టి బ్యారేజీ సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసే బాధ్యతను ఏడు నెల క్రితం డిసెంబర్ మొదటివారంలో ప్రభుత్వం ఆర్వీ అసోసియేట్స్‌కే అప్పగించింది. ఆ సంస్థ సర్వే ప్రక్రియను ప్రారంభించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఈ డిపిఆర్‌ను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.బ్యారేజీ ప్రతిపాదిత నిర్మిత ప్రదేశం నుంచి మైలారం గ్రామందాకా 75కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ సర్వే, మైలారం నుంచి సుందిళ్ల బ్యారేజీ దాకా టన్నెల్ అలైన్‌మెంట్‌పై సర్వే కూడా ఆ సంస్థ చేపట్టాల్సి ఉంటుంది. డీపీఆర్‌కు అనుమతులు సాధించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆ సంస్థకే అప్పగించింది. డిపిఆర్ తయారీ మూడు నెలల్లో, కేంద్ర జలవనరుల సంఘంలోని వివిధ డైరెక్టరేట్లనుంచి క్లియరెన్స్ తీసుకోవడం వంటి ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. బ్యారేజీని 148, 150, 152 మీటర్ల ఎత్తుతో కట్టడం వల్ల కలిగే ముంపుపై పుణెలోని కేంద్ర నీరు, విద్యుత్ పరిశోధన సంస్థ ఇప్పటికే అధ్యయనం చేసింది. ఈ విషయంలో నిపు ణుల అంచనాలు,లెక్కలు సరైనవేనా? కావా? నిర్ధారించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆర్ వి అసోసియేట్‌కే అప్పగించింది. ఇప్పటిదాకా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ జోలికి పోకుండానే తుమ్మిడిహెట్టి డిపిఆర్ సిద్ధం చేయడానికి సూచనలు వస్తున్నాయి. అయితే కాళేశ్వరం లో భాగంగా అయితేనే ప్రాజెక్టు బెనిఫిట్ కాస్ట్ రేషియో (ప్రాజెక్టుకు వెచ్చించేది ఎంత.. తిరిగి వచ్చేదెంత)పై కచ్చితంగా లెక్కలు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. మేడి గడ్డ నుంచైనా తుమ్మిడిహెట్టి నుంచైనా నీళ్ల అంతిమంగా చేరాల్సింది శ్రీపాద ఎల్లంపల్లికే నని, ఆ ప్రాజెక్టు వద్ద ఉన్న కాళేశ్వరం పంపులతో పాటు సుందిళ్ల బ్యారేజీని కూడా వాడుకుంటున్నప్పుడు తుమ్మిడిహెట్టి బ్యారేజీ కూడా కాళేశ్వరంలో భాగంగానే కడుతున్నా మని ప్రభుత్వం ముున్ముందు ప్రకటించనుంది.

రాష్ట్రం

పశ్చిమ బెంగాల్

# మరో అవతారం!

రాజకీయ వైకుంఠ పాళిలో ఎవరు ఎప్పుడు నిచ్చెనలెక్కుతారో, ఎవరు ఎటువంటి పాము నోట చిక్కుతారో చెప్పడం కష్టం. నిచ్చెన ఎక్కుతూ హఠాత్తుగా పాము నోట పడే పరిస్థితి వస్తుంది. పైనుంచి మళ్లీ అట్టడుగుకు చేరుకోవలసి వస్తుంది. వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రి కావడమే గాక ప్రత్యర్థి బిజెపిని ఓ ఆట ఆడించిన మమతా బెనర్జీ ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితిలో ఉన్నారని గతవారం పరిణామాలను బట్టి అనుకోవలసి వస్తుంది. పార్టీ ఓడిపోవడం కంటే ఆ పార్టీ నుంచి ఒక్కొక్కరు జారిపోవడమే ఇప్పుడామెను మరింత కృంగదీస్తున్నట్లుగా కనిపిస్తోంది. గతవారం ఆమె ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం తొలుత అందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానంతో ఆమె జరిపిన చర్చలు మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. రెండో పర్యాయం సిఎం అయినప్పటినుంచే మమత వైఖరిలో చాలా మార్పు వచ్చింది. కాంగ్రెస్‌తో కలిసి నడిస్తే పార్లమెంటులో తగిన స్థానం లభించకపోవచ్చనే ఆలోచనతో క్రమంగా ఆ పార్టీకి చాలా దూరం జరిగారు. సోనియా, రాహుల్‌ను కొన్ని సార్లు నేరుగా విమర్శించారు కూడా. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడినప్పుడుతొలుత ఆ కూటమిలో కీలక పాత్ర వహించినా తర్వాత ఆ కూటమికి కూడా దూరమయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వేర్వేరుగానే పోటీ పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించవలసిందిగా మమత పిలుపునిచ్చారు కూడా. అక్కడితో కూటమితో పూర్తిగా తెగతెంపులు జరిగాయి.కానీ ఎన్నికల్లో ఓడిపోయి పదవి పోగానే ఆమె మళ్లీ కూటమికి చేరువై సోనియా, రాహుల్‌తో సన్నిహితంగా కనిపించడమే విశేషం. అంతేగాక గతవారం సోనియా గాంధీతో రెండుసార్లు 'ఆంతరంగిక' సమావేశం జరిపారని కూడా వినిపించింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారనే వదంతులు ఆ వెంటనే వ్యాపించాయి. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లు ఆ ప్రచారంలో కూడా కొంత నిజం ఉందనే అనిపించింది. కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టిన కొన్ని షరతులపై ఇంకా ఒక నిర్ణయం

**ఎ.వి.వి ప్రసాద్**

తీసుకోనందువల్లనే ఆలస్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పరిస్థితి కూడా నిరాశాజనకంగానే ఉంది.పరిస్థితి క్షీణించిన కాంగ్రెస్‌తో చేతులు కలపడం వల్ల ప్రయోజనం ఉంటుందా! అని మమత ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. 2024లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు దేశవ్యాప్తంగా 99 సీట్లు రాగా, తృణమూల్‌కు ఒక్క బెంగాల్‌లోనే 29 సీట్లు వచ్చాయి. కూటమి భాగస్వామ్య పక్షమైన డిఎంకె కు తమిళనాట 22 సీట్లు వచ్చాయి. ఇప్పుడు ఆ డిఎంకె, మూడు సీట్లున్న ఆప్ కూడా కూటమికి దూరమయ్యాయి. అంటే కూటమి నుంచి ఓపాతిక సీట్లు జారిపోయినట్లే. తృణమూల్ కాంగ్రెస్ తిరిగి కూటమిలోకి వచ్చినా ఆ పార్టీకి ఎంపీలు



మమతా బెనర్జీ

గాని, ఎమ్మెల్యేలు గాని మునుపటిలా లేరు. తృణమూల్ లోని 60మంది పైగా ఎమ్మెల్యేలు, 20మంది పైగా ఎంపీలు ఇప్పటికే జారుకున్నారు. వారంతా బిజెపిలోకి వెళ్లబోతున్నారని వేరే చెప్పక్కర్లేదు.అంటే తృణమూల్ తిరిగి ఇండియా కూటమిలో ఉన్నా, కూటమి మొత్తం బలం 200 దాటకపోవచ్చు.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌కు 80 సీట్లు రాగా ఇప్పుడు వారిలో 60 మంది పైగా రెబెల్ గ్రూపుగా ఏర్పడ్డారు. ఆ ఎమ్మెల్యేలే గాక, మమతకు 'లాయల్' ఉన్నారనుకొంటున్న మరి కొందరు ఎమ్మెల్యేలు కూడా గత శుక్రవారం ముఖ్యమంత్రి సువేందు నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరు కావడాన్ని బట్టి చివరికి మమత గ్రూపులో ఓ నలుగురైదుగురు ఎమ్మెల్యేలే మిగలవచ్చనీ, అభిషేక్ బెనర్జీ అనుచరులు కూడా ఎవరూ మిగిలేట్లు కనిపించడం లేదనీ తెలుస్తోంది. ఈ పరిస్థితిలో తృణమూల్‌ను ఇండియా కూటమిలో కొనసాగించినా, లేక కాంగ్రెస్‌లో విలీనం చేసుకున్నాఒరిగే ప్రయోజనం ఏదీ ఉండకపోవచ్చు. ఆ విషయం గ్రహించినందునే తృణమూల్ విలీన ప్రతిపాదనపై నిర్ణయాన్ని కాంగ్రెస్ వాయిదా వేసుకున్నట్లు చెబుతున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రెండు సీట్లు మాత్రమే వచ్చాయి. 1977 వరకు రాష్ట్రంలో ఆధిపత్యాన్ని కొనసాగించిన కాంగ్రెస్ తర్వాత వామపక్షాలు, ఆ తర్వాత తృణమూల్‌కు, తాజాగా బిజెపికి తన సీట్లు, ఓట్లను కోల్పోయింది. ఇప్పుడు కేవలం రెండు సీట్లు, దాదాపు మూడు శాతం ఓట్లు మాత్రమే ఉన్న కాంగ్రెస్‌లో విలీనమైతే 40 శాతం ఓట్లున్న తృణమూల్‌కు కలిగే ప్రయోజనం ఎంత? అనే ప్రశ్న వినిపిస్తోంది. 207సీట్లు, 45శాతం ఓట్లు ఉన్న బిజెపిని ఎదుర్కొనడానికి కాంగ్రెస్ బలం సరిపోతుందా? అనే ప్రశ్న కూడా తృణమూల్ నేతల నుంచి వినిపిస్తోంది. తృణమూల్‌లోని మెజారిటీ ఎమ్మెల్యేలు ఇప్పుడు రెబెల్ గ్రూపుగా ఏర్పడి తమకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరుతున్నారు. వారికి ఆ గుర్తింపు లభిస్తే ఒరిజినల్ తృణమూల్ కాంగ్రెస్ తమదే అని వారు చెప్పవచ్చు. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీకి పట్టిన గతే తృణమూల్‌కు కూడా పట్టవచ్చు. ఆ పరిస్థితిలో మమత తృణమూల్ గ్రూపు కాంగ్రెస్‌లో విలీనం సాధ్యమవుతుందా! అన్నదీ సందేహమే. రెబెల్ ఎమ్మెల్యేల సంఖ్య ఇప్పటికే 68కి, రెబెల్ ఎంపీల సంఖ్య 25కు చేరినట్లు తాజాసమాచారం. అంటే మమత గ్రూపులో 95 శాతం ఖాళీఅయినట్లే అనుకోవాలి. ఈ పరిస్థితిలో ఆమె కొత్త అవతారం ఎత్తినా ఎంతవరకు సక్సెస్ అవుతారనే సందేహం అందరిలో కలుగుతోంది. మమత వ్యూహాలు ఎప్పుడూప్రత్యేకంగానే ఉంటాయి. ఈ తుపాను లోంచి బయటపడడానికి ఆమె ఏ అవతారం ఎత్తుతారో చూడాలి. ఇండియా కూటమిలో కొనసాగినా, లేకపోయినా తృణమూల్ కు కలిగే ప్రయోజనం ఏదీ లేదనే పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితిలో ఆమె వ్యూహం ఎలా ఉంటుందో చూడాలి. ●

విదేశం

బెల్జియం

# 'నాటో' పై ట్రంప్ జులుం!

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో తలమునకలవుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఓ పక్క ఇరాన్‌కు సాయం అందిస్తున్న దేశాలను మచ్చిక చేసుకుంటూనేఇప్పుడు నాటో సైనిక కూటమిపై దృష్టిసారించారు. రెండోప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన నాటో కూటమికి యుద్ధవిమానాలు,యుద్ధనౌకలు సహా నిఘావ్యవస్థలన్నీ కూడా తగ్గించాలని ట్రంప్ నిర్ణయించారు. ఇప్పటివరకూ ఐరోపా రక్షణకు అత్యంత బాసటగా నిలిచిన ట్రంప్ ఈ నిర్ణయానికి కారణం హార్ముజ జలసందిని పూర్తిస్థాయిలో తెరిపించడంలో నాటోకూటమి కలిసి రాలేదన్నదే ఆయన కోపం. అందుకే వైమానిక, నేవీ మద్దతును తగ్గించాలని నిర్ణయించారు. ఇప్పటివరకూ నాటోకు అందుబాటులో ఉన్న 150 ఎఫ్16, ఎఫ్15 ఇ యుద్ధవిమానాలను 100కు తగ్గించాలని అలాగే సముద్రజలాలపై నిఘాకోసం వినియోగించే విమానాల సంఖ్యను కూడా 26నుంచి 15కు తగ్గించాలని నిర్ణయించింది. అలాగే గగనతలంలోనే ఇంధనం నింపే ట్యాంకర్ జట్లను కూడా నాటోకు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఇందుకు కారణం కేవలం హార్ముజ్, బాబ్ ఎల్‌మండెజ్ జలసంధుల్లో నెలకొన్న అనిశ్చితిని కట్టడిచేయడంలో అమెరికాకునాటో కూటమి కలిసిరాలేదన్న అక్కసుఒక్కటే. ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థగా పిలిచే ఈ నాటోఐరోపా కూటమి దేశాలకు అత్యంత భద్రతనిచ్చే అతిపెద్ద సైనిక కూటమిగా నిలిచింది. ముందు 12దేశాలతో ఏర్పాటైన ఈ కూటమి32 దేశాలకు విస్తరించింది. రష్యా దూకుడును కట్టడి చేసేందుకు ఆనాడు ఏర్పాటు చేసిన ఈ కూటమి ప్రపంచంలోనే అతిపెద్ద ఉమ్మడి సైనిక కూటమి అని చెప్పాలి. సభ్యదేశాల్లో ఏ ఒక్క దేశంలో భద్రత కొరవడినా, దాడులు జరిగినా నాటో స్పందించి రక్షణగా నిలుస్తుంది. బెల్జియంలోని బ్రస్సెల్స్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రస్తుతం నెదర్లాండ్స్ మాజీ ప్రధాని మార్క్‌రుట్టే సెక్రటరీ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆనాడు రష్యాను నిలువరించేందుకు సరిహద్దు దేశాలు నార్వే, ఫిన్‌ల్యాండ్, ఎస్తోనియా,లాత్వియా, లిథువేనియా, పోలండ్ దేశాలు కూడా నాటో సభ్యదేశాలుగా ఉన్నాయి. అలాగే ఉక్రెయిన్‌పై రష్యా దూకుడును కట్టడిచేసేందుకు నాటో సభ్యదేశాలు

**గన్ని మోహన్**

కూడా దౌత్యపరంగా పనిచేస్తున్నాయి. అవి పోలండ్,రొమేనియా, స్లోవేకియా దేశాలున్నా రష్యా తనదాడులు నిలపడంలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 'మాగా' లక్ష్యగా దూకుడుగా వెళుతున్న సంగతి తెలిసిందే.ప్రపంచదేశాలకు కొరకరాని కొయ్యగా తయారయిన ట్రంప్ తాజాగా నాటోపై ఫోకస్ పెంచారంటే ఆ సైనిక కూటమిని నిర్వీర్యంచేసి నిస్తేజం చేయాలన్న కాంక్ష ఆయనలో కనిపిస్తోంది. కొత్తగా నాటోలో ఫిన్‌ల్యాండ్, స్వీడన్ దేశాలు కూడా చేరాయి. ఈ కూటమి మొత్తం రష్యా విస్తరణ కాంక్షను అడ్డుకునేందుకేనని స్పష్టంగా చెప్పవచ్చు. రష్యాకు పాశ్చాత్యదేశాల మధ్య



మార్క్ రుట్టే

ఉన్న ఉద్రిక్తతలను కట్టడిచేసి రష్యా ఆధిపత్యం తగ్గించేందుకే ఈ కూటమి పనిచేస్తుంది.ఇందులో భాగంగానే నాటో ఆధ్వర్యంలో ఉక్రెయిన్‌కు సైనిక, ఆయుధ సాయం అందించాలనేది వ్యూహం అయితే ఇందుకు రష్యా ససేమిరా అంగీకరించకపోవడంతో ఉక్రెయిన్‌కు ఆయుధ సమస్య కూడా పెరిగిందనే చెప్పాలి. నాటోలో ఉన్న 32 దేశాల కూటమి మొత్తం జిడిపి 38 లక్షలకోట్ల డాలర్లుగా ఉంటుంది. అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా ప్రపంచంలో విస్తరించింది. ప్రస్తుతం 30లక్షల దళాలున్నాయి. మరింతగా విస్తరించేందుకు ఈనాటో పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈకూటమిపై ట్రంప్ ఫోకస్ పెంచడానికి ప్రత్యేక కారణం అటు హార్ముజ్, బాబ్ఎల్‌మండెజ్ జలసంధుల్లో ఇరాన్‌ప్రభావం తగ్గించడంలో కలిసిరాలేదన్న దుగ్ధతోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులుచేయడం కూడా ట్రంప్‌ను కలవరపరిచింది. అంతేకాకుండా చైనా,రష్యాలు ఇరాన్‌కు రహస్యంగా ఆయుధసాయం అందిస్తున్నాయన్న అనుమానాలు కూడా ట్రంప్‌లో పెరిగిపోయాయి. వీటన్నింటి దృష్ట్యా నాటో కూటమి స్పందించలేదన్న అక్కసు ట్రంప్‌లో బలంగా నాటుకుపోయింది. ట్రంప్ భావిస్తున్నట్లుగానాటో కూడా ప్రత్యక్షంగా స్పందించిన సందర్భాలుకూడా లేవు. ప్రత్యేకించి ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా సైనిక చర్యల్లో పాల్గొనలేదు. నాటో సభ్యదేశాలు కూడా అమెరికా పిలుపునకు స్పందించలేదు.గత సంఘటనలు దృష్టిలో ఉంచుకున్న ట్రంప్ నాటోపైఫోకస్ పెంచారని స్పష్టం అవుతోంది. సభ్యదేశాలైన ఫ్రాన్స్,బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు కూడా హార్ముజ్‌పై స్పందించకపోగా నాటోపరంగా ఒత్తిడి కూడా తీసుకురాకపోవడం కూడా ట్రంప్ కన్నెర్రకు కారణమైంది. అంతేకాకుండా నాటోకు నిధుల సాయంలో అతిపెద్ద వాటా కూడా అమెరికాకు ఉంది. 600 మిలియన్ డాలర్లు సాలీనా నిధులు అందించడంతోపాటు ఆయుధసామగ్రి కూడా అందిస్తోంది.నాటో నిర్వహణ వ్యయంలో 15.88 శాతం అమెరికాయే భరిస్తోంది.అందువల్లనే నాటోపై ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు.ఇతరదేశాలు కూడా తమ జిడిపిలో 2శాతం చొప్పున నిధులు అందిస్తున్నాయి. అమెరికా తన రక్షణరంగ బడ్జెట్ 980 బిలియన్ డాలర్లు అంటే నాటోమొత్తం 32 సభ్యదేశాల జిడిపిలో 60శాతానికి సమానంగాఖర్చుచేస్తోంది. అందువల్లనే అమెరికా నాటోపై పెత్తనం మాదే నన్నట్లుగా వ్యవహరిస్తోంది. కేవలం రష్యాను కట్టడిచేసేందుకే ఏర్పాటు చేసిన ఈ కూటమి భవిష్యత్తులో నిర్వీర్యం అవుతుందా?ట్రంప్ తన హఠాత్ నిర్ణయాలతో ఒకవేళ నాటో నుంచి వైదొలుగుతారా అన్నది ఐరోపా కూటమి దేశాలతోపాటు ప్రపంచదేశాల్లో నలుగుతున్న జవాబు లేని ప్రశ్న.ఈప్రశ్నకు సమాధానం కూడా సమీప భవిష్యత్తులో ట్రంప్ నుంచే వెలువడాల్సి ఉంటుందని ఐరోపా కూటమిబలంగా విశ్వసిస్తోంది. అమెరికానాటోపట్ల అనుసరించే భవిష్యత్తు వైఖరి ట్రంప్ సమాధానంపైనే ఆధారపడి ఉంది. ●

# వాతావరణ సంక్షోభానికి ప్రకృతే పరిష్కార మార్గం

ఒకప్పుడు వాతావరణ మార్పులు అంటే భవిష్యత్తులో సంభవించే ప్రమాదంగా మాత్రమే భావించేవారు. శాస్త్రవేత్తల నివేదికలు, అంతర్జాతీయ సదస్సులు, పర్యావరణవేత్తల హెచ్చరికలకే పరిమితమైన అంశంగా కనిపించేది. అయితే నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వాతావరణ సంక్షోభం ఇక భవిష్యత్తు ముప్పు కాదు. మన దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న వాస్తవం. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. మరో వైపు, కొన్ని గంటలపాటు కురిసే భారీ వర్షాలు నగర జీవితాన్ని స్తంభింపజేస్తున్నాయి. ప్రపంచ వాతావరణసంస్థ ప్రకారం 2024 సంవత్సరం ప్రపంచ చరిత్రలోనే అత్యంత వేడిగా నమోదైంది. పారిశ్రామిక యుగానికి ముందున్న సగటుతో పోలిస్తే భూగోళ సగటు ఉష్ణోగ్రత దాదాపు 1.5 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగింది. కరవులు, వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, తుఫాన్లు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇవన్నీ ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందన్న హెచ్చరికలే. ఈ హెచ్చరికలు మన అభివృద్ధి నమూనాలను, జీవన విధానాలను పునఃపరిశీలించుకునే అవకాశంగా మారాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధనాల వినియోగం, హరిత సాంకేతికతల అభివృద్ధిపై చర్చ జరుగుతోంది.ఇవన్నీ అవసరమైన చర్యలే. అయితే వాతావరణ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే ఒక ప్రాథమిక ప్రశ్నకు సమాధానం వెతకాల్సిందే. భూమిపై జీవం కోట్లాది సంవత్సరాలుగా అనేక మార్పులను ఎదుర్కొంటూ ముందుకుసాగింది. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, ప్రకృతి విపత్తులు, పర్యావరణ పరిణామాల మధ్య ప్రకృతి తనను తాను పునర్నిర్మించుకుంటూ నిలబడింది. అందుకే ప్రకృతిని కేవలం సంరక్షించాల్సిన వనరుగా మాత్రమే కాకుండా, నేర్చుకోవాల్సిన గురువుగా కూడా చూడాలి. వాతావరణ సంక్షోభానికి పరిష్కార మార్గాలను సూచించే అనేక సూత్రాలు ప్రకృతిలోనే నిక్షిప్తమై ఉన్నాయి. ప్రకృతి చెప్పే మొదటి పాఠం వైవిధ్యమే బలం అని. ప్రకృతిలో ఏ వ్యవస్థా ఏకరూపంగా ఉండదు. అడవుల్లో వందలాది రకాల చెట్లు, మొక్కలు, పక్షులు, జంతువులు, సూక్ష్మజీవులు పరస్పర సహకారంతో జీవిస్తాయి. ఈ వైవిధ్యమే వాటి స్థిరత్వానికి, మనుగడకు మూలం. ఐక్యరాజ్యసమితి జీవవైవిధ్య అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10లక్షల జాతులు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఒక జాతి నష్టపోయినా మొత్తం వ్యవస్థ కుప్పకూలదు. వాతావరణ మార్పుల కాలంలో ఈపాఠం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. వ్యవసాయ రంగాన్నే తీసుకుంటే, ఒకే పంటపై ఆధారపడే విధానాలు అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వర్షపాతం మారినా, తెగుళ్లు వ్యాపించినా రైతు ఆదాయం మొత్తం దెబ్బతింటుంది. అదే మిశ్రమ పంటలు, స్థానిక విత్తనాలు, వ్యవసాయ అటవీ విధానాలు అదనపు రక్షణ కల్పిస్తాయి. కాబట్టి జీవ వైవిధ్య పరిరక్షణ అనేది కేవలం పర్యావరణ అంశం మాత్రమే కాదు, అది ఆహార భద్రత, ఆర్థిక భద్రత, సామాజిక స్థిరత్వానికి కూడాపునాది. ప్రకృతి చెప్పే రెండో పాఠం పునరుద్ధరణ సామర్థ్యం. శాస్త్రీయ పరిభాషలో దీనిని రెసిలియెన్స్ అంటారు. ప్రకృతిలో ఏ వ్యవస్థా శాశ్వత స్థితిలో ఉండదు. పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగుతుంది. వరదల తర్వాత నదులు మళ్లీ తమ ప్రవాహాన్ని సర్దుబాటు చేసుకుంటాయి. అగ్నిప్రమాదాల అనంతరం అడవులు క్రమంగా పునరుజ్జీవనం పొందుతాయి. ఇదే ప్రకృతి అసలు బలం. నేడు ఇదే లక్షణం మానవ సమాజానికీ

**డి జె మోహన రావు**

అత్యవసరం. నగరాలు, గ్రామాలు, వ్యవసాయ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. వరదలు వచ్చినప్పుడు నీటిని పూర్తిగా బయటకు పంపే ప్రయత్నం చేయడం కంటే, దానిని నిల్వ చేసుకునే సహజ వ్యవస్థలను బలోపేతం చేయడం మరింత ప్రయోజనకరం. వర్షపు నీటి సంరక్షణ,



చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునర్భరణ వంటి చర్యలు వాతావరణ అనుకూలతను పెంచుతాయి. ప్రకృతి చెప్పే మూడో పాఠం పరిమితుల పట్ల గౌరవం. ప్రకృతిలో ప్రతి వ్యవస్థకు ఒక భరించే సామర్థ్యం ఉంటుంది. నదులు, అడవులు, నేలలు, సముద్రాలు అన్నింటికీ హద్దులు ఉన్నాయి. ఆ పరిమితులను దాటినప్పుడు సమతుల్యత దెబ్బతింటుంది. ప్రస్తుతం ఎదురవుతున్న అనేక పర్యావరణ సమస్యలకు మూల కారణం ఇదే. అధిక భూగర్భ జల వినియోగం, అడవుల నరికివేత, తీరప్రాంతాల ఆక్రమణ, సహజ జలవనరుల విధ్వంసం వంటి చర్యలు ప్రకృతి పరిమితులను విస్మరించిన ఫలితాలే. అభివృద్ధి అంటే ప్రకృతిని జయించడం కాదని, దానితో సమన్వయంగా ముందుకు సాగడమేనని ఈ పాఠం గుర్తు చేస్తుంది. భవిష్యత్తు అభివృద్ధి నమూనాలు కూడా ప్రకృతి సామర్థ్యాలను గౌరవించే విధంగానే రూపుదిద్దుకోవాలి. వాతావరణ మార్పులను ఎదుర్కొనే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి ఆధారిత పరిష్కారాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ సంస్థలు ప్రకృతి అందించే సేవల విలువను మరింత స్పష్టంగా గుర్తిస్తున్నాయి. దీనికి అడవులే ఉత్తమ ఉదాహరణ. ప్రపంచంలో అతిపెద్ద సహజ కార్బన్ నిల్వ కేంద్రాలుగా అవి పనిచేస్తాయి. ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో సుమారు 30 శాతం వరకు శోషించడంలోఅడవులు, ఇతర సహజ పర్యావరణ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమంఅంచనా వేస్తోంది. వర్షపాతం చక్రాన్ని ప్రభావితం చేయడం, నేల సారాన్ని కాపాడటం, జీవ వైవిధ్యానికి ఆశ్రయం కల్పించడం వంటి అనేక సేవలను అవి అందిస్తాయి. అందువల్ల అడవుల సంరక్షణ అనేది కేవలం పర్యావరణ కార్యక్రమం కాదు, వాతావరణ విధానంలో కీలక అంశం. చిత్తడి నేలలు, చెరువులు, సరస్సులు, మడ అడవులు కూడా అమూల్యమైన సేవలను అందిస్తున్నాయి. ఇవి వరద నీటిని నిల్వ చేస్తాయి, తీర ప్రాంతాలను రక్షిస్తాయి, భూగర్భ జలాలను పునరుద్ధరిస్తాయి. అయితే పట్టణీకరణ, భూ వినియోగ మార్పుల కారణంగా ఈ వ్యవస్థలు వేగంగా కనుమరుగవుతున్నాయి. ఈ నష్టాన్ని పూడ్చుకోకుండా వాతావరణ అనుకూల అభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణమే. నగరాల్లో ప్రకృతి పాత్రను కూడా కొత్తగా నిర్వచించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ జనాభాలో సగానికి పైగా ప్రజలు ఇప్పటికే నగరాల్లో నివసిస్తున్నారు. భారతదేశంలోనూ పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, పచ్చదనం తగ్గిపోవడం వల్ల నగరాలు అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్నాయి. చెట్లు, పార్కులు, నగర అడవులు, గ్రీన్ కారిడార్లు ఉష్ణోగ్రతలను తగ్గించడమే కాకుండా గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. ప్రజారోగ్యానికి కూడా తోడ్పడతాయి. భారతదేశానికి నీటి వనరుల పరిరక్షణ మరింత కీలకం. ప్రపంచ జనాభాలో దాదాపు 18శాతం మంది భారతదేశంలో నివసిస్తున్నప్పటికీ, ప్రపంచ మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయి. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికే నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ ఒత్తిడి మరింత పెరుగుతోంది. అందువల్ల సంప్రదాయ నీటి సంరక్షణ వ్యవస్థలు, చెరువులు, కుంటలు, వర్షపు నీటి సేకరణ పద్ధతుల పునరుద్ధరణ అత్యవసరంగా మారింది. అంతేకాదు, భారతీయ సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న స్థానిక పర్యావరణ జ్ఞానం కూడా విలువైన సంపద. నీటి నిర్వహణ, భూసార పరిరక్షణ, సామూహిక వనరుల సంరక్షణకు సంబంధించిన అనేక సంప్రదాయ పద్ధతులు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కనిపిస్తాయి. ఆధునిక శాస్త్ర సాంకేతికతతో వాటిని అనుసంధానిస్తే మరింత స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయి. వాతావరణ చర్య అనేది ప్రభుత్వాలకే పరిమితమైనబాధ్యత కాదు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి ఇందులో భాగస్వాములు కావాలి. శక్తి వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి చర్యలు వ్యక్తిగత స్థాయిలో చిన్నవిగా కనిపించినా, సమిష్టిగా అవి పెద్ద మార్పుకు దారితీస్తాయి. ప్రకృతి స్ఫూర్తితో ముందుకు సాగే సమాజమే భావితరాలకు సురక్షితమైన, స్థిరమైన ప్రపంచాన్ని అందించగలదు. ●



# భారతీయ నౌకపై దాడి అవాస్తవం

## తప్పుడు సమాచారం నమ్మవద్దని విదేశాంగశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఒమన్ తీరం లో భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై దాడి జరిగిందన్న సమాచారంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. మరో నౌకపై దాడి జరిగిందన్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నది. భారత సిబ్బందితో ఉన్న లియాకీ ఫ్రీడమ్ అనే నౌక ఒమన్ తీరం వెంబడి ప్రయాణిస్తుండగా దాని నుంచి ఒక్కసారిగా స్పందన ఆగిపోయింది. దాంతో అమెరికా దాడి చేసిందంటూ పలు వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటనలో నలుగురు భారతీయ నావికులు మరణించారంటూ ప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్దఎత్తున పోస్టులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే విదేశాంగశాఖ స్పందించింది. ఆ నౌకలోని మాస్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నది. నౌకపై ఎలాంటి దాడి జరగలేదని ధ్రువీకరించింది. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని స్పష్టంచేసింది. ఇలాంటి తప్పుడు వార్తల ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. కాగా ఇటీవల ఒమన్ తీరం సమీపంలో భారతీయులు ఉన్న నౌకలపై వరుసగా దాడులు జరిగాయి. వారం వ్యవధిలో మూడు నౌకలను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన రేకెత్తించింది. భారత్ ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ చర్యలను ఆపేయాలంటూ అమెరికాపై నిరసన వ్యక్తం చేసింది. కాగా హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించిందని అమెరికా దళాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది.అమెరికాయే దాడులుచేసి తమపై అభియోగాలు నెట్టేస్తోందని ఇరాన్‌ప్రతినిధి ఆరోపించారు.

# మమత, అభిషేక్‌లకు ఉచ్చుబిగిస్తున్న సిఎం సువేందు!



**కోల్‌కత్తా,జూన్ 13:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించిన సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ఈ కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 13 మంది ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఆరోపణలను ఎదుర్కొంటోన్నారు. ఆయనకు సీఐడీ తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో ఆయన నివాసంపై కోల్‌కతా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్ర బలగాలు సైతం ఇందులో పాలుపంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ తెల్లవారు జామున 3 గంటల సమయంలో కోల్ కత కాళీఘాట్ లోని నివాసంలో ఈ సోదాలు ఆరంభం అయ్యాయి. ఉదయం వరకూ కొనసాగాయి. కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ ఆపరేషన్ పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్‌కు సంబంధించిన ఓ కేసు ఆధారంగా ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. నాలుగు గంటల పాటు సాగిన ఈ శోధన ముగిసిన అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడారు. తాళం పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ప్రతి గదిలోనూ సోదాలు చేశారని ఆరోపించారు. ఈ పోలీస్ ఆపరేషన్ విషయం తెలియగానే మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆయన నివాసానికి చేరుకున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు అడ్డు అదుపు ఉండట్లేదని, నానాటికీ దిగజారుతున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ బెనర్జీని ఇటీవలే సీఐడీ అధికారులు దాదాపు ఆరు గంటల పాటు అభిషేక్ ను సంగతి తెలిసిందే. ఈ విచారణ ముగిసిన రెండు రోజుల వ్యవధిలోనే ఆయన నివాసంపై జరిగిన ఈ తాజా దాడి తృణమూల్ నేతల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దర్యాప్తు సంస్థలు మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే మదన్ మిత్ర కూడా టార్గెట్ అయ్యారు. ఆయనకు చెందిన నివాసాలు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. మున్సిపల్ నియామకాల కుంభకోణంలో భాగంగా దక్షినేశ్వర్‌లోని ఆయన నివాసంలో ఈ తనిఖీలు చేపట్టారు. సుమారు 125 కంటే ఎక్కువ అక్రమ నియామకాలతో మిత్రాకు సంబంధాలు ఉన్నాయని, దళారుల ద్వారా ఆయన పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఈడీ అధికారులు ప్రాథమికంగా ఆరోపిస్తున్నారు.

# లీకేజిలపై రాహుల్ ఆందోళనలు!



**న్యూఢిల్లీ,జూన్ 13:** పేపర్ లీకేజీ, పరీక్షల్లో స్కాంలు వంటి అంశాల్లో కేంద్ర సర్కార్ వైఫల్యాలపై పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఆ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇటీవల నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్‌ఈ పరీక్షా ఫలితాల్లో అవకతవకలు, నిరుద్యోగం వంటి అంశాలపై రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, పలు సంస్థలతో కలిసి భారీ ఎత్తున వరుస నిరసనలు చేపడుతామన్నారు. ప్రస్తుతం కేంద్ర వైఫల్యం వల్ల యువత, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేణుగోపాల్ అన్నారు. ఈ నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో రాహుల్ పర్యటించి ఆందోళన చేస్తారు. ముందుగా జూన్ 17న కోటలో విద్యార్థులతో సమావేశమవుతారు. అనంతరం ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) జూలై 10న, పాట్నాలో జూలై 11న, జూలై 14న ఢిల్లీలో రాహుల్ విద్యార్థులు, యువతతో కలిసి ఆందోళన చేస్తారు.

దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో మిలియన్లకొద్దీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారి తల్లిదండ్రులు అదనపు ఖర్చులు భరించలేకపోతున్నారని, ఉద్యోగాల నియామకాల్లో, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని వేణుగోపాల్ విమర్శించారు. ఈ నిరసనల్లో ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, పీసీసీలు, డీసీసీలు పాల్గొంటారని వేణుగోపాలు తెలిపారు. కేంద్రానికి నిరసన తగిలేలా, అందరినీ ఏకం చేసే లక్ష్యంతో ఈ ఆందోళన కార్యక్రమాలుంటాయన్నారు.

# కొత్త ఆర్మీచీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్!




**న్యూఢిల్లీ,జూన్ 13:** ఆర్మీ కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ నియమితులయ్యారు. ఆయన నియామకం ఈనెల 30వ తేదీనుంచి అమలులోకి వస్తుంది. ప్రస్తుత చీఫ్ ఆఫ్‌ది ఆర్మీస్టాఫ్ జనరల్‌ఉపేంద్ర ద్వివేది రిటైర్ అవుతున్న సంగతి తెలిసిందే. ఆర్మీస్టాఫ్‌కు వైస్‌చీఫ్‌గా లెఫ్టినెంట్ ఝునరల్ సేథ్ కొనసాగుతున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమి పూర్వ విద్యార్థి అయిన సాయుధ దళాల్లోకి 1986 డిసెంబరులో వచ్చిచేరారు. నాలుగు దశాబ్దాలపాటు మిలిటరీలో కెరీర్‌ను కొనసాగించారు. నిర్వహణ, వ్యూహాల అమలులో మంచి సామర్థ్యం ఉన్న వ్యక్తి. సంస్థాగతంగా కూడా మంచి పట్టు ఉన్న అధికారిగా పేరుంది. భారత్ ఆర్మీ దళాల తుదముట్టించే వ్యూహాలకు ఆయనే పదును పెడతారు.

దళాల ఆధునీకరణపై లెఫ్టినెంట్ గవర్నర్ ఎక్కువ ఫోకస్‌పెట్టారు. భవిష్యత్తు యుద్ధ తంత్రాలను అమలుచేయడంలో ఆయన దిట్ట అని పేరుంది. జమ్ముకాశ్మీర్‌లో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఫోర్స్‌కు కమాండెట్‌గా వ్యవహరించారు. సుదర్శన్‌చక్ర కార్ప్స్‌కు లెఫ్టినెంట్ జనరల్ హోదాలో పర్యవేక్షణచేసారు. నైరుతి కమాండ్, దక్షిణ కమాండ్‌లను పర్యవేక్షించిన ఆయన సంక్లిష్టపరిస్థితులను అధిగమించే వ్యూహాలు అమలుచేసారు. లెఫ్టినెంట్‌ఝునరల్‌సేత్ వృత్తిపరంగా మిలిటరీ విద్యలో కూడా నిపుణులు. శిక్షణలో కూడా ఆయన ఉన్నతస్థాయి పదవుల్లోకొనసాగారు. ఎన్డీసీలో హైయ్యర్ కమాండ్ కోర్సు కూడా అభ్యసించారు. మధ్యప్రదేశ్‌లోని సైనిక్‌స్కూల్ పూర్వ విద్యార్థి. 1984లో జమ్ముకాశ్మీర్ రైఫిల్స్‌కు 1984లో పర్యవేక్షించారు

# శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ

- యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఒ
- పెరిగిన స్వదేశీ రక్షణ సామర్థ్యం
- బిఎండి సామర్థ్యం ఉన్న ఎలైట్ దేశాల్లో భారత్



**న్యూఢిల్లీ,జూన్ 13:** భారత రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ అత్యాధునిక డిఫెన్స్ సిస్టమ్‌ను పరీక్షించింది. బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థలతో పాటు యాంటీ షిప్ మిస్సైళ్లను ఎదుర్కొనే టెక్నాలజీని పరీక్షించినట్లు శనివారం డీఆర్డీవో వెల్లడించింది. ఈ ట్రయల్ పరీక్షలు జూన్ 10,11వ తేదీల్లో నిర్వహించారు. ప్రస్తుతం ఆధుని టెక్నాలజీతో వస్తున్న క్షిపణులు, మారీటైం ముప్పును ఎదుర్కొనే రీతిలో ఉండే కొత్త తరహా టెక్నాలజీ ఆధారిత ఆయుధాలను పరీక్షించినట్లు డీఆర్డీవో పేర్కొన్నది. స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న దీక్షతో భారత్ తన ఆయుధ పరీక్షలను చేపట్టింది. మూడు రకాల ఫ్లయిట్ టెస్ట్‌లను నిర్వహించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది. ఈ విన్యాసాల్లో భాగంగా ఇంటర్‌సెప్టార్ క్షిపణులను లాంచ్ చేశారు. నిర్దేశిత టార్గెట్లపై వాటిని పరీక్షించారు. అనుకున్న లక్ష్యాలను అందుకున్నట్లు తెలిసింది. బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌కు చెందిన పలు దశలను ఈ పరీక్షల్లో టెస్ట్ చేశారు. దూసుకు వస్తున్న క్షిపణులను నిర్వీర్యం చేసేందుకు కావాల్సిన టెక్నాలజీని పరీక్షించారు. మిస్సైల్‌ను డిటెక్ట్ చేసి, ట్రాక్ చేసి దాన్ని ధ్వంసం చేసే టెక్నాలజీని పరీక్షించారు. భారత వ్యూహాత్మక భద్రత అంశంలో ఇదొక ముందడుగు అని ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. బాలిస్టిక్ క్షిపణుల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కొనే దేశాల్లో ఇప్పుడు ఇండియా కూడా చేరినట్లు రక్షణ శాఖ పేర్కొన్నది. కొన్ని దేశాల వద్ద మాత్రమే ఈ టెక్నాలజీ అందుబాటులో ఉన్నది. బాలిస్టిక్ నుంచి ఖండాతర క్షిపణులను కూడా ఎదుర్కొనే రీతిలో కొత్త టెక్నాలజీని పరీక్షించారు. బీఎండీ సామర్థం ఉన్న ఎలైట్ దేశాల్లో ఇండియా చేరినట్లు రక్షణ శాఖ తెలిపింది. నావల్ యాంటీ షిప్ మిస్సైల్ మీడియం రేంజ్ పరీక్ష కూడా డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. యాంటీ షిప్ మిస్సైల్ ముప్పును కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అయితే మారీటైం దళాలకు ఇది చాలా శక్తిని ఇస్తుందని అధికారులు చెబుతున్నారు. సముద్రం మార్గంలో ఉన్న శత్రువులను చిత్తు చేసేందుకు యాంటీషిప్ మిస్సైల్ టెక్నాలజీ మన నౌకాదళాన్ని బలోపేతం చేస్తుందన్నారు. విదేశీ రక్షణ వ్యవస్థల కన్నా స్వదేశీ రక్షణ వ్యవస్థలపై ఆధారపడే రీతిలో డీఆర్డీవో పరీక్షలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇవాళ డీఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపారు. మూడు రకాల పరీక్షల్లో పాల్గొన్న బృందాలకు ఆయన కంగ్రాట్స్ చెప్పారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచే కీలకమైన టెక్నాలజీ పరీక్షలను భారత్ విజయవంతంగా చేపట్టినట్లు ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. విభిన్న రకాల శత్రువులను ఎదుర్కొన్న రీతిలో ఆ రక్షణ పరీక్షలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లు, యాంటీ షిప్ మీడియం రేంజ్ సామర్థ్యాన్ని పరీక్షించినట్లు ఆయన చెప్పారు. బీఎండీ పరీక్షలో భాగంగా ఇంటర్‌సెప్టార్‌లు కచ్చితత్వంతో టార్గెట్లను చేధించినట్లు తెలిపారు. ఐసీబీఎంలను కూడా ఎదుర్కొనే సామర్థం భారత్ వద్ద ఉందన్నారు.

# కోర్టులో విడాకుల కేసు నడుస్తున్నా.. మామపై అల్లుడి దయాగుణం

## సొంతడబ్బుతోఖరీదైన వైద్యం..

## కోర్టులోనే కాళ్లపైపడి క్షమాపణ కోరిన భార్య



**న్యూఢిల్లీ,జూన్ 13:** విడాకులకోసం దరఖాస్తుచేసి భర్త, ఆమె కుటుంబాన్ని ముప్పుతిప్పలు పెట్టిన మామకు అత్యున్నతస్థాయి చికిత్సను అందించి ఆదుకున్న యువకుడి ఉదంతం అన్నివర్గాలప్రశంసలకు నోచుకుంది. ఢిల్లీకి చెందిన శిఖ, సౌరభ్‌లమధ్య చిన్నపాటి అహంకార పోరాటంతో విచ్ఛిన్నం అయింది. 2020లో శిఖ, సౌరభ్‌ల వివాహం ఎన్నో ఆశల మధ్య వైభవంగా జరిగింది. పెళ్లయిన కొద్దిరోజులకే వారి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకునే సహనం లోపించింది. ఈ క్రమంలో శిఖ భర్తపై, అతని కుటుంబంపై కోర్టులో వరకట్న వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ క్షణం నుంచి ఆ కుటుంబంలో ప్రశాంతత కరువైంది. ఏ తప్పు చేయని భర్త, అతని తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ, లాయర్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఏళ్ల తరబడి విచారణలు సాగాయి కానీ, అటు శిఖ అహం తగ్గలేదు ఇటు సౌరభ్ వైపు నుంచి సయోధ్య కుదరలేదు. న్యాయపోరాటాలు ఎప్పుడూ ఇరువైపులా విధ్వంసాన్నే మిగులుస్తాయి. కూతురి పెళ్లి పేరిట కోర్టుల చుట్టూ తిరగడం, లాయర్ల ఫీజులు భరించడం, సమాజంలో తలెత్తుకోలేకపోవడం శిఖ తండ్రిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. కూతురి భవిష్యత్తు ఏమైపోతుందోనన్న ఆందోళన, నిరంతర ఒత్తిడి ఆయన ఆరోగ్యాన్ని క్షీణింపజేశాయి. ఒకరోజు ఆ భారం తట్టుకోలేక ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. అత్యవసర స్థితిలో ఆయనను ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల, సరైన వైద్య సదుపాయాలు అందక ఆయన అక్కడ మరణంతో పోరాడుతున్నారు. కూతురు పెట్టిన కేసు చివరికి కన్నతండ్రి ప్రాణాలకే ముప్పుగా పరిణమించిన దారుణ పరిస్థితి అది. తనను, తన కుటుంబాన్ని కోర్టుల చుట్టూ తిప్పి నరకం చూపించిన భార్య తండ్రి చావుబతుకుల్లో ఉన్నాడనే వార్త భర్త సౌరభ్‌కు తెలిసింది. సాధారణంగా అయితే కక్ష సాధింపులు, కేసు వ్యవహారాలు.. వాళ్ల మధ్య దూరాన్ని పెంచుతాయి. కానీ, సౌరభ్ తనలోని అహాన్ని పక్కన పెట్టాడు. తక్షణమే స్పందించి, ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రి నుండి దేశంలోనే అత్యుత్తమమైన కార్పొరేట్ హాస్పిటల్ మెదాంత్తకు తరలించాడు. తన సొంత డబ్బు ఖర్చు పెట్టి, దగ్గరుండి పర్యవేక్షించి, ఒక కన్నకొడుకులా నిలబడి ఆ ముసలి ప్రాణాన్ని కాపాడాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే కోర్టులో తదుపరి విచారణ వాయిదా వచ్చింది. జడ్జి బెంచ్ మీదకు వచ్చారు. లాయర్లు తమ వాదనలు వినిపించడానికి సిద్ధమయ్యారు. విడాకుల పత్రాలు టేబుల్ మీద ఉన్నాయి. అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తూ శిఖ ముందడుగు వేసింది. లాయర్ చేతిలోని విడాకుల పత్రాలను లాక్కుని, జడ్జి ముందే వాటిని ముక్కలు ముక్కలుగా చింపేసింది. కన్నీళ్లతో భర్త సౌరభ్ కాళ్లపై పడింది. ఏ చట్టాలు, ఏ లాయర్లు, ఏళ్ల తరబడి సాగిన కోర్టు వాదనలు మార్చలేని ఆమె కఠిన హృదయాన్ని భర్త చూపిన ఆ ఒక్క మానవత్వం, నిష్కల్మషమైన కరుణ పూర్తిగా మార్చేసింది. తప్పుడు కేసుల కంటే, ఈగోల కంటే బంధం గొప్పదని గ్రహించిన ఆమె భర్తతో కలిసి జీవించడానికి సిద్ధమైంది. ఈ విడాకుల ఉదంతం నేటి ఆధునిక సమాజానికి, ముఖ్యంగా వైవాహిక బంధాల్లో ఉన్నవారి సంబంధాలకు అద్దం పడుతోంది. కోర్టులు, కాగితాలు మనసులను కలపలేవు.

# జులై 9న ఖొమేనీ అంత్యక్రియలు



**టెహ్రాన్,జూన్ 13:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్య క్రియలు వచ్చే నెల 9న జరగనున్నాయి. ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో అంత్య క్రియలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. జూలై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ మొదలవుతుందని తెలిపింది. అమెరికాఇజ్రాయెల్ సైన్యాలు ఫిబ్రవరి 28న ఇరాన్ పై చేసిన దాడుల్లో ఖమేనీ మరణించారు. అయితే భీకర యుద్ధం కారణంగా ఆయన అంత్య క్రియలు వాయిదాపడుతూ వస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున వాయిదా పడ్డాయి. ఇస్లామిక్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రం ప్రారంభంలో మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ అంతకుముందు భావించింది. అయితే కర్బలా యుద్ధంలో అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు.

# భారత్‌కు భద్రతామండలి సభ్యత్వం సహేతుకమే


## అంతర్జాతీయ అణుఇంధనసంస్థ ఛీఫ్ మారియానో గ్రాస్సీ



**వియన్నా,జూన్ 13:** అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయాలు వేగంగా మారుతున్న తరుణంలో అంతర్జాతీయ వేదికపై భారత్‌కు అరుదైన మైలేజ్ లభించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలనే డిమాండ్ అత్యంత సహేతుకమైనదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధినేత రాఫెల్ మరియానో గ్రాస్సీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి తదుపరి సెక్రటరీ జనరల్ రేసులో అత్యంత కీలక అభ్యర్థిగా ఉన్న గ్రాస్సీ వియన్నాలో ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ అణు పర్యవేక్షణ సంస్థ అధినేతగా, సుదీర్ఘ అనుభవం ఉన్న అంతర్జాతీయ దౌత్యవేత్తగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు భద్రతా మండలి విస్తరణపై భారత్ చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి బలమైన మద్దతుగా నిలిచాయి. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణాన్ని మార్చాల్సిన అవసరాన్ని రాఫెల్ గ్రాస్సీ బలంగా సమర్థించారు. భారత్ లాంటి దేశాలు ఈ రకమైన ఆకాంక్షను కలిగి ఉండటం కేవలం సహేతుకమే. ఎందుకంటే 1945 నాటి ప్రపంచం వేరు, ప్రస్తుత 2026 నాటి ప్రపంచం వేరని ఆయన వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణం పాతబడిపోయిందని, సమకాలీన వాస్తవాలకు అనుగుణంగా తక్షణ సంస్కరణలు అవసరమని భారత్ ఎప్పటి నుంచో చెప్తున్న వాదనతో ఆయన ఏకీభవించారు. అయితే ఒక దౌత్యవేత్తగా సమతుల్యతను పాటిస్తూ సమితి సెక్రటరీ జనరల్ పదవికి కొన్ని పరిమితులు ఉంటాయని ఎవరికి సభ్యత్వం ఇవ్వాలనేది సభ్య దేశాల మధ్య విస్తృతమైన ఒకకాభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. కానీ అధికారిక సభ్యత్వంతో సంబంధం లేకుండానే నేడు ప్రపంచంలో భారత్ యొక్క ప్రభావం, ఆర్థిక, భౌగోళిక రాజకీయ బలం ఎవరూ తిరస్కరించలేని విధంగా పెరిగిందని ఆయన కొనియాడారు. ప్రస్తుత యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ రెండో విడత పదవీ కాలం 2026 డిసెంబర్ 31తో ముగియనుంది. దీంతో 2027 జనవరి నుంచి కొత్త చీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రేసులో రాఫెల్ గ్రాస్సీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

అయితే ఈసారి ఐరాస చరిత్రలోనే మొదటి సారిగా ఒక మహిళా నేతకు ఈ అత్యున్నత పీఠాన్ని అప్పగించాలనే డిమాండ్ కూడా బలంగా ఉంది. చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెల్ బాచెలెట్, సీనియర్ ఐరాస అధికారి రెబెకా గ్రిన్‌స్పాన్ వంటి మహిళా నేతలు ఈ రేసులో ఉన్నారు.

# ట్రంప్ 80వ బర్త్‌డేకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు!



**వాషింగ్టన్,జూన్ 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ 80వ పుట్టినరోజు వేడుకలు వేడుకలు స్పెషల్‌గా నిర్వహించేందుకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. జూన్ 14న నిర్వహించే రాత్రి ఈవెంట్‌కు దాదాపు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇక ట్రంప్ పుట్టినరోజును పురస్కరించుకుని వైట్‌హౌస్ దగ్గర అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ ఫ్రీడమ్ 250 ఈవెంట్‌గా నిర్వహిస్తున్నారు. ఇందు కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. పలు దేశాలకు చెందిన ఫైటర్లు ఇందులో పాల్గొననున్నారు. ఒకవైపు ట్రంప్ బర్త్‌డే వేడుకలు ఇంకోవైపు ఛాంపియన్‌షిప్ క్రీడలతో వైట్‌హౌస్ కళకళలాడుతోంది. ఈ వేడకను అమెరికన్ పోరాట స్ఫూర్తికి తరంలో ఒక్కసారే వచ్చే వేడుక అని వైట్ హౌస్ అభివర్ణించింది. ఇక అమెరికా 250 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రీడం 250 అని ఈవెంట్‌కు పేరు పెట్టారు. గతేడాది రెండోసారి ట్రంప్ అధికారంలోకి వచ్చారు.

అయితే ఈసారి చాలా దూకుడుగా వెళ్తున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించారు. ఇక ఏడాది ప్రారంభంలో వెనిజులా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేయించారు. ఇక ఇరాన్‌పై యుద్ధం ప్రకటించారు. ప్రస్తుతం ఇరాన్‌తో శాంతి ఒప్పందం దిశగా ట్రంప్ వెళ్తున్నారు. ఇలాంటి తరుణంలో ట్రంప్ బర్త్‌డే సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. ఇక వచ్చే వారం ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సుకు కూడా హాజరు కాబోతున్నారు.

# సంక్షిప్త వార్తలు

## 130 కిలోమీటర్లు కారు డ్రైవ్ చేసిన సిఎం విజయ్

**చెన్నై,జూన్ 13:** తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన కోలీవుడ్ స్టార్ విజయ్ తనదైన స్టైల్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. పరిపాలన చేపట్టిన కొన్ని రోజులకే తన అసాధారణమైన శైలితో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా నిన్న ఆయన కర్ణాటకలోని ప్రముఖ కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. అక్కడ దర్శనం ముగించుకున్న తర్వాత ఆయన చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గుడి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు దాదాపు 130 కిలోమీటర్ల మేర తన కారును ఆయనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొల్లూరు మూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం విజయ్.. అమ్మవారికి 1.6 కేజీల బరువున్న భారీ వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు.

## టెక్సాస్‌లో కాల్పులు.. ఒకరి మృతి, 10 మందికి గాయాలు



**హూస్టన్,జూన్ 13:** అమెరికాలోని టెక్సాస్‌లో కాల్పుల ఘటన జరిగింది. ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతిచెందగా, మరో పది మంది గాయపడ్డారు. పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో అనుమానిత షూటర్ హతమయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున వెస్ట్ టెక్సాస్ మిడ్‌లాండ్ ఆయిల్ సిటీలో ఈ ఘటన జరిగింది. షూటింగ్ జరుగుతున్న ఎమర్జెన్సీ కాల్స్ రావడంతో ఆ ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. ఆ షూటర్‌ను తరిమే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఓ వెటర్నరీ క్లినిక్‌లోకి ప్రవేశించిన దుండగుడిని చుట్టుముట్టి కాల్చేశారు.

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.4.27 కోట్ల బంగారం స్వాధీనం

**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు రూ.4.27 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనంచేసుకున్నారు. ఈమొత్తం బంగారం ఒక స్పీకర్ బాక్స్‌లో ఉంచి విమానం మరుగుదొడ్డిలో ఉంచారు. సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఇండిగో విమానంలో ఈ సంఘటన జరిగింది. దుబాయ్‌నుంచి వచ్చిన ఈ విమానంలో బంగారం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారంతో కస్టమ్స్ అధికారులు నిఘావేసారు. విమానం క్షుణ్ణంగా ఇంజినీర్లతోకలిసి తనిఖీచేసారు. నల్లటి ప్లాస్టిక్ టేపులు వేసి ఉన్న రెండు పౌచ్‌లు స్పీకర్‌బాక్స్‌లో ఉంచినట్లు గుర్తించారు.

## అమెరికా దాడులు.. రక్తపిపాసి హాతం

**వాషింగ్టన్, జూన్ 13:** వెనుజులాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టిన అగ్రరాజ్యం అమెరికా తాజాగా కీలక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో డ్రగ్స్‌ముఠా ట్రెన్ డి ఆరాగ్వా గ్యాంగ్‌కు చెందిన లీడర్ హెక్టర్ రస్తెన్‌ఫోర్డ్ గురెరో ఫ్లోర్స్ హతమయ్యాడు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా వెల్లడించారు. 'ట్రెన్ డి ఆరాగ్వా ఉగ్రవాదులకు వెనుజులాలోనే కాదు.. ఈ భూమ్మీద ఎక్కడా సురక్షిత స్థావరం ఉండదు. హంతకులు, డ్రగ్ లార్డ్స్‌ఎక్కడున్నా వేటాడుతాం. వారిని నరకానికి పంపిస్తాం' అని ట్రంప్ వెల్లడించారు. ఈ వారం ఆరంభంలో అమెరికా ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. అత్యంత పక్కా సమాచారంలో ట్రెన్ డి ఆరాగ్వా ముఠాకు చెందిన ఓ కాంపౌండ్‌పై బాంబుల వర్షం కురిపించింది.

## దారి మళ్లించిన షార్జా సౌదీ అరేబియా విమానం!




**కొచ్చిన్, జూన్ 13:** షార్జా నుంచి కోజికోడ్ చేరుకోవాల్సిన ఎయిర్ అరేబియా విమానాన్ని శనివారం దారి మళ్లించారు. ఆ విమానం కొచ్చిన అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యింది. సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల దాన్ని దారి మళ్లించారు. ఎయిర్ అరేబియా ఫ్లయిట్ జీ9 454 విమానంలోని ఇంజిన్ రివర్స్ త్రస్ట్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని, దాని వల్ల దాన్ని కొచ్చిన్‌లో దించారని కొచ్చిన ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధి తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం ఇవాళ తెల్లవారుజామున కొచ్చిన్ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు.

# హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా కీలక సంస్కరణలు, సేవల విస్తరణ



## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య శాఖ పనితీరు ప్రశంసనీయం

### అధికారులు, వైద్యులు, సిబ్బందిని అభినందించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా ఆరోగ్య రంగంలో కీలక సంస్కరణలు, సేవల విస్తరణ చేపట్టినట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలను మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాలు ప్రజల్లో విశేష స్పందన పొందాయని, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఆరోగ్యశాఖ కీలక పాత్ర పోషించిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు, ప్రజా ప్రతినిధులు ఆరోగ్య శాఖ పనితీరును ప్రత్యేకంగా అభినందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో వైద్య సేవల విస్త రణ, ఆధునికీకరణ, మానవ వనరుల బలోపేతం, ప్రజా రోగ్య అవగాహన కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ రాష్ట్రవ్యాప్తంగా విశేష విజయాన్ని సాధించిందన్నారు. వారంరోజుల పాటు 20కిపైగా ప్రధాన కార్యక్రమాలను నిర్వహించి ఆరోగ్యకర జీవనశైలి, వ్యాధుల నివారణ, మాతాశిశు ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ సేఫ్టీ, హెచ్ఐవీ నియంత్రణ, క్యాన్సర్ అవగాహన వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పిం చామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్లు, స్పెషల్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్లను ప్రారంభించి మత్తు వ్యసన బాధితులకు స్క్రీనింగ్, చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందు బాటులోకి తీసుకు వచ్చామన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొం దించేందుకు హైదరాబాద్ కేబుల్ బ్రిడ్జ్‌పై భారీ మానవహారం నిర్వహించామని, రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఐవీ, టీబీ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టేలా డ్రగ్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంథెనింగ్ డే నిర్వహించామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. నకిలీ మందులు, నాసిరకం ఔషధాలు, మెడిసిన్ల దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుం టోందని తెలిపారు. 692 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, 174 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహ మొత్తం 866 మంది వైద్యులకు నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొ న్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య సుమారు 15 వేలకు చేరుకుందని వెల్లడించారు. వైద్య విద్య, సేవల విస్తరణలో భాగంగా మహబూబ్‌నగర్‌ను దక్షిణ తెలంగాణ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించామని, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో, ప్రజారోగ్యంపై అవగాహన పెంపొం దించడంలో, ఆధునిక వైద్య సేవలను విస్తరించడంలో, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ కృషి కొనసాగిస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## తెలంగాణ పోలీసు శాఖకు

# ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు

### 19న ఢిల్లీలో అందుకోనున్న డిజిపి ఆనంద్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నందుకు తెలం గాణ పోలీసు శాఖకు కేంద్ర విదేశాంగ శాఖ ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ నుంచి పోలీసు శాఖకు శనివారం సమాచారం అందింది. దీనికి సంబం ధించిన అవార్డును ఈ నెల 19న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో డిజిపి సి.వి ఆనంద్ అందుకోనున్నారు. రాష్ట్ర పోలీసు శాఖకు మరో అవార్డు వరించింది. టెక్నాలజీని వాడడం, నేరాల నియంత్రణ, సిసిటి ఎన్ఎస్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు అనేక అవార్డులు రాగా పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, వాటికి సంబం ధించిన ధ్రువీకరణ ప్రక్రియను దేశంలోనే వేగంగా చేస్తున్నం దుకు విదేశాంగ శాఖ 2025-26కు ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును తెలంగాణ పోలీసు శాఖకు ప్రకటించింది. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీ లన, ఇతర అంశాలను వేగంగా నిర్వహించినందుకు రాష్ట్ర పోలీసు శాఖకు ఇంతకుముందు పలు అవార్డులు వరించాయి. ఇప్పుడు వీటి సరసన ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు చేరింది. ఈ అవార్డును ఈ నెల 19న కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జయశంకర్ నుంచి డిజిపి ఆనంద్ అందుకోనున్నారు. కాగా రాష్ట్ర పోలీసు శాఖకు ఇన్‌స్టిట్యూ షనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు రావడంపై డిజిపి ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలనలో ధ్రువీకరణ ప్రక్రియ కీలకమైన అంశమని, దీనిని నిర్వహిం చడంలో రాష్ట్ర పోలీసులు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలందించారని డిజిపి తెలిపారు.

# ఎల్‌నినోపై లఘుచిత్రం

### పంటల సాగుపై రైతులకు మెలకువలు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ వినూత్నప్రచారం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతు పవనాలపై పడి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎదురయ్యే ముప్పు మరింత వాస్తవరూపం దాల్చనున్నట్లు కనిపిస్తోంది. పంటల సాగులో ఎల్‌నినో పర్యవసానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఇందుకు ప్రత్యేకంగా ఒక లఘు చిత్రాన్ని రూపొందింప చేసింది. ఎల్‌నినో తీవ్రత, అలాగే వర్షాలు సరిగ్గా కురవకపోవడం వల్ల కలిగే ప్రభావాలను నివారించడానికి రాష్ట్రంలోని రైతులు ఏమి చేయాలో తెలియ జేస్తూ ఒక లఘు చిత్రాన్ని రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో ప్రదర్శిం చనున్నారు. సుమారు నాలుగు నిమిషాల నిడివి గల ఈ లఘు చిత్రంలో, ఖరీఫ్ పంట కాలం ప్రారంభమవుతున్న తరుణంలో, ఎల్‌నినో అంటే ఏమిటి, ప్రత్యా మ్నాయ సాగు పద్ధతులు, స్వల్పకాలిక పంటలపై ఇచ్చే సలహాలను ఎందుకు పాటించాలి, అలాగే వ్యవసాయ శాఖ మార్గ దర్శకాలను ఎందుకు అనుసరించాలి అనే విషయాలపై రైతులు చర్చిస్తున్నట్లు ఈ లఘు చిత్రంలో చూపించారు. ఈ సీజన్‌లో ఎల్‌నినో అవగాహన, సురక్షిత వ్యవసాయ పద్ధతులపై రూపొందించిన ఈ లఘుచిత్రం ప్రదర్శించడం రైతుల్లో మరింత చర్చను తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడిందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొం దించిన ఇలాంటి అనేక ఇతర లఘుచిత్రాలను ఇప్పటికే వాట్సాప్ ద్వారా లక్షలాది మంది రైతులతో పంచుకోగా, వ్యవసాయ శాఖ తన ఎక్స్ హ్యాం డిల్‌లో కూడా వాటిని పొందుపరచింది. ఇప్పుడు వీటికి అదనంగా ఈ లఘుచిత్రాన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నారు.

# ప్రభుత్వ బడుల మూసివేత ప్రకటనను ముఖ్యమంత్రి ఉపసంహారించుకోవాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మూసివేతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను ఉపసం హరించు కోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశా రు. రాష్ట్రంలోని 23వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, వాటిని కేవలం 4వేలకు కుదిస్తామంటూ ముఖ్యమంత్రి ఒక ఇంటర్వ్యూలో చేసిన ప్రకటనను జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. తక్షణమే ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా ఆలోచించాలని డిమాండ్ చేశా రు. విద్యార్థుల ఆవాసాలకు సమీపంలోనే పాఠశాల అందుబాటులో ఉండాలని, ఈ బాధ్యతను ప్రభుత్వమే తీసుకో వాలని విద్యా హక్కు చట్టం 2009లో ప్రాథమిక హక్కుల్లో పొందు పర్చారని, కానీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గ్రామీణ, పేద, దళిత, గిరిజన పిల్లల ప్రాథమిక విద్యా హక్కును కాలరాసే విధంగా ఉందన్నారు.

**ఉద్యోగ నోటిఫికేషన్ ప్రాసెసింగ్ ఫీజుల పెంపు భారం తగదు**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఉద్యోగ దరఖాస్తుల ప్రాసె సింగ్ ఫీజును రూ. 200 నుండి రూ. 1,000కి పెంచడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ స్పందించి ఈ ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.



# జాతీయ రహదారిపై ఘోరప్రమాదం

### ఇద్దరు మృతి.. మరో నలుగురికి గాయాలు

**రఘునాథపల్లి, జూన్ 13, ప్రభాతవార్త :** వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామంవద్ద శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాల్లయ్యాయి. హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు వెళ్తున్న టీజీ24 బి9237 నెంబర్‌గల ఎర్టిగా కారు ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రయాణిస్తున్నారు. తెల్లవారుజామున సుమారు 2.30గంటల సమయంలో గోవర్ధనగిరి గ్రామం దర్గా సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డుదిగి పక్కనే ఉన్నకాలువలో పడిపోయింది. ఈప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతిచెందిన వారిలో ఎండి.అసద్ (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అఫ్సాహబీబ్ (27) బీడీఎస్ వైద్యురాలుగా గుర్తించారు. వీరు వరంగల్‌లోని నయీంనగర్‌కు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన రహముద్దీన్ ఖాన్ (డ్రైవర్), షాహీన్‌బేగం, ఇలేషా, రేష్మాలను వెంటనే జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన జనగామ డిసిపి**

వరంగల్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున రఘు నాథపల్లి మండలం గోవర్ధనగిరి వద్ద జరిగిన రోడ్డుప్రమాద స్థలాన్ని జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి ఆయన భాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నుండి కర్ణాటకలోని వివాహ రెసెప్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు భాదితు కుటుంబసభ్యులు పోలీసులకు వివరించారు. డ్రైవర్ అజాగ్రత్తవల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు వారు భావిస్తున్నారు. డ్రైవర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిసిపి వెల్లడించారు. ఆయనవెంట ఎస్ఐ నరేష్ తదితరులు ఉన్నారు.

## ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు

# టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

### ప్రభుత్వానికి తపస్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్య క్షుడు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్య దర్శి హన్మంత్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శని వారం జరిగింది. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఎన్‌సిటిఈ నిబంధనలకు అనుగుణంగా సెప్టెంబరు 1, 2025లో సుప్రీం కోర్టు తీర్పు వెలువడిందని, దీంతో ఆందోళన చెందిన సర్వీస్ ఉపాధ్యాయులు 65 రివ్యూ పిటి షన్స్ వేశారని తపస్ నేతలు తెలిపారు. నిబం ధనల ఆధారంగానే సుప్రీంకోర్టు ఆ రివ్యూలను కొట్టివేస్తూ 2028 ఆగష్టు 31 లోపు ఇన్ సర్వీస్ టీచర్స్‌కు చివరి అవకాశమని తీర్పు ఇచ్చింద న్నారు. దీని ప్రకారం సర్వీస్ రిమూవ్ చేసే అవకాశం ఉందని, తెలంగాణలో 30వేల మంది ఉపాధ్యా యులకు టెట్ పాస్ కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా 2సార్లు టెట్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కాస్త ఊరట మాత్రమేన న్నారు. విద్యా హక్కు చట్టం అమలు ద్వారా టెట్ అంశం ప్రస్తావనకు వచినచందన్నారు. ఏప్రిల్ 1,2010 కంటే ముందు న్యాయబద్ధంగా నోటి ఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యా యులకు ఆనాడు టెట్ అవసరం లేదు స్పష్టంగా పేర్కొనడం జరిగిందని, తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్‌లో టెట్ అర్హత ఆధారంగానే నియా మకాలు జరుగుతున్నాయన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయంలో భోదిస్తున్నారని, టెట్‌లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతుందని, దీంతో భాషా ఉపాధ్యాయులకు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా తమ బోధనకు సంబంధం లేని సబ్జెక్టు చదవి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటపుడు ప్రత్యేకంగా టెట్ ఎన్ని సార్లు పెట్టిన ప్రయోజనం లేదనే భావన ఉపాధ్యాయుల్లో ఉంద న్నారు. ఎన్‌సిఈఆర్‌టీ, ఎస్‌సీఈ ఆర్‌టీ ఆధ్వర్యంలో, దీక్ష నిష్ఠ, లాంటి అనేక ఆన్‌లైన్ వృత్యంతర శిక్షణ ఇస్తూనే ఉన్నారన్నారు.

# దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

### హకీంపేటలో ఎన్ఐఎస్ఎ దీక్షాంత్‌పెరేడ్‌లో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** దేశ భద్రతా వ్యవస్థలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ) ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 39వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 9వ బ్యాచ్ సబ్‌ఇన్‌స్పెక్టర శిక్షణార్థుల దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 76 మంది అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 124 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థులను గవర్నర్ అభినందించారు. పరేడ్‌లో ప్రదర్శించిన క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, వృత్తి నైపుణ్యం వారి అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలోని విమానాశ్రయాలు, ఓడరేవులు, అణు కేంద్రాలు, అంతరిక్ష సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు, మెట్రో నెట్‌వర్క్‌లు, కీలక పారిశ్రామిక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్ విశిష్ట సేవలందిస్తోందని గవర్నర్ అన్నారు. సంస్థల భద్రతతో పాటు దేశ ఆర్థికాభివృద్ధి, ప్రజల విశ్వాసాన్ని కాపాడటంలో కూడా సీఐఎస్ఎఫ్ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఉగ్రవాదం, సైబర్ నేరాలు, డ్రోన్ ఆధారిత ముప్పులు వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యం, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యంతో యువ అధికారులు ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. అధికారుల భుజాలపై అలంకరించిన నక్షత్రాలు కేవలం హోదాకు ప్రతీకలు మాత్రమే కాకుండా దేశం ఉంచిన విశ్వాసానికి, బాధ్యతకు, కర్తవ్యనిష్ఠకు సంకేతాలని గవర్నర్ అన్నారు. నాయకత్వానికి అధికారం కంటే వ్యక్తిత్వం, నిజాయితీ, ధైర్యం, సేవాభావమే నిజమైన పునాదులని సూచించారు. సాయుధ దళాల్లో సేవలందించిన అనంతరం మళ్లీ యూనిఫాం సేవను ఎంచుకున్న మాజీ సైనిక శిక్షణార్థులను ప్రత్యేకంగా అభినందించిన గవర్నర్, వారి దేశభక్తి, అంకితభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి పాసింగ్ అవుట్ అవుతున్న అధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అసిస్టెంట్ కమాండెంట్ లలో ప్రతిభ కనబర్చిన శిక్షణార్థులు సుమిత్ లాత్వల్ (ఆల్ రౌండర్ , స్వోర్డ్ ఆఫ్ ఆనర్ కేటగిరి) ,ఆర్యన్ తివారి ( బెస్ట్ ఇన్ అవుట్ డోర్),అలోక్ తోమర్ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర కుమార్ మీనా ( బెస్ట్ ఇన్ ఫైరింగ్),సబ్ ఇన్‌స్పెక్టర్ ( ఎక్స్ సర్వీస్ మెన్ ) కేటగిరి లో ప్రతిభ కనబర్చిన సురేష్ కుమార్ (ఆల్ రౌండర్ కేటగిరి) , దీపక్ కుమార్ సింగ్( బెస్ట్ ఇన్ అవుట్ డోర్),గౌరవ్ శర్మ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర ధర్మేందర్ సింగ్( బెస్ట్ ఇన్ ఫైరింగ్) లకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పురస్కాలు అందించి అభినందించారు. అంతకు ముందు గవర్నర్ దేశ సేవలలో అమరులైన సిఐఎస్ఎఫ్ అధికారులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, అదనపు డైరెక్టర్ జనరల్ ( హెడ్ క్వార్టర్స్) విజయ్ ప్రకాశ్, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి, సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారులు, శిక్షకులు, శిక్షణార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న అమ్మకానికి టెండర్లు

### మూడు విడతలుగా విక్రయాలు

### రేపు 4.60 లక్షల టన్నుల వేలం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వలను విక్రయించాలని తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) నిర్ణయిం చింది. ఈ నేపథ్యంలో ఈ మొక్కజొన్న నిల్వల విక్రయానికి మార్క్‌ఫెడ్ ఈ నెల 7వ తేదీన ఈ టెండర్లను అహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా నిల్వ ఉంచిన మొక్కజొన్నను మూడు విడతలుగా వేలం వేయడం ద్వారా విక్రయించనున్నారు. మొదటి విడతలో 16 లాట్లను ఈ నెల 15న వేలం వేసి విక్రయించనుండగా, రెండవ విడతకు జూలై 16, 17 తేదీలలో మరో రెండు విడతల్లో బిడ్లు నిర్వహిస్తారు. ప్రతి విడతలో సగటున 4.60 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న వేలం వేయనున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారవర్గాల సమాచారం. కాగా తెలంగాణలో వరి తర్వాత మొక్కజొన్న అత్యంత ప్రాముఖ్యమైన రెండవ ప్రధాన పంట.

రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజనుకు సంబంధించి 16.37 లక్షల ఎకరాల్లో మొక్క జొన్న పంటను రైతులు సాగు చేశారు. తద్వారా మొత్తంగా 43 లక్షల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయ్యింది. రాష్ట్రంలోని నిర్మల్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, కొత్త గూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అత్యధికంగా మొక్కజొన్న పంటను రైతాంగం సాగు చేసింది. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్నను కొనుగోలు చేస్తూ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో 22 లక్షల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా, మార్క్‌ఫెడ్ రాష్ట్రం మొత్తం మీద దాదాపు 15 లక్షల టన్నులకు వరకూ మాత్రమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేసింది. ఈ లెక్కన నిర్ధారించిన లక్ష్యం కన్నా ఇంకా సుమారు 7 లక్షల టన్నులకు పైగా మొక్కజొన్న తక్కువగా కొనుగోలు చేసింది. ఇప్పుడు ఈ మొక్కజొన్న నిల్వలను విక్రయిం చాలని మార్క్‌ఫెడ్ చర్యలు చేపట్టింది.

# ప్రజాపాలనలో పర్యాటక రంగానికి కొత్తఊపు

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయ వంతంగా ముగిసిందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ రంగాల్లో సాధించిన ప్రధాన విజయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక గమ్య స్థానంగా తీర్చిదిద్దడం, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, కళాకారుల సంక్షేమాన్ని ప్రోత్సహించడం, పర్యాటక మౌలిక సదుపాయాలను విస్తరించడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030ను అమలు చేశామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. టూరిజం కాన్‌క్లేవ్2025 ద్వారా 24 మంది పెట్టుబడిదారుల నుంచి రూ.15,285 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు లభించాయని మంత్రి తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025లో 18 మంది పెట్టుబడిదారులతో రూ.8,456 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. వీటి ద్వారా 10 వేల ప్రత్యక్ష, 30 వేల పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.181 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. బుద్ధవనం, రామప్ప, సోమశిల, నిజాంసాగర్, బల్కంపేట ఆలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. 2023లో 5.84 కోట్లుగా ఉన్న దేశీయ పర్యాటకుల సంఖ్య 2024లో రికార్డు స్థాయిలో 8.82 కోట్లకు చేరిందన్నారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు..

### విద్యుత్ శాఖ అప్రమత్తం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ప్రస్తుతం చురుగ్గా కదులుతున్నాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఓ ఉపరితల ఆవర్తనం, అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. వీటన్నింటి ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే రెండు, మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటితో పాటు హైదరాబాద్‌తో సహా దాదాపు 30కి పైగా జిల్లాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. మరోపక్క శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. హకీంపేట్‌లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో హకీంపేట్‌లో 63 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, హైదరాబాద్‌లో 23.6 మిల్లీ మీటర్లు, ఖమ్మంలో 15.2 మిల్లీ మీటర్లు, మెదక్‌లో 15 మిల్లీ మీటర్లు, నిజామాబాద్‌లో 17.5 మిల్లీ మీటర్లు, పఠాన్‌చెర్వులో 16 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. కాగా ప్రకృతి వైపరీత్యాలు, భారీ గాలివానలు, వర్షాలు సంభవించిన సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూచించింది. తెగిపోయిన విద్యుత్ వైర్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదా విద్యుత్ సంబంధిత ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే కాల్ సెంటర్ 1912కు సమాచారం అందించాలని కోరింది. ప్రజలు స్వయంగా విద్యుత్ వైర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకేందుకు, తొలగించేందుకు లేదా మరమ్మత్తులు చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని స్పష్టం చేసింది.

### నేటి నుంచి 21 వరకు సాలార్‌జంగ్ మ్యూజియం

# ప్లాటినంజూబ్లీ వారోత్సవాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ఘనంగా నిర్వహిం చేందుకు మ్యూజియం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాలార్ జంగ్-3 నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ జయంతిని పురస్కరిం చుకుని నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, ప్రత్యేక ప్రచురణలు, ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మ్యూజియం చారిత్రక వైభవాన్ని, అరుదైన కళాఖండాల ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు యువతలో వారసత్వ సంపద పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదివారం సాయంత్రం 04.30 గంటలకు సాలార్ జంగ్ మ్యూజియంకు చేరుకుని సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ప్రారంభిస్తారు.

**నేడు ఉదయం 07.00 గంటలకు**

**ర్యాలీని ప్రారంభించనున్న గవర్నర్**

ఆదివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గ్‌లో బి ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి సాగే ర్యాలీని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉదయం 07.00 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అనంతరం లోక్‌భవన్ లో సంస్కృతి కమ్యూనిటీ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర గవర్నర్ ప్రారంభించనున్నారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గందరగోళం వద్దు

### బిసి సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పై ప్రభుత్వం నిత్యం జారీ చేస్తున్న జీవోలతో విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్రగందర గోళానికి గురవుతున్నారని బీసీ సంఘాల ప్రతి నిధులు మండి పడ్డారు. పాత విధానాన్నే యథాతథంగా కొనసా గించాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 6 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం బీసీ భవన్‌లో డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన 18 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 'ప్రభుత్వం జీవో నంబర్ 7ను జారీ చేసి, వ్యతిరేకత రావడంతో తాజాగా 8, 9 జీవోలను తీసుకురావడం దారుణం. రోజుకో జీవోతో విద్యార్థుల భవిష్యత్తును సందిగ్ధంలో పడేస్తున్నారు. పథకాన్ని ఎత్తివేయాలనుకుంటే ధైర్యంగా చెప్పండి, ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం' అని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడిచినా, బకాయిలు చెల్లించలేదని, ఇప్పుడు నెలకు రూ. 300 కోట్లు ఇస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పాత విధానాన్ని పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ఈ అంశంపై ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

## రాబోయే ముప్పును ముందే అంచనావేసే స్థాయికి వైద్యరంగం

### ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్ ను ప్రపంచపటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఎకో సిస్టంను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికి విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా కేవలం వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా... రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే... ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో క్యాన్సర్, గుండెజబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు. అందుకు హైదరాబాద్ ను ఒక ల్యాంచ్ ప్యాడ్ తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అకాడెమియా, ఇండస్ట్రీ మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే ఏఐ హెల్త్ కేర్ ఆవిష్కరణలు సామాన్యుడికి అందుతాయన్నారు. భవిష్యత్తు సవాళ్లను ముందే ఎదుర్కొనేలా కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించే ఇన్నోవేషన్ ఆధారిత వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఆవిష్కరణలు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా, సమాజంలో నిజమైన మార్పును తీసుకొచ్చేలా ఆవిష్కర్తలు, స్టార్టప్స్‌కు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్‌ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్‌లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వన్ బయో పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్‌కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్‌ను సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

## గవర్నర్‌తో హంపి మఠాధిపతి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** కర్ణాటకలోని హంపి మఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామీజీ శనివారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలతో పాటు సమాజంలో విలువల పరిరక్షణ పై చర్చించారు స్వామీజీకి గవర్నర్ స్వాగతం పలికి, వారి ఆధ్యాత్మిక సేవలను అభినందించారు. ఈ సమావేశంలో మఠానికి చెందిన ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రజాభవన్‌కు వెళ్లిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారం మర్యాదపూర్వక భేటీ అయ్యారు. తన నివాసానికి విచ్చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మంత్రి సీతక్క సాదరస్వాగతం పలికి సత్కరించారు. వికారాబాద్ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక, రవాణా సదుపాయాలపై స్పీకర్ మంత్రితో చర్చించారు.

## ఎల్‌నినోతో కరవు పరిస్థితులకు అవకాశం

### రాష్ట్రాలను హెచ్చరించిన వాతావరణ విభాగం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉందని, రాష్ట్రాలు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మరోసారి హెచ్చరించింది. భూమధ్యరేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల అక్కడ స్పష్టమైన ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని అధికారికంగా వెల్లడించారు. ఫలితంగా పస్తుత రుతుపవనాల సీజన్లో ఎల్‌నినో మరింత తీవ్రరూపం దాల్చే వీలుందని పేర్కొంది. ఈ పరిణామం రాబోయే రోజుల్లో దేశీయ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదం ఉందని పేర్కొంది. సాధారణంగా ఎల్‌నినో ఏర్పడినప్పుడు పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల నీటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉంటాయి. ఈ మార్పుల వల్ల భారతదేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవనాలు బలహీనపడతాయి. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయని స్పష్టం చేసింది. పర్యవసానంగా కొన్ని ప్రాంతాల్లో అయితే కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం కూడా ఉందని ఐఎండీ నివేదికలు చెబుతున్నాయి. ఫలితంగా నైరుతి రుతుపవనాలతో వర్షాలు తగ్గడం వల్ల ప్రధాన రంగాలు దెబ్బతినే అవకాశం ఉందని అంచనా వేసింది.

# జి-7 సదస్సు నేపథ్యంలో 17న మోడీ, ట్రంప్ భేటీ!

### వాణిజ్యం, ఎఐ, భద్రతపై చర్చలు

**న్యూఢిల్లీ, జూన్ 13 :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈనెల 17న ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. జీ17 సదస్సులో పాల్గొనేందుకుగాను శనివారం ఫ్రాన్స్‌కు బయలుదేరి వెళ్లారు. ఆర్థిక వృద్ధి, సరఫరా గొలుసుల భద్రత, కృత్రిమ మేధస్సు (ఏఐ), పెట్టుబడి భాగస్వామ్యాలు, ప్రపంచ భద్రతా సవాళ్ల వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఫ్రాన్స్ పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో ప్రధాని మాట్లాడుతూ, భారత్‌ను వరుసగా ఎనిమిదోసారి జీ7 సదస్సుకు ఆహ్వానించారని ఈ వేదికపై భారత్ తన స్వరాన్ని మాత్రమే కాకుండా, గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షలకు కూడా ప్రతినిధ్యం వహిస్తుందని తెలిపారు. వైట్ హౌస్ ధృవీకరించిన ప్రకారం, జీ7 నేతలు, భాగస్వామ్య దేశాలు మరియు సాంకేతిక రంగ ప్రముఖులతో జరిగే వర్కింగ్ లంచ్‌కు ముందు మోడీ ట్రంప్ సమావేశం జరగనుంది. అమెరికా పరిపాలనలోని ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ, ఆర్థికాభివృద్ధి, సప్లయిచైన్ స్థిరత్వం, అక్రమ వలసలు, కృత్రిమ మేధస్సు వంటి ఉమ్మడి ప్రాధాన్యత కలిగిన అంశాలపై ట్రంప్ జీ7 నేతలతో చర్చిస్తారని తెలిపారు. జీ7 సదస్సు కోసం ఫ్రాన్స్‌కు వెళ్తున్న ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో పాటు ఖతార్ ఎమిర్, యూఏఈ అధ్యక్షుడు, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్‌సిసీతో కూడా ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. అమెరికా పెట్టుబడుల ఆధారిత అభివృద్ధి, వ్యూహాత్మక భాగస్వామ్యాలపై దృష్టి సారించిన ఆర్థిక అజెండాను ఈ సదస్సులో ముందుకు తీసుకెళ్లనుందని అధికారులు వెల్లడించారు. పెట్టుబడులు పెట్టే దేశం, వాటిని స్వీకరించే దేశం రెండింటికీ ప్రయోజనం కలిగే విధంగా అభివృద్ధి చర్చలను పునర్నిర్వచించడంపై అధ్యక్షుడు దృష్టి సారిస్తారని అమెరికా అధికారి పేర్కొన్నారు. కీలక ఖనిజ వనరులు, సరఫరా గొలుసుల భద్రత అంశాలు కూడా సదస్సులో ప్రధాన చర్చాంశాలుగా ఉండనున్నాయి. కొద్ది దేశాలపై అధిక ఆధారపడటం వల్ల ఏర్పడే ప్రమాదాల నేపథ్యంలో ఈ అంశాలకు ప్రాధాన్యం పెరిగింది. గత ఏడాది పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అనంతరం మోడీ, ట్రంప్ మధ్య జరిగే తొలి ప్రత్యక్ష సమావేశం ఇదే కావడం గమనార్హం. కానీ ఈ భేటీలో చర్చించనున్న పూర్తి అజెండాను వైట్ హౌస్ వెల్లడించలేదు. ఫ్రాన్స్‌లోని ఎవియన్ నగరంలో ఈనెల 16,17 తేదీల్లో జరగనున్న జీ7 సదస్సులో ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, సాంకేతిక పరివర్తన, భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. భారత్ పాత్రపై పెరుగుతున్న అంతర్జాతీయ విశ్వాసానికి జీ7 ఆహ్వానం నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "ఫ్రాన్స్, స్లోవేకియా రిపబ్లిక్ పర్యటనలు యూరప్‌తో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని మోడీ తెలిపారు. భారత్ తన ప్రయోజనాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆందోళనలను కూడా ప్రపంచ వేదికలపై వినిపిస్తూనే ఉంటుందని మోదీ స్పష్టం చేశారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో కలిసి నీస్ నగరంలో "భారత్ ఇన్నోవేట్స్" కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇండియా-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఇయర్ కింద నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం భారత స్టార్టప్‌లను అంతర్జాతీయ పెట్టుబడిదారులతో అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం మోడీ స్లోవాకియాకు వెళ్లనున్నారు. 1993లో ఆ దేశం స్వాతంత్రం పొందిన తర్వాత భారత ప్రధానమంత్రి చేస్తున్న తొలి అధికారిక పర్యటన ఇదే. అక్కడ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. వ్యాపార వేత్తలతో కూడా సమావేశం కానున్నారు.



యూరోపియన్ యూనియన్‌లో స్లోవాకియా ఒక కీలక భాగస్వామి దేశమని పేర్కొన్న మోడీ, భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలను ముందుకు తీసుకెళ్లడంలో ఈ పర్యటన ఉపయోగపడుతుందని అన్నారు. ఫ్రాన్స్ పర్యటనను జూన్ 18న పారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సాంకేతిక సదస్సులో పాల్గొనడంతో ముగిస్తారు.

## కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం.. వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు

### రాజ్యసభలో బలం పెంచుకోవడానికే బిజెపి కుట్ర: మహేశ్‌కుమార్‌గౌడ్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షినటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. శనివారం గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షి స్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షి స్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్ట్‌లను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. 'లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది' అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు. శ్రీలతా అంశాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని, పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తప్పవు అని మహేష్ గౌడ్ హెచ్చరించారు. షబ్బీర్ అలీ ఆరోపణలు చేసినంత మాత్రాన తనకేం ఇబ్బంది లేదని, చంద్రశేఖర్ రెడ్డిని పార్టీలోకి తెచ్చింది షబ్బీర్ అలీనేనని, మహిళలు రాజకీయాల్లోకి రావడానికి బయపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అన్ని రాష్ట్రాలు ఒక్కటేనని, కాంగ్రెస్ పార్టీకి ప్రాంతీయ తత్వం ఉండదని తెలియజేశారు. ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టే బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ప్రాంతాలుగా విడిపోయినా, మనుషులుగా కలిసి ఉందామనేది కాంగ్రెస్ పాలసీ అని ఏపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చాలా విషయాలు తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

# 60 రోజుల విరామం విధించొద్దు

### విబి జి రాం జి స్కీంపై కేంద్రానికి నిరసన లేఖ రాస్తాం: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన వీ బీ జీ రాంజీ స్కీంపై తెలంగాణ ప్రభుత్వం తన నిరసనను అధికారికంగా తెలియజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ తెలంగాణ శాసనసభ ఇప్పటికే తీర్మానం చేసిన విషయం తెలిసిందే. జూలై 1 నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలంటూ కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను, అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేయాలని నిర్ణయించారు. అనుగుణంగా నిరసన లేఖను రాయనున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. లేఖలో పొందుపరచాల్సిన అంశాలపై జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క శనివారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు తదితర అధికారులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం కేంద్రం నుంచి అందాలంటే కొత్త విధానాన్ని అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు ఇప్పటికే కొత్త పథకం అమలుకు సంబంధించిన నోటిఫికేషన్లు జారీ చేస్తున్నాయని కూడా వివరించారు. ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, డిమాండ్ ఆధారంగా కాకుండా నార్మేటివ్ విధానంలో పనిదినాల కేటాయింపును ప్రతిపాదించడం సరికాదన్నారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధి పనులకు విరామం ఇవ్వాలనే నిబంధనను తొలగించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. పంటల సీజన్‌లోనే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, అదే సమయంలో వనమహోత్సవం, మొక్కల నాటకం వంటి కార్యక్రమాలు ఉపాధి హామీ పనుల ద్వారా చేపడతామని పేర్కొన్నారు. ఈ సమయంలో 60 రోజుల విరామం విధిస్తే మొక్కలు నాటడం నిలిచిపోతుందని, అది కేంద్రం చేపట్టిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్ లక్ష్యాలకు కూడా విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంటల సీజన్ 60 రోజుల పాటు కొనసాగదని, అలాంటి ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు చేయడం ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. ఒకసారి పనులు ప్రారంభమైన తర్వాత మధ్యలో 60 రోజుల విరామం ఇవ్వడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, భవనాలు, ఇతర నిర్మాణాలు పూర్తయ్యే వరకు వాటి నిధులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు తగిన వెసులుబాటు కల్పించేలా కొత్త చట్టం అమలును వాయిదా వేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఈ అభ్యంతరాలను లేఖ రూపంలో నిరసన తెలుపుతామన్నారు. అయితే, అనివార్య పరిస్థితుల్లో వీబీజీ రాంజీ విధానాన్ని అమలు చేయాల్సి వస్తే ఉపాధి కూలీలకు ఎలాంటి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కూలీలకు కలిగే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే విధంగా ముసాయిదా రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కొత్త విధానం అమలుపై ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గంతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క వెల్లడించారు.



తనిఖీలు చేపడుతున్న ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ, పోలీస్ సిబ్బంది

## అక్రమ అబార్షన్ కేంద్రంపై పోలీసుల దాడి

### అనుమతి లేని ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ నిర్వహణ

### డెకాయ్ ఆపరేషన్‌తో అక్రమ కార్యకలాపాలు వెలుగులోకి.. ఇద్దరు మహిళల అరెస్టు

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), జూన్ 13, ప్రభాతవార్త:** మహిళలకు అబార్షన్ పేరిట వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుం డానే ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని యదేచ్ఛగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. గర్భిణులను లక్ష్యంగా చేసుకొని కొనసాగుతున్న వ్యాపార కేంద్రంపై పోలీసులు ప్రత్యేక నిగా పెట్టి గుట్టురట్టు చేశారు. ఈ సంఘటనలో ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం... నాగోల్ డివిజన్ జైపురికాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో అక్రమంగా అబార్షన్లు చేస్తున్న వ్యవహారం పోలీసుల డెకాయ్ ఆపరేషన్‌లో బట్టబయలైంది. మహిళల ఆరోగ్యంతో పాటు వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే విధంగా ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జైపురికాలనీ రోడ్ నెంబర్-2లో శంకర్ ఇంటికి చెందిన రెండు షట్టర్లను అద్దెకు తీసుకుని బండారు వెంకటలక్ష్మి కేసరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో గత కొంతకాలంగా కేంద్రాన్ని నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడ గర్భిణీ మహిళలకు అక్రమంగా అబార్షన్లు నిర్వహిస్తున్నట్లు తెలిసి ఎస్‌వోటీ ఎల్బీనగర్ బృందం, నాగోల్ పోలీసులు సంయుక్తంగా డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు.
దర్యాప్తులో భాగంగా గర్భిణీ మహిళగా ఓ మహిళా కానిస్టేబుల్‌ను కేంద్రానికి పంపించారు. అక్కడ ఉన్న వీర రేవతి(50) అనే మహిళ ఎలాంటి వైద్య విద్యార్హతలు లేకపోయినా, ప్రభుత్వ అనుమతులు లేకపోయినా అబార్షన్ చేయడానికి ముందుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. గర్భిణీలను తనకు పరిచయమున్న స్కానింగ్ సెంటర్లకు పంపించి, స్కానింగ్ నివేదికల ఆధారంగా అబార్షన్‌లు చేస్తున్నట్లు విచారణలో బట్టబయలైంది. డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా మహిళా కానిస్టేబుల్ వద్ద నుంచి రూ.10వేల నగదు తీసుకుని, కొన్ని ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అబార్షన్ చేసేందుకు సిద్ధమవుతుండగా, ముందస్తు ప్రణాళిక ప్రకారం అక్కడే ఉన్న పోలీసు బృందం జోక్యం చేసుకుని చర్యలు చేపట్టింది. దీంతో అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న పలు రికార్డులు, వైద్య సామగ్రి, మందులు, ఇతర ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా వైద్య సేవలు అందించడం, గర్భస్రావాల నిర్వహణ, సంబంధిత చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఇద్దరిని ఆరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరచినట్లు ఇన్‌స్పెక్టర్ మక్బుల్‌జానీ తెలిపారు.

# పతంజలి సివిల్ సర్వీసెస్ అకాడమీ ప్రారంభం

### భారతీయ విలువలతో కొత్తతరం పరిపాలనా అధికారుల శిక్షణ లక్ష్యం

**హరిద్వార్, జూన్ 13:** పతంజలి యోగపీఠం ఆధ్వర్యంలో శంఖనాదం పేరుతో పతంజలి సివిల్ సర్వీసెస్ అకాడమీని ప్రారంభించారు. భారతీయ సంస్కృతి, ఆధునిక విజ్ఞానం, జాతీయ సేవా భావనల సమన్వయంతో ఐఏఎస్, ఐపీఎస్ సహా కేంద్ర సర్వీసుల అధికారులను తీర్చిదిద్దడం ఈ అకాడమీ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. భారత పరిపాలనా వ్యవస్థలో నూతన మార్పులకు నాంది పలుకుతూ, ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక పాలనా అవసరాలతో మేళవించి దేశాభివృద్ధికి కట్టుబడి పనిచేసే అధికారులను తయారు చేయడమే అకాడమీ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. భారత్ మాత సేవకు అంకితమైన కనీసం ఒక కోటి మంది పౌరులను తీర్చిదిద్దే లక్ష్యాన్ని కూడా సంస్థ నిర్దేశించుకుంది. "విరాసత్ అండ్ విజ్ఞాన్" ద్వారా జాతీయ వ్యక్తిత్వ వికాసంఅకాడమీ ప్రారంభోత్సవంలో మాట్లాడిన యోగా గురు స్వామి రామ్‌దేవ్ ఈ సంస్థను విద్యారంగంలో ఒక చారిత్రాత్మక కార్యక్రమం అని అన్నారు. దేశం రాజ్యాంగం ద్వారా నడుస్తున్నప్పటికీ, చట్టాల అమలు అధికారుల వ్యక్తిత్వం, నైతిక విలువలపై ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. "విద్య అనేది మనస్సు, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలను నిర్మించే ప్రపంచంలోని అత్యంత సృజనాత్మక కార్యక్రమం" అని స్వామి రామ్‌దేవ్ అన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానం, పరిపాలనా నైపుణ్యం, విద్యా ప్రావీణ్యాన్ని సమన్వయం చేసే "త్రి ఎడ్యుకేషన్" నమూనాను అకాడమీ అమలు చేస్తుందని వివరించారు. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ), భారతీయ జ్ఞాన వ్యవస్థ (ఐకేఎస్)లకు అనుగుణంగా "విరాసత్ అండ్ విజ్ఞాన్" (వారసత్వం మరియు విజ్ఞానం), "బోధ్ అండ్ శోధ్" (దూరదృష్టి మరియు పరిశోధన) అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. యోగా, ప్రాణాయామం ద్వారా పరిపాలనలో అవసరమైన ఆత్మబలం, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తామని చెప్పారు. వలసవాద ఆలోచనల నుంచి పరిపాలనకు విముక్తి అవసరమాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్.పీ. సింగ్ భారత పరిపాలనా వ్యవస్థలో ఆలోచనా విధాన మార్పు అవసరాన్ని వివరించారు. ఈ అకాడమీకి ప్రముఖ విద్యావేత్త అవధ్ ఓఝా నాయకత్వం వహించనున్నారు. గత 25 సంవత్సరాల్లో వెయ్యికి పైగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు మార్గనిర్దేశం చేసిన అనుభవం ఆయనకు ఉందని స్వామి రామ్‌దేవ్ తెలిపారు. పతంజలి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ అకాడమీలో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సదుపాయాలు, ఆధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉంటాయి. శారీరకంగా దృఢంగా, మానసికంగా చురుకుగా, ఆధ్యాత్మికంగా స్థిరంగా ఉండే భవిష్యత్ భారత నాయకులను తయారు చేయడమే సంస్థ లక్ష్యంగా పేర్కొంది. ఈ కార్యక్రమంలో పతంజలి విశ్వవిద్యాలయం డీన్ సాధ్వీ దేవప్రియా జీ, ప్రో వైస్ చాన్సలర్ మయాంక్ అగర్వాల్, రిజిస్ట్రార్ సక్సేనా జీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



పతంజలి ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్ అకాడమీని ప్రారంభించిన సభలో ప్రసంగిస్తున్న యోగా గురు బాబా రామ్‌దేవ్

## సంక్షేమ గురుకులాల్లో రూ.2 వేల కోట్ల కుంభకోణం అవాస్తవం

### మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగిందని పతిపక్షాల చేస్తున్న ప్రచారం అవాస్తవమని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఖండించారు. కుంభకోణం జరిగిందని తప్పుడు ఆరోపణలు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఆరోపణలను రాజకీయ ప్రేరేపిత తప్పుడు సమాచారంగా కొట్టిపారేశారు. అలాంటి నిరాధారమైన ఆరోపణలు చేసే ముందు ఆధారాలు, వివరాలు చూపించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట వివరాలు ఉంటేనే నేను స్పందించగలనని స్పష్టం చేశారు. రాష్ట్ర నిధులతో నడిచే గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ వర్గాలకు చెందిన 6 లక్షల మందికి పైగా విద్యార్థులు చేరారని, ఈ పాఠశాలలు ఉచితంగా, నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యను అందిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా పోషణ, విద్యార్థుల సంక్షేమం, వసతి సౌకర్యాలకు మద్దతుగా గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం గత నెలలో రూ.221.24 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు

AU SMALL FINANCE BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా), (CIN: L36911RJ1996PLC011381)

అనుబంధం-IV-A (నియమం 8 (6) నిబంధన చూడండి)

స్థిర ఆస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 (6) నిబంధనతో చదవబడిన, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 కింద స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం అమ్మకపు నోటీసు. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టిన క్రింద వివరించిన స్థిరాస్తులన్నింటినీ ఇక్కడ AUSFBగా సూచిస్తామని ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారు/తనఖాదారు(లు)కి ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూర్డ్ ఆస్తులను "ఎక్కడ ఉందో అలాగే", "ఏదో అలాగే" మరియు "అక్కడ ఏదో అలాగే" ప్రాతిపదికన E-వేలం ద్వారా దిగువ పట్టికలో పేర్కొన్న మొత్తాన్ని రికవరీ చేయడానికి, AUSFB కారణంగా వచ్చే వడ్డీ, ధర, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు విక్రయించబడతాయి. సెక్యూర్డ్ క్రెడిటర్ https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్ ద్వారా మేము పబ్లిక్ ఇ-వేలం నిర్వహించబోతున్నామని మీకు ఇందుమూలంగా తెలియజేయబడుతోంది.

| ఖాతా నం. & రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తనఖాదారులు, హామీదారుడి పేరు | డిమాండ్ నోటీసు U/s 13(2) ప్రకారం తేదీ & మొత్తం & సింబాలిక్‌గా స్వాధీనం తేదీ మరియు (తేదీ) నాటికి మొత్తం | రిజర్వ్ ధర, బయానా & బిడ్ పెంపు మొత్తం (రూ.లక్షలలో) | ఇ-వేలం తేదీ మరియు సమయం, బయానా సమర్పణ చివరి తేదీ, బిడ్‌లు & డాక్యుమెంట్ల సమర్పణ స్థలం, తనిఖీ తేదీ |
|---|---|---|---|
| (రుణ ఖాతా నెం.) 2406261261150696, M/S. హరి శ్రీ కంప్యూటర్స్ వారి భాగస్వాములైన శ్రీ PVSS బ్రహ్మం మరియు శ్రీ కాకాని గోపాల కృష్ణ ద్వారా (రుణగ్రహీత) శ్రీ PVSS బ్రహ్మం S/o శ్రీ V B పమిడిమూర్తుల (హామీదారు) శ్రీ కాకాని గోపాల కృష్ణ S/o శ్రీ జయరామయ్య గోపాల (హామీదారు/తనఖాదారు) | 13(2) నోటీసు జారీ తేదీ 30/01/2026 లోన్ ఖాతా నెం. 2406261261150696 లో రూ. 3,07,72,292/- (మూడు కోట్ల ఏడు లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంభై రెండు రూపాయలు మాత్రమే) 29-01-2026 తేదీ నాటికి. 21-04-2026న సింబాలిక్‌గా స్వాధీనం రుణ ఖాతా నెం. 2406261261150696, రూ. 3,25,70,746/- (మూడు కోట్ల ఇరవై ఐదు లక్షల డెబ్బై వేల ఏడు వందల నలభై ఆరు రూపాయలు మాత్రమే) 04-06-2026 తేదీ నాటికి, దీనికి అదనంగా భవిష్యత్ వడ్డీ మరియు ఛార్జీలు ఉంటాయి. | రిజర్వ్ ధర రూ. 1,74,00,000/- (కోటి డెబ్బై నాలుగు లక్షల రూపాయలు మాత్రమే) బయానా రూ. 17,40,000/- (పదిహేడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే) బిడ్ పెంపు మొత్తం రూ. 10,000/- (పది వేల రూపాయలు మాత్రమే) | 23 జూలై 2026 ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు అపరిమితంతో ఐదు నిమిషాల పొడిగింపు. బిడ్ సమర్పణకు చివరి తేదీ 22 జూలై 2026 సా.05:00 గం.ల వరకు. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ బ్రాంచ్ (గ్రౌండ్ ఫ్లోర్, హౌస్ నంబర్ - 25/A, వెంగళరావు నగర్ కాలనీ, హైదరాబాద్, తెలంగాణ-500038 ఇమెయిల్ ఐడీ: bhanu.singh3@aubank.in తనిఖీ తేదీ: 29 & 30 జూన్ 2026 |

తనఖా ఆస్తి వివరణ

1. సర్వే ప్రకారం 1183 చదరపు గజాలు లేదా 898.13 చదరపు మీటర్ల విస్తీర్ణం గల వ్యవసాయేతర ఆస్తిలోని ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణాలతో సహా మొత్తం అడంతా ఖాళీ స్థలం. నం. 210/A, (పాత సర్వే నం. 130/00), తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ముదుచింతల్‌పల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో ఉంది. యజమాని శ్రీ కాకాని గోపాల కృష్ణ. సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: - తూర్పు: సర్వే నం. 210/A లోని కొంత భాగం, పడమర: రోడ్డు, ఉత్తరం: మెదక్ జిల్లా సరిహద్దు కరకపట్ల గ్రామం, దక్షిణం: డిజైర్ ఎస్టేట్ ప్లాట్లు
2. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ముదుచింతల్‌పల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో ఉన్న, సర్వే నెం. 210/A (పాత సర్వే నెం. 130/00) లోని, వ్యవసాయేతర ఆస్తికి చెందిన ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణాలతో సహా, 750 చదరపు గజాలు లేదా 627.09 చదరపు మీటర్ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం. దీని యజమాని శ్రీ కాకాని గోపాల కృష్ణ. సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: - తూర్పు: రోడ్డు, పడమర: శ్రీ బింగి రాజయ్య గారి భూమి & సర్వే నెం. 203, ఉత్తరం: మెదక్ జిల్లా సరిహద్దు కరకపట్ల గ్రామం, దక్షిణం: డిజైర్ ఎస్టేట్ ప్లాట్లు. **గమనిక-పైన పేర్కొన్న ఆస్తులు అన్నీ కలిపి అమ్మబడతాయి.**

ఇ-వేలం అమ్మకం ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తిగల పాల్గొనేవారు / బిడ్డర్లు అందరూ నిబంధనలు మరియు షరతులతో సహా మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌లను సందర్శించవలసిందిగా అభ్యర్థించడమైనది. అలాగే, శ్రీ భాను ప్రతాప్ సింగ్‌ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది. సంప్రదింపు నంబర్ 9358002663 మరియు ఇ-మెయిల్ bhanu.singh3@aubank.in.

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) ప్రకారం ఇది కూడా రుణగ్రహీత/తాకట్టుదారులకు చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు నోటీసు.**

ఇ-వేలం అమ్మకం యొక్క నియమ మరియు నిబంధనలు:-

1. సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం, సెక్యూర్డ్ రుణదాత అయిన AUSFB తరపున మరియు వారి కోసం "ఉన్నది ఉన్నట్లుగా", "ఏది ఉంటే అది", "ఏది ఉంటే అది" మరియు "ఎటువంటి పరిహారం కోరే హక్కు లేదు" అనే ప్రాతిపదికన జరుగుతుంది మరియు సదరు ఆస్తిపై తెలిసిన ఎటువంటి భారం లేదు. 2. ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంలో పాల్గొనడానికి, బిడ్ పత్రం, పాన్ కార్డ్ కాపీలు, కంపెనీ విషయంలో బోర్డ్ తీర్మానం మరియు ఫోటో గుర్తింపు కార్డు, చిరునామా రుజువుతో పాటు బయానాను సమర్పించవలసి ఉంటుంది. ఈ బయానాని AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ వారి MSME ఆక్షన్ పూల్ అకౌంట్ పేరు మీద RTGS/NEFT ద్వారా చెల్లించాలి. కరెంట్ అకౌంట్ నెం. 1921201121711599, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, ఐదవ మరియు ఆరవ అంతస్తు, సన్నీ బిగ్ జంక్షన్ STC, ఖస్రా నెం. 64 నుండి 67, గ్రామ్ సుల్తానపురా, న్యూ ఆతిష్ మార్కెట్, జైపూర్ 302020, IFSC కోడ్: AUBL0002011. ఒకసారి ఆన్‌లైన్ బిడ్ సమర్పించిన తర్వాత, దానిని ఉపసంహరించుకోలేరు. ఇంకా, బిడ్డర్ సమర్పించిన ఏదైనా EMD కోసం, RTGS/NEFT యొక్క UTR/రిఫరెన్స్ నంబర్‌ను రద్దు చేయబడిన చెక్కు కాపీతో పాటు ఈ క్రింది ఇ-మెయిల్ ఐడీకి పంపవలసి ఉంటుంది. అనగా: rakesh.jain1@aubank.in
3. ఇ-వేలం అమ్మకం ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తిగల పాల్గొనేవారు / బిడ్డర్లు అందరూ నిబంధనలు మరియు షరతులతో సహా మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌లను సందర్శించవలసిందిగా కోరడమైనది. అలాగే, శ్రీ భాను ప్రతాప్ సింగ్‌ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది, సంప్రదింపు నంబర్ 9358002663 మరియు ఇ-మెయిల్ bhanu.singh3@aubank.in.

తేదీ : 13-జూన్-2026 ప్రదేశం : మేడ్చల్ - మల్కాజ్‌గిరి, తెలంగాణ అధీకృత అధికారి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

# దేశంలోనే తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

## 6.15 శాతంతో అన్ని రాష్ట్రాల్లో కెల్లా హాయ్యెస్ట్ - ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** దేశంలోని అన్ని రాష్ట్రాలలోకెల్లా తెలంగాణలో ద్రవ్యోల్బణం అత్యధికంగా కొనసాగుతోంది. గత నెలలో ఇది 6.15 శాతానికి చేరిందని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. ఇంధనంపై అధిక పన్నులు, గ్రామీణ వేతనాల పెరుగుదల, దిగుమతి చేసుకునే తాజా ఉత్పత్తులపై ఆధారపడటం దీనికి కారణంగా వెల్లడించింది. ఈ మేరు శనివారం విడుదలైన ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదికలో వెల్లడించిన అంశాల ప్రకారం రాష్ట్ర స్థాయి వినియోగదారుల ద్రవ్యోల్బణ గణాంకాలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రాంతీయ వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఉన్న 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉండగా, వీటిలో 12 నుండి 14 వరకూ ద్రవ్యోల్బణం అఖిల భారత స్థాయి కంటే ఎక్కువగా ఉంది. కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి అనేక ప్రధాన రాష్ట్రాలలో ద్రవ్యోల్బణం అఖిల భారత స్థాయి కంటే ఎక్కువగా కొనసాగుతోందని నివేదిక పేర్కొంది. ప్రధాన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్, అస్సాం, ఒడిశా రాష్ట్రాలు ఈ ఏడాది జనవరి నుండి మే మధ్యకాలంలో ద్రవ్యోల్బణంలో 2 శాతానికి పైగా పెరుగుదలను నమోదు చేయగా, అఖిల భారత స్థాయిలో ద్రవ్యోల్బణం కేవలం 1.19 శాతం మాత్రమే పెరిగింది. అయితే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ద్రవ్యోల్బణం పంపిణీని పరిశీలిస్తే, జనవరిమే మధ్య కాలంలో అధికశాతం రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం 24 శాతం మధ్య ఉన్నట్లు స్పష్టమవుతోందని నివేదిక పేర్కొంది. భారతదేశ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లోని 3.48 శాతం నుండి మే నెలలో 3.93 శాతానికి పెరిగింది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల మరియు స్వల్ప ఎల్‌పిజి కొరత ప్రభావం మే నెల గణాంకాలలో స్పష్టంగా కనిపిస్తోంది. ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో రవాణా ద్రవ్యోల్బణం 176 బేసిస్ పాయింట్లు పెరిగి 1.8 శాతానికి చేరింది. అదేవిధంగా, రెస్టారెంట్లు, వసతి సేవల (ఇవి ఎక్కువగా ఎల్‌పిజిపై ఆధారపడి ఉంటాయి) ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లోని 4.2 శాతంతో పోలిస్తే మే నెలలో 154 బేసిస్ పాయింట్లు పెరిగి 5.7 శాతానికి చేరింది. ఇక బంగారం, వెండి ధరలలో స్వల్ప పెరుగుదల కారణంగా పర్సనల్ కేర్ విభాగంలో ద్రవ్యోల్బణ రేటు దాదాపు 80 బేసిస్ పాయింట్లు పెరిగింది. వస్తువుల వారీగా చూస్తే, వెండి ఆభరణాలు ప్రధాన ద్రవ్యోల్బణానికి 56 బేసిస్ పాయింట్ల మేర దోహదపడగా, ఆ తర్వాత బంగారం 30 బేసిస్ పాయింట్ల మేర దోహదపడింది, ఇది గత నెలతో పోలిస్తే మారలేదు. ప్రపంచ బ్యాంకు పింక్ షీట్‌లో ప్రతిబింబించినట్లుగా, ప్రపంచ వస్తువుల ధరలలో బంగారంతో పోలిస్తే వెండిలో ద్రవ్యోల్బణం బలంగా ఉంది. పెట్రోల్ వాటా 14 బేసిస్ పాయింట్లకు పెరగగా, ఎల్‌పిజి కొరత కారణంగా వండిన మాంసం, వండిన స్నాక్స్ ధరలు పెరిగాయని ఆ నివేదిక పేర్కొంది.



స్వాధీనం చేసుకున్న హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్

# అల్వాల్‌లో డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

## 70లక్షల విలువైన హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ స్వాధీనం

### ఉనికిలో లేని కంపెనీల లేబుల్స్‌తో దందా

**అల్వాల్, జూన్ 13 ప్రభాతవార్త:** ఉనికిలో లేని కంపెనీ లేబుల్స్ ఒక వైపు నకిలీ చిరునామాతో కోట్లులో దందా చేస్తున్న ఓ ముఠా వెలుగులోకి వచ్చింది. 70లక్షలు విలువైన ఫార్మా ముడి సరుకు అల్వాల్‌లో బయట పడడం సంచలనంగా మారింది. 240 కేజీల హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 12వ తేదీన అల్వాల్ మంగాపురంలోని డీకే ఫార్మాస్యూటికల్స్ కంపెనీపై అధికారులు దాడులు చేశారు. సంస్థ భవనంలో తనిఖీలు చేయగా విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ ఉన్న 12 డ్రమ్ములను అధికారులు గుర్తించారు. డ్రమ్ములపై అసలుకు బదులుగా ఉనికిలో లేని కంపెనీలకు చెందిన నకిలీ లేబుల్స్ అంటించి ఉండడాన్ని గమనించారు. తయారీదారుడిగా డికె ఫార్మాస్యూటికల్ పేరును తప్పుగా లేబుల్స్‌పై పొందు పరిచారు. లేబుల్‌పై కంపెనీ చిరునామ సంగారెడ్డి జిల్లా, పాశమైలారంగా ఉంది. అధికారులు తనిఖీలులో ఆ చిరునామాలో అసలు కంపెనీ లేదని తేలింది. అనుమానంతో కూపీ లాగితే వీరి దందాకు అడ్డాగా అల్వాల్‌ను మార్చుకున్నట్లు గుర్తించారు. నకిలీ కంపెనీని నిర్వహిస్తున్న సతీష్ బాబు, ధూలపల్లి నాగస్వామి అక్రమ లేబలింగ్‌కు పాల్పడినట్లు అధికారులు నిర్ధారించారు. హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్‌ను ఔషధాలు తయారీలో ఉపయోగించే సహాక పదార్థం. మందులు తయారీలో ఉపయోగించే ప్రధాన ఔషదం కాదు. ఫార్మా కంపెనీలు తయారు చేసే మందులులో హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ కలపడం ద్వారా నీటిలో ఔషదం బాగా కరిగి పోతుంది. మానవ శరీరంలో ఈ మందు తొందరగా ఇంకి పోవడంతో పాటుగా మందు స్థిరత్వంగా ఉండడానికి సహాయకారిగా ఉంటుంది. నిలువ కాలాన్ని పెంచడం, మందు ప్రభావవంతంగా పని చేయడానికి దోహదం చేసే కెమికల్. ఇంకా చెప్పాలంటే హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ అనేది మందు బాగా పని చేయడానికి కలిపే సహాయక పదార్థం. ఇది స్వతంత్రంగా ఏ వ్యాధిని నయం చేసే గుణాలు లేని పదార్థగా చెప్పవచ్చు. స్వాధీనం చేసుకున్న కెమికల్‌ను విశ్లేషణ కోసం సంబంధిత శాఖకు అధికారులు పంపించారు. నిందితులుపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ 1940 చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

# ఖమ్మం సంఘటనలో నిందితుడికి ఉరిశిక్ష వేయాలి

### - టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కవిత

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం బాధితురాలిని తెలంగాణ రక్షణ సేన(టీఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని, చిన్నారికి అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి తల్లిదండ్రులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఖమ్మం ఘటనలో నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మైనర్లపై దారుణాలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి వెంటనే ఈ దారుణాలను నివారించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన హృదయ విదారకరమైందని, 12 ఏళ్ల బిడ్డ జీవితాంతం మంచానికే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ఈ కేసులో ప్రభుత్వ పెద్దలే కొందరు కేసు వాపసు తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి వెంటనే ఇంటిని మంజూరు చేయాలని, నెలవారి రూ. 50 వేలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుడు బెయిల్‌పై వచ్చి మళ్లీ బాధిత కుటుంబంపై దాడి చేసే పరిస్థితి కూడా లేకపోలేదని, అందుకే బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించాలన్నారు. ఈ సంఘటనలో ప్రభుత్వం కచ్చితంగా మానవీయకోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘోరాలు జరగకుండా మహిళ లోకానికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అంతకముందు బక్క జడ్సన్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బాధితురాలిని పరామర్శించారు.

# జీడిమెట్ల పారిశ్రామికవాడలో బంగ్లాదేశ్ వలసవాదుల గుట్టురట్టు

## ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

**కుత్బుల్లాపూర్, జూన్ 13 ప్రభాతవార్త** నగర శివారు జీడిమెట్ల పారిశ్రామికవాడలో బంగ్లాదేశ్ అక్రమ వలస దారుల చొరబాటు గుట్టును పోలీసులు రట్టుచేశారు. బంగ్లాదేశ్ దేశంనుండి బెంగాల్‌లోకి చొరవడి అక్కడినుండి హైదరాబాద్‌కు వచ్చి స్థానిక జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ప్రైవేట్ కంపెనీలలో ఉపాధి సంపాదించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని హావాలా కార్యక్రలాపాలద్వారా తమ కుటుంబ సభ్యులకు డబ్బులు చేరవేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కుత్బుల్లాపూర్ జోన్ డిప్యుటీ పోలీసు కమషనర్ ఎన్. కోటిరెడ్డి ఆదేశాల మేరకు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం హెచ్‌ఎఎల్ ఏరియాలో ఒ అద్దెఇంట్లో ఏడుగురు బంగ్లాదేశీయులు నివసిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపైతగిన నిర్భంధ, కదలికలనియంత్రణ ఉత్తర్వులను పొంది అరెస్టుచేశారు. జీడిమెట్ల పోలీసులు, కూకట్‌పల్లి స్పెషల్ ఆపరేషన్‌టీమ్(ఎస్ఓటి) పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పట్టుబడిన ఏడుగురు వ్యక్తుల వద్ద చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులుగాన, ఇతర డాక్యుమెంట్లుగానీ లేవు. వీరు దేశంలోని పలు ప్రాంతాలలో నివసించి చివరకు జీడిమెట్ల పారిశ్రామికవాడ సమీపంలోని హెచ్‌ఎఎల్ కాలనీకి చేరుకుని అద్దఇంట్లో నివసిస్తున్నట్లు నిఘావర్గాలు గుర్తించాయి. బంగ్లాదేశ్ నుండి పశ్చిమబెంగాల్‌లోకి ప్రవేశించి దళారుల సహాయంతో హైదరాబాద్ జీడిమెట్లకు ఏడుగురు వ్యక్తులు ప్రవేశించారు. అనంతరం దళారులద్వారా నకిలీ ఐడెంటిటీ కార్డులు, ఓటర్‌కార్డులతోపాటు పలు పత్రాలను సృష్టించి తద్వారా స్థానికంగా ఇళ్లను అద్దెకు తీసుకుని అనంతరం స్థానికంగా ఉద్యోగాలు సంపాదించారు. బంగ్లాదేశ్ దేశం నుండి అక్రమ వలసదారులు కేవలం పొట్టకూటికే వచ్చారా'లేక ఇతరేతర కారణాలేమైనా ఉండి ఉంటాయా అనేకోణాల్లో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇలాంటి అక్రమ వలసదారుల వెనక హ్యూమన్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ పనిచేస్తుందని నిఘా వర్గాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. గతంలోనూ బంగ్లాదేశ్ వలసదారుల ఉదంతాలు నగరాన్ని కంపించేలా చేయగా నగరంలోని బాలానగర్, పహాడీశరీఫ్, చాంద్రాయన్‌గుట్ట తదితర ప్రాంతాలలో నివాసముంటూ అనుమానాస్పద కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు గతంలోనే పోలీసులకు పలు అనుమానాలు తలెత్తాయి. బంగ్లాదేశ్ దేశంనుండి నగరంలోని జీడిమెట్ల పారిశ్రామికవాడకు వచ్చి ఉపాధి పొందుతున్న ఏడుగురు వలసవాదుల కార్యకలాపాలపై పోలీసులు ఇప్పటికే వివిధ కోణాల్లో విచారణ ముమ్మరంచేస్తున్నట్లు సమాచారం. అలజడులు సృష్టించే కుట్రలకు ఏమైనా పాల్పడుతున్నారా అనే కోణాల్లో విచారణ ముమ్మరం చేశారు.

# విద్యుత్ షాక్‌కు గురై తండ్రి, కూతురు మృతి

## కుటుంబాన్ని చిదిమేసిన విద్యుత్ శాఖ నిర్లక్ష్యం



బాధితులు సందీప్, రితిక (ఫైల్)

**అల్వాల్, జూన్ 13 ప్రభాతవార్త:** విద్యుత్ శాఖ నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. విద్యుత్ తీగలు, చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని మోర పెట్టుకున్నా పట్టింపు లేని ధోరణి ప్రమాదానికి కరణంగా మారింది. ఒకానోక కోడుకు, మనువరాలు విగత జీవులుగా మారడం, కోడలు ఒంటరి జీవితాన్ని కొనసాగించాలనే ఊహకే కుటుంబంలోని జీవిత చరమాంకంలో ఉన్న పెద్దలు జీర్ణించుకో లేక పోతున్నారు. అల్వాల్‌లోని టెలీకాం కాలనీలో సందీప్(45) భార్య మమత, కూతురు రితిక(16)తో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. సందీప్ సాయి శ్రీ ఫుడ్స్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జాము 2.30 గంటలు సమయంలో కురిసిన వర్షానికి కాలనీలోని విద్యుత్ తీగలు ఇంటి ముందు ఉన్న చెట్టుపై పడ్డాయి. చెట్టు కింద కారు ఉండడంతో దానికి పక్కకు జరపడానికి సందీప్ భార్య మమత, కూతురు రితికి బయటకి వెళ్ళారు. ప్లాస్టిక్ ఇన్సులేషన్‌తో కూడిన విద్యుత్ తీగ వేలాడుతూ ఉండడాన్ని గమనించిన మమత దానిని కారుకు దూరంగా జరపడానికి ప్రయత్నించగా కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయింది. అప్పటికే కారులో ఉన్న సందీప్ బయటకి వచ్చిన సందర్భంలో మరో విద్యుత్ తీగ కుమార్తె రితిక మీద పడింది. కుమార్తెను రక్షించేందుకు సందీప్ ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన విద్యుత్ షాక్‌కు గురయ్యారు. బయట చీకటిగా ఉండడంతో పొరపాటున కర్ర అనుకుని విద్యుత్ తీగను మొదట రితికి పట్టుకుంది. అప్పటికే విషయం కాలనీలోని ప్రజలకు తెలియడంతో అక్కడకి రావడం జరిగింది. అప్పటికి సందీప్, రితికలు జీవించే ఉన్నారు. ఎక్కడి వారు అక్కడే ఉండాలని ఇరువుని వారు హెచ్చరించారు. కూతురి పరిస్థితి ఎలా ఉందో అని ఆమెను సందీప్ పట్టుకున్నాడు. కూతురిని రక్షించే ప్రయత్నంలో సందీప్ కూడా షాక్‌కు గురై మరణించాడు. స్వల్ప గాయాలుతో మమత బయట పడగా కళ్ళ ఎదుట భర్త, కూతురు విగత జీవులుగా మారడాన్ని చూసిన ఆమె షాక్‌కు గురయ్యారు. విద్యుత్ శాఖకు ఫోన్ చేసినా స్పందించ లేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో

## సోషల్ మీడియా ఖాతాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూన్13:** సోషల్ మీడియా ఖాతాలపై కాంగ్రెస్ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన పోలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో సోషల్‌మీడియాలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ వెనుకబడి ఉందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం చాలా యాక్టివ్‌గా ఉన్నామని మళ్లీ సోషల్‌మీడియాను విరివిగా వినియోగించుకోవాలని సిఎం చెప్పారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ ఆదేశాలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రస్తుతం సోషల్‌మీడియా ఖాతాలపై దృష్టి సారించడం విశేషం. ఢిల్లీ నుంచి గల్లీ దాక జరిగే సంఘటనలు, వాటికి సంబంధించిన అభిప్రాయాలను సోషల్ మీడియా ద్వారా పలువురు తమ అభిప్రాయాలను అధికంగా వ్యక్తం చేస్తుండడంతో మంత్రులంతా ప్రస్తుతం వాటిపైనే దృష్టి సారించారు. రాజకీయ నేతల ప్రజాదరణను అంచనా వేయడంలో సోషల్ మీడియా ప్రస్తుతం ఒక కొత్త ప్రమాణంగా మారుతోంది. సోషల్ మీడియా కేవలం ప్రచార వేదికగా మాత్రమే కాకుండా ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే వేదికగా మంత్రులు మార్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే రోడ్లు, సాగునీరు, విద్యుత్, ఆరోగ్యం, ఐటీ, రెవెన్యూ, హౌజింగ్ వంటి శాఖల మంత్రులు తమ శాఖల పురోగతిని ఎప్పటికప్పుడు ప్రజలతో పంచుకుంటున్నారు. దీనికితోడు సంప్రదాయ రాజకీయ ప్రచారానికి తోడు డిజిటల్ ప్రచారంపై మంత్రులు దృష్టి సారించడంతో టెక్నాలజీ వినియోగంలోనూ మంత్రులు ముందంజలో ఉన్నారని ప్రజలు సైతం పేర్కొంటుండడం విశేషం. ఈ నేపథ్యం లోనే మంత్రులు తమ రోజువారీ కార్యక్రమాలకు సంబంధించి వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయిస్తుండడంతో గంటల వ్యవధిలోనే వేలాదిగా షేర్లు, కామెంట్లు వ్యూవర్స్ నుంచి అధికంగా వస్తున్నాయి.

# వెనిజులా డ్రగ్ కింగ్ రెస్తోన్‌ఫోర్డ్ గెర్రెరో హాతం!

## ట్రూత్‌పోస్టులో వెల్లడించిన డొనాల్డ్‌ట్రంప్

**కారకాస్,జూన్ 13:** వెనిజులాకు చెందిన ప్రఖ్యాత నేర ముఠా ట్రెన్ డి అరాగువా నాయకుడు హెక్టర్ రుస్తెన్‌ఫోర్డ్ గెర్రెరో ఫ్లోరెస్ అలియాస్ నినో గెర్రెరో హతమైనట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా సదర్న్ కమాండ్, వెనిజులా భద్రతా బలగాల సమన్వయంతో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో అతడిని అంతమొందించినట్లు తెలిపారు. ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్ నా ఆదేశాల మేరకు అమెరికా సదర్న్ కమాండ్ వేగవంతమైన, అత్యంత కచ్చితమైన దాడి నిర్వహించి ట్రెన్ డి అరాగువా నాయకుడు నినో గెర్రెరోను హతమార్చింది. ప్రపంచంలోని అత్యంత రక్తపిపాసి ఉగ్ర సంస్థల్లో ఇది ఒకటఅని పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం ట్రెన్ డి అరాగువా ముఠాను ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. డ్రగ్స్ అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా, వసూళ్లు, కిడ్నాప్‌లు, హత్యలు వంటి అనేక నేరాల్లో ఈ ముఠా ప్రమేయం ఉందని ఆరోపిస్తోంది. గెర్రెరో ఫ్లోరెస్‌పై అమెరికాలో రాకెటీరింగ్ కుట్ర సహా పలు కేసులు నమోదయ్యాయి. అతని అరెస్టుకు సంబంధించిన సమాచారానికి 5 మిలియన్ డాలర్ల వరకు బహుమతి కూడా ప్రకటించారు. బొలివార్ రాష్ట్రంలో నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో నినో గెర్రెరో మృతి చెందినట్లు వెనిజులా అధికారులు కూడా ధృవీకరించారు. అమెరికా సైన్యం ప్రత్యక్షంగా పాల్గొన్న విషయంపై అమెరికా, వెనిజులా వర్గాల వివరణల్లో స్వల్ప భేదాలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. జైలు నుంచి అంతర్జాతీయ నేర సామ్రాజ్యం ట్రెన్ డి అరాగువా ముఠా వెనిజులాలోని టోకోరాన్ జైలు నుంచి పుట్టుకొచ్చింది. నినో గెర్రెరో అక్కడి నుంచే తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించి లాటిన్ అమెరికాలో అత్యంత భయంకరమైన నేర ముఠాల్లో ఒకటిగా మార్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ గ్యాంగ్ సభ్యుల సంఖ్య 2,500 నుంచి 5,000 మధ్య ఉంటుందని అంచనా. ఈ ఆపరేషన్ భద్రతకు ముప్పుగా భావిస్తున్నారు.

# ఒమన్ తీరంలో నౌకలపై దాడులపట్ల యుఎస్ విదేశాంగమంత్రితో జైశంకర్ భేటీ

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఒమన్‌తీరంలో ఇటీవల భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా దాడులు చేయడాన్ని భారత్ మరోసారి తీవ్రంగా ఖండించి ంది. ఈ దాడుల విషయమై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జై శంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా దాడిపై ఆయన తీవ్ర నిరసన తెలియజేశారు. రూబియోతో శుక్రవారం సాయంత్రం మాట్లాడినట్లు జై శంకర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గల్ఫ్‌లో అమెరికా జరిపిన దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించడంపై భారత్ తరఫున నిరసన తెలిపారు. వాణిజ్య నౌకలపై ఇలాంటి దాడులు సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ఢిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మీక్స్‌కు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రెండుసార్లు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. భారతీయులున్న నౌకలపై దాడులు చేసింది ఇరానే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఈ ఆరోపణలను టెహ్రాన్ ఖండించింది. ఈ మేరకు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్టు పెట్టింది. భారతీయులున్న నౌకపై దాడులకు సంబంధించి ట్రంప్ ఆరోపణలు నిరాధారమైనవన్నారు.

### ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో.. వివిధ శాఖల్లో లక్ష పెండింగ్ ఫైళ్లు పరిష్కారం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. మార్చి 6 నుంచి ఈ నెల 12 వ తేదీ వరకూ వరకు గ్రామాలు, పట్టణాల్లో వివిధ అంశాలపై చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 12,758 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు, 3,175 మున్సిపల్ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న 1,06,598 ప్రభుత్వ ఫైళ్లను అధికారులు పరిష్కరించారు. అలాగే జిల్లా స్థాయిలో 32,451 మంది లబ్ధిదారులకు ఆస్తుల మంజూరు ప్రక్రియ పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ప్రజారోగ్యం, రోడ్డు భద్రత, సంక్షేమం, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వ్యవసాయ రంగంలో 32,818 మంది రైతులు రుణమేళాల్లో పాల్గొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.6 కోట్లతో నిర్మించిన 50 అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారు.



# అభిషేక్‌ను క్షమించాను కల్యాణ్ బెనర్జీ యూటర్న్

**కోల్‌కతా, జూన్13:** అభిషేక్ కావాలో, తాను కావాలో తేల్చుకోవాలని మమతా బెనర్జీకి అల్టిమేటం జారీ చేసిన కల్యాణ్‌బెనర్జీ యూటర్న్ తీసుకున్నారు. అభిషేక్ విషయంలో మాట మార్చారు. అతడు తన కొడుకులాంటి వాడని కొడుకు తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుందని పేర్కొన్నారు. అభిషేక్‌ను క్షమిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఎ అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతిపక్షం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితిని బెంగాల్ ఎప్పుడూ ఎదుర్కోలేదన్నారు. టిఎంసిని వీడిన ఎంపిలపై కల్యాణ్ బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి వేసిన ఎత్తుగడను అర్థం చేసుకోలేక వారంతా పార్టీని వీడారని ఇప్పుడు ఆ పార్టీ నేతల నీడలో బతకాల్సి వస్తుందని పేర్కొన్నారు. టిఎంసి, కాంగ్రెస్‌లో విలీనమవ్వనుందని వస్తున్న వార్తలను ఖండించారు. కల్యాణ్ బెనర్జీ అంతకు ముందు మీడియాతో మాట్లాడుతూ మమతకు అల్టిమేటం జారీ చేశారు. అభిషేక్ కావాలో, తాను కావాలో తేల్చుకోవాలన్నారు. అభిషేక్ వల్లే ఆ రోజు పార్టీ నాశనమైంది. అహంకారంతో ఆయన ప్రవర్తిస్తున్నారు. సీనియర్లకు గౌరవం ఇవ్వరు. నేను ఇప్పటికీ మమత వైపే ఉన్నాను. అయితే ఎవరు కావాలో దీదీ తేల్చుకోవాలి. అభిషేక్ వైపు ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే నేను నా నిర్ణయంతీసుకుంటా అని స్పష్టం చేశారు. కలకత్తా హైకోర్టులో విచారణ జరుగుతున్న సంతకాల ఫోర్జరీ కేసులో తాను అభిషేక్ న్యాయవాదిగా ఉన్నానని, కానీ తనకు తెలియకుండా ఈ వ్యాజ్యంలో మరో పిటిషన్‌ను జూనియర్ లాయర్ వేశారని అన్నారు. ఇది తనకు అవమానకరమని బెనర్జీ అన్నారు.

# కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు : తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి

**నస్పూర్, జూన్ 13, ప్రభాతవార్త** సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వైద్య పరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి, వైరా నియోజకవర్గాల



శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, సత్యనారాయణ, మలోత్ రాందాస్ నాయక్, సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని, సింగరేణి సంస్థ తెలంగాణ

## సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి

ప్రజల ఆస్తి అని, ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ కొరకు 70 కోట్ల రూపాయలు, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు 74 కోట్ల 40 లక్షల రూపాయలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. వైద్యపరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన 335 మంది అర్హత గల అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో మరింత మంది అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకుందాం అని, తెలంగాణ ఆస్తిగా తీర్చిదిద్దుదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల బీమా అందించడం జరుగుతుందని, 30 వేల మంది ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి బోనస్ అందించామని తెలిపారు. కోల్ బ్లాక్స్ లలో పూర్తి నిఘా వ్యవస్థ మధ్యలో పని జరుగుతుందని, తెలంగాణ వనరులను కాపాడతామని తెలిపారు. కోల్ బెల్ట్ ప్రాంతంలోని శాసనసభ్యులతో మాట్లాడి కార్మిక సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ సమన్వయంతో సింగరేణి బొగ్గు గనులను మరింత అభివృద్ధి చేసి కార్మికుల సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

# సెల్ఫీ వీడియో తీసుకొని రైతు ఆత్మహత్య

**గుంటూరు జూన్ 13, ప్రభాతవార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తట్టుకోలేక ఓ యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకొని తన ఆవేదనను వెల్లడించడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ ఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రావులాపురం గ్రామంలో చోటుచేసుకుంది. " ఏడేళ్ల క్రితం తీసుకున్న అప్పుకు ఇప్పటికే రూ. 18 లక్షలు కట్టాను. ఇంకా కట్టమని వేధిస్తున్నావు. నీవు వచ్చినప్పుడల్లా వేలకు వేలు ఖర్చు పెట్టలేను. నా చావుకు ప్రకాష్ రావు నీవే కారణం.. తనకు ఇవ్వాల్సిన డబ్బును స్వామి తన భార్యకు ఇవ్వు" అంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నపరెడ్డి నాగిరెడ్డి (30) అనే యువ రైతు కళ్ల నిండా నీళ్లతో చనిపోయే ముందు తన ఫోన్‌లో సెల్ఫీ వీడియోను రికార్డు చేసుకున్నాడు. ఈ వీడియోను రికార్డు చేసిన కాసేపటికే నాగిరెడ్డి తన పొలంలోనే పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగిరెడ్డి ఏడేళ్ల క్రితం పత్తిపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన కళ్యాణితో కులాంతర వివాహం చేసుకున్నాడు. కారంపూడికి చెందిన పెళ్లిళ్ల బ్రోకర్ ప్రకాష్ రావు ఈ పెళ్లి సంబంధం కుదిర్చాడు. అదే సమయంలో నాగిరెడ్డికి కొంత సొమ్ము ప్రకాష్ రావు వడ్డీకి ఇచ్చాడు. అంతేకాకుండా, భార్య పిన్ని కొడుకు స్వామికి డబ్బు అవసరం ఉండటంతో అతనితో కూడా ప్రకాష్ రావు దగ్గరే అప్పు ఇప్పించాడు. ఈ అప్పులకు గ్యారెంటీగా నాగిరెడ్డికి చెందిన పొలం డాక్యుమెంట్లను ప్రకాష్ రావు తాకట్టు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో రైతు నాగిరెడ్డికి ఉన్న నాలుగు ఎకరాల పొలంతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. వచ్చిన ఆదాయంలో పెట్టుబడులు పోగా మిగిలిన డబ్బునంతా భార్యకు తెలియకుండా వడ్డీ వ్యాపారి ప్రకాష్ రావుకు చెల్లిస్తూ వచ్చాడు. ఈ ఏడాది మిరప పంట సాగు చేయగా సుమారు 200 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆ మిరపకాయలను యార్డు లో విక్రయించగా వచ్చిన డబ్బును కూడా ప్రకాష్ రావుకే ఇచ్చినట్లు తెలిపారు.

# తిరుమల పాతకాటేజీల పునరుద్ధరణ ఎప్పుడో? - ప్రతిపాదనలకే కాలం చెల్లుబాటు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపవుతుండటం...వసతి సౌకర్యం తగినంతగా కల్పించలేకపోతుండటం పరిపాటిగా మారింది. కొన్ని పాతబడిన కాటేజీలు ఇప్పటికీ పునఃనిర్మాణానికి నోచుకోవడంలేదు. ఉన్నవాటిని భక్తులకు సరైన వసతి కల్పించలేకపోతుండటం జరుగుతోంది. కొండపై ఆరుదశాబ్దాల క్రిందట అప్పటి అవసరాలకు తగ్గట్లు నిర్మించిన పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు ఇప్పుడు ఉపయోకరంగా లేకపోతున్నాయి. చాలావరకు వాటిల్లో కాలం చెల్లిపోవడం, పెచ్చులూడిపడి సీలింగ్‌లు ఊడిపోవడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. ఈ గదుల్లో నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు వీలుగా ఎప్పుడోకొన్ని దశాబ్దాల క్రిందట నిర్మితమైన కేంద్రీయ విచారణ కార్యాలయం(సిఆర్‌ఒ)కు సమీపంలోనే ఉన్న సుదర్శన్,గోవర్ధన్, కల్యాణి సత్రాలు,సి టైప్‌క్వార్టర్స్, పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి. ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా సామాన్యభక్తులకు అందుబాటులో ఉండేవే. ఎప్పుడో పాతకాలంనాటి అవసరాలకు తగ్గట్లు, అప్పటి ప్రణాళికల మేరకు నిర్మించడంతో భవనాల ఉనికి ఆందోళనకరంగా మారింది. ఇందులో 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు భక్తులకు కేటాయిస్తారు. ఇవన్నీ కూడా ఉపయోగకరంగా లేకపోవడంతో, భక్తుల నుండి వరుసగా ఫిర్యాదులు అందడంతో టిటిడి అధికారులు వీటిని ఆధునీక రించాలని నిర్ణయించారు. అంతేగాక ఈ ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల్లో చేరుకున్నా పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. కనీసం పార్కింగ్ అనేది లేకపోవడంతో యాత్రికులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. గదులు కూడా విశాలస్థలాలు లేవు. వీటిని ఆధునీకరించి కొత్తగా నిర్మించాలని గతంలోనే బోర్డు ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఆచరణకు మాత్రం నోచుకోవడంలేదు.

## చిటికెలో చికెన్ స్నాక్స్

### చైనీస్ చికెన్ నూడుల్స్..



**కావలిసినవి :** బోన్‌లెస్ చికెన్: ముప్పావు కిలో, కార్న్‌ఫక్లర్: ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, ఉప్పు: ముపానపవుటీస్పూను, నూనె: 4 టేబుల్ స్పూన్లు, నూడుల్స్ పావుకిలో, వెల్లుల్లితురుము: టేబుల్ స్పూను, ఎండుమిర్చి: మూడు, కాలీఫ్లవర్ రెమ్మలు, కప్పు: క్యాప్సికమ్ ముక్కలు, అరకప్పు, జీడిపప్పు: అరకప్పు, సాస్‌కోసం: వినెగర్ : 2 టేబుల్‌స్పూన్లు, సోయాసాస్: టేబుల్‌స్పూను, చిల్లీసాస్: 3 టేబుల్‌స్పూన్లు, ఉప్పు: తగినంత.

**తయారు చేసే విధానం :** . జీడిపప్పుని వేయించి ఉంచాలి. తరవాత నీళ్ల వంపేసి చల్లని నీళ్లతో కడిగి పక్కన ఉంచాలి.

చికెన్ ముక్కల్ని కాసేపు ఆరనిచ్చాక వాటిమీద ఉప్పు,కార్న్‌ఫ్లోర్ చల్లాలి. బాణలిలో నూనె పోసి కాగాక కొంచెంకొంచెంగా చికెన్ ముక్కలు వేసి వేయించి తీయాలి. తరవాత మిగిలిన నూనె వంపేసి మూడు టేబుల్ స్పూన్లు మాత్రం ఉంచాలి. ఇప్పుడు అందులో వెల్లుల్లి తురుము, ఎండుమిర్చి వేసి వేగాక కాలీఫ్లవర్ రెమ్మలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి వేయించాలి. తరవాత చికెన్ ముక్కలు వేసి, మూడు నాలుగు నిమిషాలు వేయించాక సాస్‌కోసం తీసుకున్నవన్నీ వేసి కలపాలి. ఇప్పుడు ఉడికించిన నూడుల్స్ వేసి బాగా కలపాలి. చివరగా వేయించిన జీడిపప్పు వేసి, ఇష్టమైతే కాస్త ఉల్లికాడల తురుము, నువ్వులు చల్లి దించాలి.

### పెప్పర్ చికెన్..



**కావలసినవి :** చికెన్ : అరకిలో, అల్లంవెల్లుల్లి: 3 టేబుల్‌స్పూన్లు, పసుపు: టీస్పూను, ఉప్పు: సరిపడా, ఉల్లిపాయ ముక్కలు: కప్పు, మిరియాల పొడి, ఒకటిన్నర టీస్పూన్లు, కారం– 4. టీస్పూన్లు, గరంమసాలా: టీస్పూను, కరివేపాకు: కట్ట, జీలకర్ర: అరటీస్పూను, యాలకులు: మూడు, దాల్చినచెక్క: అంగుళం ముక్క, లవంగాలు: నాలుగు, నూనె: 3 టేబుల్‌స్పూన్లు.

**తయారు చేసే విధానం :** చికెన్ ముక్కలకి కాస్త ఉప్పు, టేబుల్‌స్పూను అల్లంవెల్లుల్లి, పసుపు పట్టించి పక్కన ఉంచాలి. 2. నాన్‌స్టిక్ పాన్‌లో జీలకర్ర, దాల్చినచెక్క, లవంగాలు, యాలకులు వేసి వేయించాలి. తరవాత మిగిలిన అల్లంవెల్లుల్లి వేసి వేగాక ఉల్లిముక్కలు, ఉప్పు వేసి వేయించాలి. కారం, గరంమసాలా, కచ్చాపచ్చాగా దంచిన మిరియాలపొడి వేసి నూనె బయటకు వచ్చేవరకూ వేయించాలి. ఇప్పుడు చికెన్ ముక్కలు కూడా మరో నాలుగు నిమిషాలు వేయించి, మూతపెట్టి ముక్క పూర్తిగా ఉడికేవరకూ ఉంచి దించాలి.

### చికెన్ పాప్‌కార్న్...



**కావలసినవి :** చికెన్‌ముక్కలు: పావుకిలో, కార్న్‌ఫ్లోర్: 2 టేబుల్‌స్పూన్లు, గుడ్డు: ఒకటి, బ్రెడ్ పొడి: కప్పు, ఉప్పు: తగినంత, అల్లంవెల్లుల్లి: టేబుల్‌స్పూను, మిరియాలపొడి: పావుటీస్పూను, కారం: 2 టీస్పూన్లు, గరంమసాలా: టీస్పూను, నూనె : వేయించడానికి సరిపడా.

**తయారుచేసే విధానం :..** ఓ గిన్నెలో కారం, మిరియాలపొడి, అల్లంవెల్లుల్లి, మసాలా పొడి, ఉప్పు వేసి కలపాలి. ○ చికెన్‌ని చిన్న చిన్న ముక్కలుగా కోయాలి. వీటిమీద కారం మిశ్రమం చల్లి ముక్కలకి పట్టేలా బాగా కలపాలి. తరవాత కార్న్‌ఫ్లోర్ కూడా వేసి కలపాలి. ఇప్పుడూ విడిగా ఓ గిన్నెలో గుడ్డు తెల్లసొన, మరో గిన్నెలో బ్రెడ్ పొడి వేయాలి. ఒక్కోముక్కనీ తెల్లసొనలో ముంచి బ్రెడ్‌పొడిలో దొర్లించి తీయాలి. ఇలాగే అన్నీ చేయాలి. ముక్కలు బాగాకరకరలాడాలంటే మరోసారి గుడ్డుసొనలో ముంచి బ్రెడ్ పొడి అద్దాలి. వీటిని ఓ పావుగంటసేపు పక్కన ఉంచాలి. బాణలిలో నూనె వేసికాగాక కొంచెం కొంచెంగా చికెన్ ముక్కలు వేసి వేయించి తీయాలి.

### చికెన్ 65..



**కావలసినవి :** బోన్‌లెస్ చికెన్: పావుకిలో, అల్లం తురుము : టీస్పూను, వెల్లుల్లితురుము : టీస్పూను, నిమ్మరసం : టేబుల్‌స్పూను, పెరుగు: టేబుల్‌స్పూను, గుడ్డు: ఒకటి, కరివేపాకు: 4, రెబ్బలు, పసుపు : చిటికెడు, మిరియాలపొడి: అరటీస్పూను, ఉప్పు: తగినంత, బియ్యప్పిండి : 2, టేబుల్‌స్పూన్లు, జీలకర్ర: టీస్పూను, వెల్లుల్లి: టీస్పూను, పచ్చిమిర్చి : రెండు, కారం : టీస్పూను, పెరుగు: 2, టేబుల్‌స్పూన్లు: నూనె : వేయించడానికి సరిపడా.

**తయారు చేసే విధానం :** గిన్నెలో అల్లం వెల్లుల్లి తురుము, నిమ్మరసం, పెరుగు, గుడ్డసొన పసుపు, మిరియాలపొడి, ఉప్పు: బియ్యపినపండి అనీనన వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలకు పట్టించి కనీసం ఓ గంట సేపు నాననివ్వాలి. బాణలిలో నూనె వేసి కాగాక, చికెన్ ముక్కల్ని వేయించి తీయాలి. తరవాత అందులోని నూనెని వంపేసి ఓ రెండు టేబుల్‌స్పూన్లు మాత్రం ఉంచి, జీలకర్ర, వెల్లుల్లి తురుము, సన్నగా తరిగిన పచ్చిమర్చి కరివేపాకు వేసి వేయించాలి. ఇప్పుడు కారం, పెరుగు కూడా వేసి కలిపి ఓ నిమిషం తరవాత వేయించిన చికెన్ ముక్కల్ని వేసి మీడియం వంట మీద ఓ రెండు నిమిషాలు ఉంచి తీయాలి. □

## ఫేస్ మసాజ్ మంచిదే !

ముఖం మీద స్క్రబ్ రాసు కోవటం మంచిదే. దీనివల్ల మృత కణాలు తొలగి పోతాయి. ముఖ్యంగా దుమ్ము, ధూళి కారణంగా ముఖం మీద అట్టకట్టినట్లుంది. దీని వల్ల సిబం ఉత్పత్తి అయి చర్మం జిడ్డుగా మారి రకరకాల సమస్యలు వస్తాయి. అందుకే స్క్రబర్స్‌తో ముఖాం రుద్దుకోవాలి. స్క్రబ్ చేసే ముందు కచ్చితంగా ముఖాన్ని గోరు వెచ్చటి నీటితో కడిగే యాలి. ఆ తర్వాత మెత్తని టవల్‌తో తుడుచుకోవాలి. ఇలా స్మూత్‌గా ఉన్నప్పుడే స్క్రబ్ చేసుకోవాల్సి ఉంటుంది. బొప్పాయి స్క్రబ్, గ్రీన్ టీ స్క్రబ్, కోకనెట్–నిమ్మ స్క్రబ్, కుకుంబర్ మింట్ స్క్రబ్. లాంటి చల్లని స్క్రబ్స్ మాత్రమే ముఖం మీద అప్లై చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మం చల్లగా ఉంటుంది. స్క్రబర్స్‌తో మరీ గట్టిగా చర్మాన్ని రుద్దకూడదు. దీనివల్ల చర్మం ఎర్రగా కందిపోతుంది. మరిన్ని చర్మ సమస్యలు వస్తాయి. మొత్తానికి ముఖ చర్మం బట్టి స్క్రబర్స్ ఎంపిక చేసుకోవాలి. ముఖ చర్మం మీద మసాజ్‌లా మెల్లగారుద్దాలి. దీని వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. □

## ఈ మౌనం .. ఎందుకనో !



**కొంత మంది అమ్మాయిలు ఆకస్మాత్తుగా మాట్లాడటం తగ్గిస్తారు. పలకరించినా కూడా సరైన సమాధాన మివ్వకుండా నిత్యం ఏదో కోల్పోయినట్లు ఉండటం చూసి తల్లిగా ఏం చేయాలో తెలియడం లేదు. ఇటువంటప్పుడు పిల్లలను సాధారణ స్థితికెలా తీసుకురావాలో తెలుసుకుందాం..**

పిల్లలు ఎదుగుతున్నప్పుడు పలురకాల భావోద్వేగాలకు గురవుతుంటారు. చదువులో అనుకున్న ర్యాంకు సాధించలేకపోవడం, ఇంట్లోవాళ్లు అడిగింది ఇవ్వకపోవడం లేదా చుట్టూ చూస్తున్న సంఘటనలకు ప్రభావితమవు తుంటారు. అటు వంటివి ఏవైనా కావొచ్చు. ఇటువంటి సందర్భాల్లో మౌనాన్ని వారెక్కువగా ఆశ్రయిస్తారు.

అలాగే ఏదో కోల్పోయిన భావన వాళ్లలో కనిపిస్తుంది. ఈ మార్పును అమ్మానాన్నలు దగ్గరగా గమనిస్తారు కనుక గుర్తిస్తారు. వాళ్ల నెమ్మదిగా పిల్లల మనసు తెలుసుకోవ డానికి ప్రయత్నించాలి. ప్రేమగా దగ్గరకు తీసుకుని సముదా యించి భరోసానివ్వాలి. వాళ్ల మనసులోని మాటను బయటకు చెప్పే ధైర్యాన్ని ఇవ్వగలగాలి తప్పితే అలా చేసావేమిటి, ఇలా ఎందుకు జరిగింది అంటూ ఏదోదో మాటలతో విసిగించకూడదు. నిందించకూడదు.. ఏదైనా పొరపాటు జరిగినా, మార్కులు తగ్గినా, అనుకున్న సీటు సంపాదించలేక పోయినా.. పిల్లలనునిందిస్తే వాళ్ల మనసులో ఏముంటోందో బయటకు చెప్పలేరు అలాంటి సమయంలో ఒక వ్యతిరేక మాట వచ్చినా భరించలేరు. దాని పర్యవసానం ఎలాగైనా ఉండొచ్చు. మాటలతో గాయపరచకూడదు. అప్పటికే వారెంతో ఆందోళన చెందుతుంటారు. అటువంటి సమయంలో వారికి వేదన కలిగిస్తే కుంగుబాటుకు దారితీసే ప్రమాదం లేకపోలేదు. అలా కాకుండా మరోసారి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించగలమనే ధైర్యాన్నిస్తే మంచిది. ప్రతి చిన్న విషయాన్ని ప్రతికూలతగా ఆలోచించకుండా సానుకూల ధోరణి అలవడేలా చేయాలి. అప్పుడే వారిలో తిరిగి మరోసారి కృషి చేద్దామనే ఆలోచన మొదలవుతుంది. ఇలా చేస్తే వారిలో ఆత్మన్యూనతే ఉండదు.

అలాగే చేద్దామా! మరి! □

## అంతర్వాణి

## పరోపకార ఫలం



ముగ్గురు వ్యక్తులు హిమాలయాల గుండా నడుస్తున్నారు. సన్ని, ముంజల్, సంజు వీరి పేర్లు. చల్లటిమంచులో గజగజ వణికిపోతూనే నడుస్తున్నారు. చాలాదూరం నడిచాక వారిలో సన్ని అనే వ్యక్తి విపరీతమైన చలికి తట్టుకోలేక చని పోయాడు. ఇప్పుడు ముంజల్, సంజు మాత్రమే మిగిలిపోయారు. వారిలో సంజు 'అయ్యో! మన మిత్రుడు మరణించాడు.. మృతదేహాన్ని మనం మోసుకుని వెళ్లామని' అంటూ ముంజల్ని కోరాడు. అందుకు ముంజల్ 'వద్దు, మనం అతడి బరువును మోస్తూ నడవలేం, నేను అయితే ఆ దెడాబాడీని ముట్టలేను' అన్నాడు. 'సర్లే నువ్వు సాయం చేయక పోయినా పర్వాలేదు, నేనే మోస్తాను' అంటూ సంజు చనిపోయిన సన్ని మృతదేహాన్ని భుజంపై వేసుకుని నడవసాగాడు. ఇలా కొంతదూరం నడిచాక, ముంజల్ కూడా చలికి తట్టుకోలేక చనిపోయాడు. ఇద్దరి మృతదేహాలను మోయలేక, సంజుకేవలం సన్ని మృతదేహాన్ని మోస్తూ ముంజల్ని అక్కడే వదిలేసి, నడవసాగాడు. చివరికి సన్ని సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకున్నాడు. ఆ వ్యక్తి ఎందువల్ల బతికిపోయాడు? చలిని తట్టుకునే సామర్థం ఉండడం వల్ల కాదు.. శవాన్ని మోయడం వల్ల ఇతడి దేహం, మృతదేహం రెండు కలవడంతో సన్ని దేహానికి కావాల్సినంత వేడి అందసాగింది. ఆ వేడే చలిని నుంచి రక్షించ గల్గింది. తద్వారా సన్ని బతికి బట్టకట్టాడు. చాలాసార్లు ఇతరు లకు సాయం చేసేందుకు మనం వెనుకడు వేస్తుంటాం. కానీ ఆ సాయమే కొన్నిసార్లు మనం ఊహించలేని మేలు చేస్తుంది. 'నిన్నడుగు ప్రతివానికిని ఇమ్ము' (లూకా 6:30), 'మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి' (మత్తయి 5:44) ) 'నీళ్లు పోయువారికినీళ్లు పోయబడును' (సామెతలు 11:25). ఇతరులకు మనం ఎంత మేలు చేస్తే మనకు అంతమంచిది. ఆ మంచితనం ఆశీర్వాదం మనపైన మాత్రమే కాదు.. మన పిల్లలపై కూడా ఉంటుంది. కాబట్టి సాధ్యమైనంతవరకు ఇతరులకు సాయం, మేలు

**- పి.వాణిపుష్ప**

## తెర

### 'ఓ..! సుకుమారి' : టీజర్ లాంచ్



యంగ్ ట్యాలెంట్ తిరువీర్, వెర్సటైల్ ఐశ్వర్య రాజేష్ తొలిసారిగా ఓ..! సుకుమారి అనే గ్రామీణ నేపథ్యంలో సాగే రొమాంటిక్ కామెడీ చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాతో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయమవు తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'శివం భజే' చిత్రాన్ని నిర్మించిన గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి దీనిని నిర్మిస్తున్నారు. స్థానిక రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ, మంచి మనసున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కలలు కంటుంటాడు తిరువీర్ . అలాంటి సమయంలో దామిని అనే అమ్మాయిని చూసిన వెంటనే ఆమెనే తన జీవిత భాగస్వామిగా భావించి పెళ్లి ఏర్పాట్లు మొదలుపెడతాడు. దర్శకుడు భరత్ ధర్షన్ గ్రామీణ వాతావరణం, స్థానిక రాజకీయాలు, వినూత్నమైన ట్విస్ట్‌ను తో వినోదభరితమైన కథను తెరకెక్కించారు. గ్రామీణ నేపథ్యాన్ని సినిమాటో గ్రాఫర్ సీహెచ్ కుషేందర్ అందమైన విజువల్స్‌తో ఆకట్టుకునేలా చూపించారు. భరత్ మంచిరాజు అందించిన సంగీతం టీజర్‌కు ఉత్సాహభరిత మైన అనుభూతిని తీసుకొచ్చింది. బలగం ఫేమ్ తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్‌గా, క ఫేమ్ శ్రీ వరప్రసాద్ ఎడిటర్‌గా, స్వయంభు ఫేమ్ అను రెడ్డి అక్కటి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. పూర్ణాచారి పాటలు రాశారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో తిరు వీర్ మాట్లాడుతూ.. ముందుగా మా నిర్మాత మహేశ్వర్ రెడ్డి గారికి థాంక్యూ. ఈ సినిమానే మమ్మల్ని ఎంచుకుందని నేను భావిస్తున్నాను. మసూద సినిమాను పిల్లలు, ఫ్యామిలీలు ఎంతగానో ఎంజాయ్ చేశారు. ఫ్యామిలీస్, పిల్లలు కలిసి చూసిన సినిమా చాలాకాలం గుర్తుండి పోతుంది. హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత మిమ్మల్ని మళ్లీ కలవడం చాలా ఆనందంగా ఉంది. ఆ సినిమా హిట్ అయిన తర్వాత నేను సైన్ చేసిన మొదటి సినిమా ఇదే. మహేశ్వర్ రెడ్డి ఎఅద్భుతమైన నిర్మాత. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది.

### 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' పెద్ద హిట్ కావాలి: వి. వి. వినాయక్..



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందిం చిన చిత్రం ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు. కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా లో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాథ్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. . ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో.. ..వి.వి. వినాయక్ మాట్లాడుతూ.. 'వడ్డే నవీన్' ఈ కార్యక్రమానికి నన్ను పిలిచి నందుకు థాంక్స్. నేను ఆయన చిత్రానికి అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. నవీన్ గారితో సినిమా చేస్తున్న టైంలోనే 'ఆది'కి నాంది పలికినట్టు అయింది. నవీన్ నన్నెంతో ఇష్టంగా చూసుకునే వారు. వడ్డే నవీన్ మాట్లాడుతూ.. .. వినయ్ అప్పుడూ, ఇప్పుడూ వినయంగానే ఉన్నారు. ఆయన జర్నీ నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. మా కోసం వచ్చిన వినయ్‌కి థాంక్స్. సినిమా కోసం టీం అంతా ఇష్టపడి చేశారు. ఈ పదేళ్లలో టెక్నికల్ పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మూవీలో కోర్ట్ డ్రామాతో పాటు సస్పెన్స్ బాగుంటుంది. ఏ ఫ్రైడే అయినా కూడా సింగిల్‌గా సినిమా రాలేదు. ఒకరితో పోటీ అని కాదు..

### 'రావు బహదూర్' నెవర్ బిఫోర్ 'నాట్ ఎ టీజర్' లాంచ్




జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్ ప్రజెంట్స్, సత్యదేవ్, వెంకటేష్ మహా, ఏ+ఎస్ మూవీస్ శ్రీచక్రాస్ ఎంటర్‌టైన మెంట్స్ ఖిరావు బహదూర్‌ఖి నెవర్ బిఫోర్ 'నాట్ ఎ టీజర్' లాంచ్‌సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వం లో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ ఖిరావు బహదూర్‌ఖి చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. మూడు నిమిషాల పది సెకన్ల నిడివి గల ఈ వీడియో, కథానాయకుడి విచిత్రమైన, రహస్యాలతో నిండిన ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్తుంది. జీవిత చరమాంకంలో ఉన్న వ్యక్తి.. ప్రాణాంతకమైన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ, మరణం నీడలో జీవిసు న్నప్పటికీ, వైద్యుల అంచనాలను తలకిందులు చేస్తూ అతడు బతికే పోరాటాన్ని కొనసాగిస్తాడు. ఆ ప్రయాణం ఒక అద్భుతంగా మారు తుంది. ఈ వీడియోలో సత్యదేవ్ చేసిన అద్భుతమైన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. క్లిష్టమైన పాత్రల్లో పూర్తిగా లీనమయ్యే నటుడిగా పేరున్న సత్యదేవ్, ఈ పాత్రలో అద్భుతమైన నటన కనబరిచారు. వాస్తవం, భ్రమల మధ్య చిక్కుకుని ఒంటరితనం, అంతర్మథనం, భావోద్వే గాలతో సతమతమయ్యే వ్యక్తిగా ఆయన నటన ఆకట్టుకుం టుంది. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా కనిపించగా, వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాకా, మాస్టర్ కిరణ్ కీలక పాత్రలు పోషించారు .సాంకేతి కంగా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణా లతో రూపొందుతోంది.

### టెలివిజన్ అండ్ ఓటిటి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ సౌత్(టాప్కోస్) ఏర్పాటు




గత రెండేళ్లుగా తెలుగు, తమిళ, కన్నడ, మళయాల టెలివిజన్ నిర్మాతలతో ఎన్నోసార్లు చర్చించి, చివరగా జనవరి 2026లో చెన్నైలో అన్ని ఆర్గనైజేషన్స్ కలిసి మీటింగ్ నిర్వహించుకుని టెలివిజన్ అండ్ ఓటిటి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ సౌత్(టాప్కోస్)ను ప్రక్రియలు రిజిస్ట్రేషన్, బైలాఏర్పాటు చేశారు. . మరి ఈ సందర్భంగా టాప్కోస్ అధ్యక్షుడు ఏ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. పాత్రికేయ మిత్రులందరికీ నమస్కారం. ఈ సంవత్సరం సౌత్ ఇండియన్ టెలివిజన్ అండ్ ఓటిటి పరిశ్రమ గుర్తించుకోదగిన చారిత్రాత్మకమైన దినంగా మేం పరిగణిస్తున్నాం. ఇది 15యేళ్లు పూర్తి చేసుకుంది. అయితే టాప్కోస్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడానికి మూలం తెలుగు టెలివిజన్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ గత 15యేళ్లుగా దానికి సాధించిన విజయాలు. ఒక నిర్మాణాత్మకమైన, గొప్ప ఐక్యత కలిగిన ఒక కౌన్సిల్ గా డెవలప్ కావడం.. తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీ ఫెటర్నిటీకి ఎనలేని సేవలు అందించే స్థాయికి చేరుకుంది. తెలుగు టివి పరిశ్రమకు, నిర్మాతలు, నటీ నటులు, సాంకేతిక నిపుణులు, కార్మికులు అందరికీ పెద్ద దిక్కుగా తెలుగు కౌన్సిల్ నిలబడింది. ఈ ప్రాసెస్ లో ఓ మూడేళ్ల నుంచి ఇంటర్ స్టేట్ ప్రొడక్షన్స్ బాగా పెరిగాయి. . దీనికి రిజిస్ట్రేషన్ చేయడం కోసం చాలా కష్టపడ్డాం. మాకు దీనికి ఏ గైడ్ లైన్స్ లేదు. సౌత్ ఇండియన్ టెలివిజన్ అండ్ ఓటిటి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కు ఒక చట్ట ప్రకారం తయారు చేయడానికి మార్గదర్శకమైన గైడ్ లైన్స్ లేదు. మా నుంచి ప్రతి సమస్య, ప్రతి కార్యక్రమాన్ని విశ్లేషించుకుని.. దాని నుంచి కార్యాచరణ రూపొందించుకుంటూ ప్రతి సమస్యను సునిశితంగా పరిశీలించి అనేక చర్చల తర్వాత ఒక బై లా తయారు చేసుకోవడం జరిగింది. ప్రభుత్వాలను కూడా రిప్రజెంట్ చేస్తూ.. సౌత్ ఇండియన్ టివి, ఓటిటి ఇండస్ట్రీ పర్ఫెక్ట్ గా, ప్రొడక్టివ్ గా నడవడానికి కోసం గైడ్ లైన్స్ ఇవ్వడం అనేది మా టాప్కోసం ప్రధాన ఉద్దేశ్యం. . తెలుగు నిర్మాతల మండలి ఆధ్వర్యంలో కరోనా టైమ్ లో 4.5 కోట్లకు పైగా కార్మికులకు ఇబ్బంది లేకండా చూసుకున్నాం. .

### కుటుంబ కథ చిత్రం 'కొత్త మలుపు'



ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాష్ గోపరాజు హీరోగా నటించిన రెండో చిత్రం 'కొత్త మలుపు' . దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి తెరకెక్కించిన ఈ చిత్రం కోనసీమ నేపథ్యంలో రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా (జూన్ 12న) థియేటర్‌లలో విడుదలైంది. ప్రేమలో అపార్థాలకు చెక్ పెడుతూ... మనసులను తాకే ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ అని చిత్ర యూనిట్ చెప్పి నట్టే ఈ సినిమా ఉందా? ఈ మూవీ రివ్యూ తెలుసు కుందాం. జీవితాన్ని ఎంజాయ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుని స్నేహితులతో కలిసి హైదరా బాద్‌లో హ్యాపీగా గడిపే యువకుడు కమల్ (ఆకాష్). ఓ కుటుంబ వివాహ వేడుక కోసం తూర్పు గోదావరి జిల్లా లోని అందమైన గ్రామానికి వెళ్తాడు. అక్కడ వరలక్ష్మి (భైరవి ఆర్థ్యా) అనే గ్రామీణ యువతిని చూసి ఆకరి తుడవుతాడు. ఒక రాత్రి అనుకోని పరిస్థితుల్లో అవ మానకర స్థితిలో చిక్కుకున్న కమల్‌ను ఓ యువతి కాపాడు తుంది. అయితే ఆమె ఎవరో తెలియదు. తనను ఆదుకున్న ఆ అమ్మాయి కోసం కమల్ చేసే అన్వేషణలో వరలక్ష్మి అతనికి తోడుగా నిలుస్తుంది. ఈ ప్రయాణం లో ఇద్దరి మధ్య ప్రేమ మొలకెత్తు తుంది. అయితే, తాను వెతుకుతున్న అమ్మాయి వరలక్ష్మినేనని తెలుసుకునే లోపే, ఆమె మరో యువకుడితో ఉన్న ఫోటో కమల్ చేతికి చిక్కు తుంది. దాంతో ప్రేమలో అనుమానాలు, అపార్థాలు చోటు చేసుకుం టాయి. ఆ యువకుడు ఎవరు? వరలక్ష్మికి అతనితో సంబంధం ఏమిటి? ఈ అపార్థాల మధ్య కమల్‌వరలక్ష్మి ప్రేమ ఎలాంటి పరీక్షలు ఎదుర్కొంది? చివరికి వారి ప్రేమ గెలిచిందా లేదా? అనేదే 'కొత్త మలుపు' కథ.ప్రేమ, అపార్థాలు, నమ్మకం, గతం వర్తమానం మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణను దర్శకుడు శివ కేసనకుర్తి చక్కగా తెరపై ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు గోదావరి ప్రాంతం అందాలను ఆహ్లాద కరమైన అనుభూతిని అందించారు. పెళ్లి సందడి, స్నేహితుల సరదా సంభాషణలు, హీరో హీరోయిన్ల మధ్య నడిచే సన్నివేశాలు ప్రేక్షకులను కథలోకి తీసుకెళ్తాయి. ముఖ్యంగా మొదటి భాగంలో వచ్చే కామెడీ ఎపిసోడ్స్, గోదావరి ప్రాంతానికి ప్రత్యేకమైన హాస్య శైలి మంచి వినోదాన్ని అందిస్తాయి .రెండో భాగంలో కథ భావోద్వేగాల వైపు మలుపు తిరుగుతుంది. ప్రేమలో అనుమానం ఎంత ప్రమాదకరమో, ఒకరి గతాన్ని పట్టుకుని తీర్పు చెప్పడం ఎంత తప్పో చెప్పే ప్రయత్నం చేశారు. "ప్రతి ఒక్కరికీ ఒక గతం ఉంటుంది. కానీ మన జీవితం లోకి వచ్చిన వ్యక్తి వర్తమానాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. గతాన్ని తవ్వుకుంటూ భవి ష్యత్తును పాడు చేసుకోవద్దు" అనే భావాన్ని దర్శకుడు హృద్యంగా చెప్పగలిగారు. జానర్: రొమాంటిక్ కామెడీ – ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నటీనటులు: ఆకాష్, భైరవి ఆర్థ్యా, రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి, సిద్ధు, మహేందర్, ఐశ్వర్య తదితరులు దర్శకత్వం: శివ కేసనకుర్తినిర్మాత: తాటి బాలకృష్ణ బ్యానర్: తథాస్తు క్రియేషన్స్ సంగీతం: యశ్వంత్ నాగ్ఛాయాగ్రహణం: సుమంత్ కచర్ల. నిర్మాణ విలువలు:తథాస్తు క్రియేషన్స్ నిర్మాణ విలువలు కథకు తగిన స్థాయిలో ఉన్నాయి. ప్లస్ పాయింట్స్: గోదావరి ప్రాంతం అందాలు, విజువల్స్ ఆకాష్ – భైరవి మధ్య కెమిస్ట్రీ రఘుబాబు, పృథ్వీ కామెడీకుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం క్లైమాక్స్ సందేశం.

### 'ఇల్లు' ప్రమోషన్స్‌లో గెస్ట్‌గా పాల్గొన్న రాహుల్ రవీంద్రన్



.ఆర్టిస్ట్‌గా వచ్చిన నేను రామానాయుడుని, రామోజీని చూసి ఆదర్శంగా తీసుకుని ప్రొడక్షన్ లోకి అడుగుపెట్టాను ఇల్లు నిర్మాత కిషోర్ మారిశెట్టి..మనోహర ఆర్ట్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా సమర్పిస్తూ కిషోర్ మారిశెట్టి నిర్మాతగా రోహిత్, శశి దర్శకత్వంలో ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న కథ సుధ చిత్రం ఇల్లు. వివేక్ సాగర్ సంగీతాన్ని అందించిన ఈ కథ సుధకు శశాంక్ రాఘవుల సినిమాటోగ్రఫీ చేయగా అవంతి రుయా ఎడిటింగ్ చేశారు. హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి ప్రముఖ పాత్రలో కనిపించిన చిత్రంలో అనీష్ కురువిల్ల, పవన్ రమేష్, క్యాంప్ శశి తదితరులు కీలకపాత్రలు పోషించారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ... "ఒక సాధారణ కథను సహజ సిద్ధంగా అదేవిధంగా చాలా అందంగా ప్రేక్షకులు ముందుకు తీసుకుని రావడం అనేది ఎంతో క్లిష్టమైన విషయం. జూన్ 14 నుండి స్ట్రీమింగ్ కానున్న ఇల్లు మీ మనసులో ఎంతో ప్రశాంతతను తెలుపుతుంది" అన్నారు.నటి బిందు చంద్రమౌళి మాట్లాడుతూ... "నాకు ఈ చిత్ర దర్శకులు రోహిత్, శశిలు ఎంతో కాలం నుండి తెలుసు. నాకు ఇల్లులో నటిం చేందుకు అవకాశం ఇచ్చిన వారి ఇద్దరికీ ధన్యవాదాలు అనుకుంటు న్నాను. నటుడు అనీష్ కురువిల్ల మాట్లా డుతూ... "నాకు దర్శకులు శశి, రోహిత్ ఎంతో కాలం నుండి తెలుసు. వారి కష్టాన్ని, వారి ఆలోచనలను నేను గమనించాను. ఇటువంటి ప్రతిభ ఉన్న వారిని ఎంకరేజ్ చేసినందుకు ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్.

# డెబ్యూ మ్యాచ్‌లోనే వికెట్ల పంట



(వార్త క్రీడా విభాగం)

డెబ్యూ మ్యాచ్‌లోనే గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే అదరగొట్టాడు. టీమిండియా తరఫున గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చారు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలోనే ఇద్దరూ కుర్రాళ్లు మూడేసి వికెట్లు తీసి ఆ జట్టును కట్టడిచేశారు.

పంజాబ్‌కు చెందిన కుడిచేతివాటం పేసర్ గుర్నూర్ బ్రార్.. వస్తూనే తొలి ఓవర్ అయిదో బంతికే వికెట్ సాధించాడు. ఓపెనర్ ఇబ్రహీమ్‌ను అద్భుత బంతితో పెవిలియన్‌కు చేర్చి అఫ్గానిస్తాన్ వికెట్ పతనానికి నాంది పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తను వేసిన తొలి ఓవర్‌లో రెండు పరుగులిచ్చి వికెట్ పడగొట్టడం ద్వారా ఆకట్టుకున్నాడు. ఇక ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి ఓవర్ వేసిన గుర్నూర్ బ్రార్.. ఆ ఓవర్లో ఏకంగా రెండు వికెట్లు పడగొట్టాడు. మొదట రషీద్ ఖాన్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన గుర్నూర్.. ఆ తర్వాత రెండో బంతికే జియావుర్ రహమాన్‌కు చమ్మా ఇచ్చి అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్‌ను194రన్స్‌కు తెరదించాడు.వికెట్లపతనాన్ని ప్రారంభించిన గుర్నూర్..వికెట్ల ముగింపును శాసించాడు. మొత్తంగా 4.5 ఓవర్లలో 27 రన్స్ ఇచ్చి 3వికెట్లు పడగొట్టాడు. కెప్టెన్ గిల్ నమ్మకాన్ని నిలబెట్టాడు.

ఇక మరో డెబ్యూ బౌలర్ హర్ష్ దూబే కూడా సత్తా చాటాడు. అయితే తన తొలిఓవర్లలోనే 16రన్స్‌తో కాస్ట్లీగా తేలాడు. రెండో ఓవర్‌లో మరో పది పరుగులిచ్చాడు. బ్రేక్ తర్వాత మరోసారి బౌలింగ్‌కు వచ్చి వికెట్లు సాధించాడు. 17వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి హస్మతుల్లాను బోల్తా కొట్టించి తొలి వికెట్ సాధించాడు. తన ఆఖరి ఓవర్లో మొదట అజ్మతుల్లాను, రెండుబంతుల తర్వాత ఘజన్‌ఫర్‌ను వికెట్లు కూల్చాడు. ఈ విధంగా ఒకే ఓవర్లో రెండు వికెట్లు సాధించాడు. మొత్తంగా 5 ఓవర్లు వేసి 47 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

**గిల్ మెచ్చిన క్రికెటర్ గుర్నూర్**

గుర్నూర్ బౌలింగ్ యాక్షన్ డెయిల్ స్టెయిన్‌లా ఉంటుంది. చిన్న వయసులో క్రికెట్ కంటే ఫుట్‌బాల్, టెన్నిస్ ఇష్టపడే వాడు. అయితే హైట్ అడ్వాంటేజ్ కారణంగా కొందరు మిత్రుల సలహాతో క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. రెండేళ్లలోనే ఇండియా అండర్19 జట్టుకు ఎంపికయ్యాడు. అక్కడే గుర్నూర్‌కు గిల్ పరిచయమయ్యాడు. అతడి టాలెంట్‌ను గమనించిన గిల్ కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చాడు. అలా పంజాబ్ అండర్ 23 జట్టులో చోటు దక్కించుకున్న గుర్నూర్ బ్రార్ 2021లో లిస్ట్‌ఏతో పాటు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 2023లో పంజాబ్ కింగ్స్‌కు నెట్‌బౌలర్‌గా వచ్చిన గుర్నూర్ బ్రార్‌కు ఆనతికాలంలోనే జట్టుకు ఆడే అవకాశం వచ్చింది.సెలక్టర్ల దృష్టిలో పడిన గుర్నూర్ బ్రార్‌ను గతేడాది ఇండియాఏ జట్టుకు ఎంపిక చేయడంతో అతడి కెరీర్ మలుపు తిరిగింది.

**నిఖార్సైన స్పిన్ ఆల్‌రౌండర్**

విదర్భకు చెందిన హర్ష్ దూబే నిఖార్సైన ఆల్‌రౌండర్. 2024-25సీజన్‌లో 69వికెట్లను తీసి విదర్భను రంజీ ఛాంపియన్‌గా నిలిపాడు. ఈ ప్రదర్శనతో ఇండియా-ఏ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇక విజయ్ హజారే ట్రోఫీలో కెప్టెన్‌గా విదర్భను నడిపించిన హర్ష్‌దూబే ఆ జట్టుకు తొలి టైటిల్ అందించాడు. దేశవాళీ క్రికెట్‌లో ప్రదర్శనతో హర్ష్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన హర్ష్ దూబే ఆ సీజన్‌లో మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీశాడు. 2026 సీజన్‌కు ఎస్ఆర్‌హెచ్ అతడిని రిటైన్ చేసుకుంది.ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన హర్ష్‌దూబే 8 వికెట్లు తీశాడు.



## పరాగ్వేపై అమెరికా సూపర్ విక్టరీ

**న్యూయార్క్:** ఫిఫా వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా శుభారంభం చేసింది. పరాగ్వేపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ 4-1 గోల్స్ తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఒక మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం అమెరికాకిదే తొలిసారి. సొంత ప్రేక్షకుల మధ్య మొదట్నుంచీ దూకుడుగా ఆడిన అమెరికా.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే డామియన్ గోల్ సాధించి అమెరికాకు ఆధిక్యం అందించాడు.ఇక ఫోలారిన్ వరుసగా రెండు గోల్స్ కొట్టడంతో తొలి అర్ధభాగం సమయానికి 3-0 ఆధిక్యం పొందింది. రెండో అర్ధభాగం 73వ నిమిషంలో మెరోనియో.. పరాగ్వేకు గోల్ అందించాడు. ఇక ఆట అదనపు సమయంలో అమెరికా ప్లేయర్ గియోవన్ని రేనా అదిరిపోయే గోల్ సాధించిపెట్టాడు. దీంతో అమెరికా 4-1 తేడాతో పరాగ్వేపై నెగ్గింది.

**కెనడా-బోస్నియా మ్యాచ్ డ్రా**

అంతకుముందు అర్ధరాత్రి మరో ఆతిథ్య దేశం కెనడా తన తొలి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.బోస్నియాతో జరిగిన పోరులో 1-1తో కెనడా సమంగా నిలిచింది. అయితే ఫిఫా ప్రపంచ కప్‌లో తొలిసారి కెనడా పాయింట్‌ను సాధించడం గమనార్హం. గత ఎడిషన్లలో ఆరు మ్యాచుల్లోనూ కెనడా ఓడింది.

## నెయ్‌మార్‌కు గాయం:మొరాకోతో బ్రెజిల్ తొలి పోరు

**న్యూజెర్సీ:** ఫిఫా వరల్డ్ కప్‌లో మరో హాట్ ఫేవరెట్ బ్రెజిల్ తొలి మ్యాచ్‌ను సిద్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు మొరాకోతో తలపడనుంది. ఈ కీలక పోరుకు ముందు బ్రెజిల్‌కు బిగ్ షాక్ తగిలింది. స్టార్ ఫుట్‌బాలర్ నెయ్‌మార్ గాయం కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. యువ ఆటగాళ్లపై బ్రెజిల్ ఆశలు పెట్టుకుది. రఫిన్హా, వినిసియస్ జూనియర్, మాథ్యూస్ కున్హామెరుగైన ఫామ్‌లో ఉన్నారు. అలాగే ఎండ్రిక్, ఇగోర్ థియాగో వంటి యువ ఆటగాళ్లు కూడా ఆశలు రేకెత్తిస్తున్నారు. మిడ్‌ఫీల్డ్‌లో కాసెమిరో, బ్రూనో గిమారెస్, లూకాస్ పక్వెటా కీలక పాత్ర పోషించనున్నారు. మొరాకోను తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉంది. కెప్టెన్ అష్రఫ్ హాకీమ్, స్టార్ ఫార్వర్డ్ బ్రాహిమ్ డియాజ్ జట్టుకు ప్రధాన బలంగా ఉన్నారు. గత ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన చేసిన మొరాకో ఈసారి కూడా డార్క్ హార్స్‌గా బరిలోకి దిగుతోంది. సమష్టి ఆటతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వగల సామర్థం ఆ జట్టుకు ఉంది.బ్రెజిల్, మొరాకో జట్లు ఇప్పటివరకు రెండుసార్లు తలపడగా 1-1 విజయంతో సమవుజ్జీగా ఉన్నాయి. దీంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెరిగింది.



## గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ భారత్ బిగ్ విక్టరీ

**ధర్మశాల:** అఫ్గానిస్తాన్‌తో సొంతగడ్డపై జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. అఫ్గానిస్తాన్ విధించిన 195 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

లక్ష్య చేధనలో రోహిత్ శర్మ(16)వికెట్‌ను 46 పరుగుల వద్ద కోల్పోయింది. జోరుమీద కనిపించిన రోహిత్ రనౌట్‌గా వెనుదిరిగాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66 బంతుల్లో 84 నాటౌట్).. ఇషాన్ కిషన్(34)తో కలిసి రెండో వికెట్‌కు 70 రన్స్ జోడించాడు.శ్రేయాస్‌అయ్యర్(12) నిరాశపరిచినా... రాహుల్ అండగా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో కేఎల్ రాహుల్ (19 బంతుల్లో 39 నాటౌట్) ధనాదన్ ఇన్నింగ్స్‌తో టీమిండియాకు విజయాన్ని అందించాడు.ఆఫ్గన్ బౌలర్లలో రషీద్, రెహమాన్ షరిఫీ చెరొక వికెట్ తీశారు.

అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు



ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (102) శతకంతో అదరగొట్టాడు.హస్మతుల్లా (26) రాణించాడు. భారత బౌలర్లలో హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్ చెరో 3 వికెట్లు తీయగా, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్‌లు 2 వికెట్లు పడగొట్టారు. ఇరుజట్ల మధ్య రెండో వన్డే బుధవారం లక్నో వేదికగా జరగనుంది.


## సెమీస్‌లో సింధూకు మరోసారి నిరాశ

**సిడ్నీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ఏకైక ఆశాకిరణంగా ఉన్న పీవీ సింధూ కూడా ఫైనల్ చేరకుండానే వెనుదిగిరింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సింధూ 20-22, 12-20తో వరుస గేమ్‌ల్లో టాప్ సీడ్ జపాన్ షట్లర్ అకానే యమగుచి చేతిలో ఓడింది. 43 నిమిషాల పాటు జరిగిన ఈ సెమీస్ పోరులో నెగ్గిన ప్రపంచ ఛాంపియన్ యమగుచి ఫైనల్లో ప్రవేశించింది.

సెమీఫైనల్ పోరును పీవీ సింధూ మంచి ఈజ్‌తో ప్రారంభించింది. చక్కని నెట్ గేమ్‌తో దూకుడు ప్రదర్శించిన సింధూ.. 12-6తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే బ్రేక్ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించిన సమవుజ్జీగా నిలిచింది. ఇద్దరూ పోటీపోటీగా పాయింట్లు రాబట్టడంతో 20-20 వరకు స్కోరు సమంగా కొనసాగింది. ఈ దశలో సింధూ గేమ్ లయ తప్పింది. కీలక దశలో ఎర్రర్స్ చేయడంతో.. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ యమగుచి వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో గేమ్‌లో సింధూ తేలిపోయింది.మరోవైపు జపాన్ షట్లర్ సింధూకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఆధిక్యంలో దూసుకుపోయింది. రెండే గేమ్‌ను మరింత అలవోకగా 21-12తో ముగించి ఫైనల్లో ప్రవేశించింది.



ఈ ఓటమితో 2026 సీజన్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ అందుకోవాలన్న సింధూ కల చెదిరింది. కాగా ఈ సీజన్ బీడబ్ల్యూఎఫ్ టూర్‌లో సింధూ... సెమీఫైనల్లో ఓడడం ఇది రెండోసారి.జనవరిలో జరిగిన మలేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నీలోనూ సింధూ సెమీస్‌లో చైనా షట్లర్ వాంగ్ జియి చేతిలో ఓడింది. చివరగా 2024లో లక్నో వేదికగా జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ నెగ్గింది.




## వడ్డీరేట్లు పెంచిన కెనరా, బరోడా

**ముంబయి,జూన్ 13:** ప్రభుత్వ రంగానికి చెందిన రెండు దిగ్గజ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు సడెన్ షాక్ ఇచ్చాయి. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను పెంచేశాయి. ఎంపిక చేసిన టెన్యూర్లపై గరిష్ఠంగా 5 బేసిస్ పాయింట్ల వరకు ఎంసీఎల్ఆర్ పెంచాయి. సవరించిన ఎంసీఎల్ఆర్ రేట్లు జూన్ 12 నుంచి అమల్లోకి వచ్చాయని బ్యాంకులు పేర్కొన్నాయి. నిధుల వ్యయ ఆధారిత వడ్డీ రేటుగా చెబుతుంటారు. ఇప్పుడు ఎంసీఎల్ఆర్ పెంచిన నేపథ్యంలో ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉన్న లోన్ వడ్డీ రేట్లు పెరుగుతాయని చెప్పొచ్చు. ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్లు తీసుకున్నవారికి ఈఎంఐ పెరుగుతుంది. ఫిక్స్‌డ్ వడ్డీ రేటుకు తీసుకున్నవారిపై ప్రభావం చూపించదని చెప్పొచ్చు. ఆర్బీఐ తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లో కీలక రెపోరేటును మూడోసారి 5.25శాతం వద్ద స్థిరంగానే ఉంచింది.ఎంసీఎల్ఆర్ అనేది కనీస వడ్డీ రేటు. అంటే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇంతకంటే తక్కువ వడ్డీకి లోన్లు ఇచ్చేందుకు వీల్లేదు. అన్ని బ్యాంకులకు ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర బ్యాంక్ 2016లో ఈ విధానం తీసుకొచ్చింది.కెనరా బ్యాంకు ప్రధానంగా తన షార్ట్ టర్మ్ టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ సవరించింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా 7.90 శాతం నుంచి 7.95 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 8శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.25 శాతం, 6 నెలల ఎంసీఎల్ఆర్ కూడా 5 బేసిస్ పాయింట్లు పెరిగి 8.60 శాతానికి పెరిగింది. ఎక్కువగా కన్జూమర్ లోన్లకు లింక్ అయి ఉండే ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 8.75 శాతంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్లు మరో ప్రభుత్వ రంగ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడా 5 టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ పెంచింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరిగి 7.80 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 7.95 శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.20 శాతానికి చేరింది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.50 శాతం, ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగడంతో 8.75 శాతానికి చేరింది.




### వాడకంలో లేని బ్యాంకు ఖాతాలు తొలగించండి

## కస్టమర్లకు బ్యాంకర్ల హెచ్చరికలు

**ముంబయి,జూన్ 13:** డిజిటల్ చెల్లింపులు పెరిగిన తర్వాత యూపీఐ చాలా మందికి రోజువారీ జీవితంలో భాగమైంది. డబ్బు పంపాలన్నా, బిల్లు చెల్లించాలన్నా యూపీఐనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వాడకంలో లేని బ్యాంకు ఖాతాలను తొలగించుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీఐలో ఒకేమొబైల్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను లింక్ చేసే అవకాశం ఉంటుంది.కొత్తబ్యాంక్ ఖాతా జోడిస్తే పాతది ఆటోమేటిక్‌గా తొలగిపోదు.అది కూడా యాప్‌లో కనిపిస్తూనే ఉంటుంది. అందుకే అవసరం లేని అకౌంట్లను స్వయంగా తొలగించాలి.వాడని బ్యాంక్‌ఖాతా యూపీఐలో ఉంటే కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆ ఖాతా ఇక యాక్టివ్‌లో లేకపోతే లావాదేవీలు విఫలమవుతాయి. రిఫండ్‌లు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. కొన్ని ఆటో డెబిట్ చెల్లింపులు కూడా ప్రభావితమవుతాయి. ఒకే యాప్‌లో చాలా బ్యాంక్ ఖాతాలు కనిపిస్తే ఏ ఖాతా ప్రస్తుతం ఉపయోగంలో ఉందో గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా వృద్ధులు లేదా డిజిటల్ చెల్లింపులకు కొత్తగా అలవాటు పడుతున్న వారికి ఇది గందరగోళం కలిగించవచ్చు. అందుకే ప్రస్తుతం వాడుతున్న ఖాతాలను మాత్రమే ఉంచుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు.బ్యాంక్ ఖాతామార్చిన తర్వాత యాక్టివ్ ఆటోపేలు, ఈఎంఐలు, సబ్‌స్క్రిప్షన్లు ఏ ఖాతాకు లింక్ అయ్యాయో ఒకసారి చెక్ చేయాలి. కొంతకాలానికోసారి యూపీఐలో ఉన్న బ్యాంక్ ఖాతాల జాబితాను పరిశీలించడం మంచిది. అవసరం లేని ఖాతాలను తొలగిస్తే యాప్ వినియోగం సులభంగా ఉంటుంది.

# ఈవీ డెలివరీ కోసం మూడునెలల వెయిటింగ్!

**ముంబయి,జూన్ 13:** పెట్రోలు డీజిల్‌ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో, వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలు ఈవీల వైపు మళ్లుతుండటంతో ఈవీ కార్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగి, డెలివరీ కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.మారుతి సుజుకి, టాటా మోటార్స్, మెర్సిడెస్‌బెంజ్, మహీంద్రా వంటి ప్రముఖ కంపెనీల పాపులర్ మోడళ్ల కోసం ప్రస్తుతం 3 నెలల వరకు వెయిటింగ్ పీరియడ్ నడుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల పుణ్యమా అని బయ్యర్లు ఇపుడు విద్యుత్ వాహనాలవైపు దృష్టి మార్చారు. అధిక ధరలు, ఛార్జింగ్ సదుపాయాల కొరత వంటి కారణాలతో ఈవీల కొనుగోలుకు వెనుకాడిన వినియోగదారులు, ఇప్పుడు వాటపైనే ఆసక్తి కనబరుస్తున్నారు.

మార్చి నెల నుంచి తమ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ) డిమాండ్ 40 శాతం మేర పెరిగిందని మెర్సిడెస్‌బెంజ్ ఇండియా వెల్లడించింది. ఏప్రిల్‌లో విడుదలైన సీఎల్ఏ బీఈవీ మోడల్‌కు రెండు నుంచి 3 నెలల వెయిటింగ్ పీరియడ్ సమయం ఉందని,




దీనివల్ల డీలర్లు కొత్త బుకింగ్స్‌ను నిలిపివేశారని కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఇదే తరహాపరిస్థితులను ఎదుర్కొంటోంది.మేనెలలో ఆ కంపెనీ మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 33 శాతానికి చేరుకోవడం విశేషం.

దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకికి చెందిన కొత్త ఈవిటారా ఎస్‌యూవీ బుకింగ్స్ గత నెలలో రెట్టింపయ్యాయని, దీంతో 6 నుంచి 8 వారాల నిరీక్షణ తప్పడం లేదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ వివరించారు. అదే విధంగా మహీంద్రా ఎక్స్‌యూవీ 9ఈ మోడల్‌కు 6నుంచి 8 వారాలు, టాటా మోటార్స్ పంచ్, టియాగో ఈవీలకు 6 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. 2026 మేలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 26,000 యూనిట్లను దాటాయి. ఇది గతేడాదితో పోలిస్తే 80 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో ఈవీల వాటా తొలిసారిగా 11 శాతాన్ని అధిగమించింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచేందుకు ఆటోమొబైల్ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, సరఫరా వ్యవస్థలో తలెత్తిన సమస్యలు సవాలుగా మారాయి. ఇంధన ధరల అనిశ్చితి నేపథ్యంలో, ఆర్థికంగా పొదుపు మార్గంగా వినియోగదారులు సహజంగానే ఈవీల వైపు ఆకర్షితులవుతున్నారు.



### ఫోర్బ్స్ జాబితాలో భారత సంతతి సిఇఒ

## రూ.57వేల కోట్లతో ఏడో స్థానం

**సిలికాన్‌వ్యాలీ,జూన్ 13:** అమెరికా ఐటి నగరం సిలికాన్ వ్యాలీలో ఒక ఎన్ఆర్ఐ మహిళ రికార్డు సాధించారు. గ్లోబల్ టెక్నాలజీ సంస్థ అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ అయిన జయశ్రీ ఉల్లాల్ అగ్రరాజ్యంలో సరికొత్త రికార్డుని నెలకొల్పారు. 2026 సంవత్సరానికి గాను ఫోర్బ్స్ ప్రకటించిన సొంతంగా ఎదిగిన అత్యంత సంపన్న మహిళలు జాబితాలో ఆమె అత్యున్నత స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక లిస్ట్‌లో నిలిచిన ఏకైక భారత సంతతి మహిళ జయశ్రీ. ఫోర్బ్స్ జాబితా ప్రకారం జయశ్రీ ఉల్లాల్ నికర ఆస్తి విలువ ఏకంగా 6.8 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 56,700 కోట్లకు పైగా ఉంది. ఈ భారీ సంపదతో ఆమె ఫోర్బ్స్ వార్షిక జాబితాలో ఏడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుత రియల్ టైమ్ మార్కెట్ విలువ ప్రకారం ఆమె ఆస్తి 6.5 బిలియన్ డాలర్లుగా ఉన్నప్పటికీ ప్రపంచ బిలియనీర్ల సరసన ఆమె అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. నెట్‌వర్కింగ్, సెమీకండక్టర్ రంగాలలో ఆమె మూడు దశాబ్దాలుగా అందించిన అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది.

2008 నుంచి ఆమె సారథ్యం వహిస్తున్న అరిస్టా నెట్‌వర్క్స్ సాధించిన విజయాలే ఆమెను ఈ స్థాయికి చేర్చాయి. జయశ్రీ ఉల్లాల్ లండన్‌లో జన్మించినప్పటికీ ఆమె బాల్యమంతా దేశ రాజధాని న్యూఢిల్లీలోనే గడిచింది. చిన్నతనం నుంచే టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాలపై ఆమెకు అమితమైన ఆసక్తి ఉండేది. ఉన్నత విద్య కోసం ఆమె అమెరికాకు వలస వెళ్లారు. శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్శిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన జయశ్రీ ఉల్లాల్ ఆ తర్వాత శాంటా క్లారా యూనివర్శిటీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ పట్టా పొందారు.

అరిస్టా నెట్‌వర్క్స్ బాధ్యతలు చేపట్టడానికి ముందు జయశ్రీ సిలికాన్ వ్యాలీలోని దిగ్గజ సంస్థలైన ఏఎండీ, ఫెయిర్‌చైల్డ్ సెమీకండక్టర్స్ వంటి కంపెనీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అరిస్టా సంస్థలో జయశ్రీకి 3 శాతం వాటా ఉంది. దీంతో పాటు జయశ్రీ ఉల్లాల్ ప్రముఖ క్లౌడ్ కంపెనీ స్నోఫ్లేక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లోనూ సేవలు అందిస్తున్నారు.

## స్పేస్‌ఎక్స్ ఐపిఒతో మిలియనీర్లుగా ఉద్యోగులు!

**న్యూయార్క్, జూన్ 13:** అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ భారీ స్థాయిలో నిర్వహించిన ఐపీఓ సంస్థ ఉద్యోగులను మిలియనీర్లు చేసింది. సంస్థ షేర్ల లిస్టింగ్ అనంతరం 4,400 మందికి పైగా ఉద్యోగులు మిలియనీర్లుగామారిపోయారు. నాస్‌డాక్‌లో ఒక్కో షేర్‌ను 150 డాలర్ల ధరకు స్పేస్‌ఎక్స్ లిస్టింగ్ చేయగా, ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే షేరు ధర మరింత పెరిగింది. దీంతో సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్లు, రాకెట్ ప్రయోగాల సిబ్బంది, గంటల వారీ వేతనంపై పనిచేసే కార్మికులు సైతం భారీ సంపదను సొంతం చేసుకున్నారు.వీరిలో దాదాపు 400 మంది ఉద్యోగుల ఆస్తుల విలువ 100మిలియన్ డాలర్లకు మించి ఉండనున్నట్లు అంచనా.సాధారణంగా చాలా ఐపీఓల్లో వ్యవస్థాపకులే బిలియనీర్లుగా మారుతారు. కానీ 400 మంది ఉద్యోగులు ఈ స్థాయికి చేరుకోవడం అరుదైన విషయమని హిల్ డాట్‌కో విశ్లేషకుడు ఆండ్రూబెన్సన్ పేర్కొన్నారు.




ఇక స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఈ లిస్టింగ్‌తో ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా నిలిచారు. కంపెనీ ఉద్యోగుల్లో గావిన్ పెటిట్ అనే ఉద్యోగి 2012లో 80వేల డాలర్ల జీతంతో సంస్థలో చేరాడు. ఆ సమయంలో ఒక్కో షేర్ విలువ కేవలం 13.80డాలర్లే.అప్పట్లో స్పేస్‌ఎక్స్ రాకెట్ ప్రయోగాలు వరుసగా విఫలమవుతున్నప్పటికీ, నగదు బోనస్‌లకు బదులుగా షేర్లను స్వీకరించాలని ఆతడు తీసుకున్న నిర్ణయం ఇపుడు అతనికి అపార సంపదను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం అతని వద్ద 50,000కు పైగా షేర్లు ఉన్నాయి.

## ద్రవ్యోల్బణ పెరుగుదలతో రెపోరేట్లలో మార్పులు




**ముంబయి,జూన్ 13:** దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుండటంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచేదిశగా అడుగులు వేస్తోందని ఐసీఐసీఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ నివేదిక అంచనా వేసింది. రాబోయే రోజుల్లో ఆర్‌బీఐ రెపో రేటును 50 నుంచి 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఈ మార్పులు చోటుచేసుకోవచ్చని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ విశ్లేషణ ప్రకారం 2026-27ఆర్థిక సంవత్సరంలో దేశీయ ద్రవ్యోల్బణం 5 శాతానికి చేరే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చు తగ్గులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు దేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఆహార వస్తువుల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి ఆర్‌బీఐ సాధారణంగా వడ్డీ రేట్లను పెంచుతుంది.ప్రస్తుతం ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఒకవేళ ఐసీఐసీఐ బ్యాంక్ అంచనాలే నిజమైతే, 50-75 బేసిస్ పాయింట్ల పెంపుతో రెపోరేటు 5.75నుంచి 6.00 శాతానికి చేరే ప్రమాదం ఉంది.గత కొన్ని త్రైమాసికాలుగా యథాతథ స్థితిని కొనసాగించినప్పటికీ మారుతున్న ఆర్థిక సమీకరణాల దృష్ట్యా రానున్న ద్రవ్య పరపతి సమీక్షల్లో కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్‌బీఐ గనుక రెపో రేటును పెంచితే, వాణిజ్య బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.